ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 274 పేజీలు: 10+4 వెల: 6.50

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## పట్టాలపై దారుణం

# గూడ్స్‌ను ఢీకొన్న ప్యాసింజర్

### బిలాస్‌పూర్‌లో దారుణం.. దెబ్బతిన్న 3 బోగీలు

### పదిమంది మృతి, పలువురికి గాయాలు

**బిలాస్‌పూర్, నవంబరు 4:** ప్రయాణీకులతో వెళుతున్న మెమూరైలు ఎదురుగా వస్తున్న సరుకురవాణా గూడ్స్ రైలును ఢీకొనడంతో కనీసం పది మంది మృతిచెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. బిలాస్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఈప్రమాదంలో అనేక కోచ్‌లు పట్టాలు >>2


బిలాస్‌పూర్‌లో గూడ్సును ఢీ కొన్న ప్యాసింజర్

## రోడ్డుపై ఘోరం

# ట్రక్కును ఢీకొన్న కారు

### బారాబంకిలో ఘోర ప్రమాదం

### ఆరుగురు మృతి, పలువురికి గాయాలు



**బారాబంకి, నవంబరు 4:** రాజస్థాన్, తెలంగాణలో జరిగిన సంఘటనలు మరవక ముందే యూపీలో మరో ఘోర రోడ్డు ప్రమాదం వెలుగు చూసింది. బారాబంకి లోని దేవాఫతేపూర్ రహదారిపై ఓ కారును ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్పాట్‌లోనే ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు >>2



# అజారుద్దీన్‌కు శాఖలు కేటాయింపు

### మైనారిటీ సంక్షేమం, ప్రభుత్వరంగ సంస్థలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్4:** ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో >>2

# రాజధానిలో జిసిసి

### సిఎం రేవంత్‌తో జర్మనీ కాన్సుల్ జనరల్ భేటీ

### వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

### జర్మనీ టీచర్లను రప్పించాలని కోరిన సిఎం

### అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం కూడా సిఎంతో చర్చలు


మంగళవారం సిఎం రేవంత్‌తో భేటీ అయిన జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్4:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా రాజధాని నగరం హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ను ప్రారంభిస్తున్నట్లు జర్మనీ బృందం తెలిపింది. జిసిసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సిఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని రేవంత్ రెడ్డి మైకేల్ బృందాన్ని కోరారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జిసిసి ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో సుమారు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు జర్మనీ బృందం సిఎం రేవంత్‌రెడ్డికి వెల్లడించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని సీఎం వారిని కోరారు. జర్మనీ టీచర్లను ఇక్కడ నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్‌ను సిఎం కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ఎల్లప్పుడూ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని సీఎం తెలిపారు. ఐటీ,ఫార్మా,ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని సిఎం కోరారు. వీటితో టోమ్‌కామ్ ద్వారా పాటు వొకేషనల్ ఎడ్యుకేషన్,స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని సిఎం కోరారు. ఈ భేటీలో అమిత >>2



# 'రీయింబర్స్' కమిటీ

### నిధుల సమీకరణకు కొత్త యత్నం

### చైర్మన్‌గా సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

### ఉన్నవిద్యా సంస్థల సమాఖ్య నుంచి కమిటీలో ముగ్గురు సభ్యులు

### మూడు నెలల్లో నివేదికకు ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 4:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో సంస్కరణలు, నిధుల సమీకరణ కోసం కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా కొనసాగుతూ వివిధ సంక్షేమ శాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య(ఫాతి) ప్రతినిధులను ముగ్గురిని కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 3 నెలల్లో కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని సూచించింది. అక్టోబరు 28న ప్రజాభవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సంఘాల సమాఖ్య (ఫాతి)తో ఉప ముఖ్యమంత్రి జరిపిన చర్చల సందర్భంగా, ఉన్నత విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను సమీకరించడానికి, ప్రత్యేక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి కొన్ని సూచనలు చేశారు. సూచనలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఫాతి ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది, సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసూనత ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ఛైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి,సభ్యులుగా విద్యశాఖ, ఎస్‌సి డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ కోదండరామ్‌తోపాటు ఫాతి నుంచి ముగ్గురు ప్రతినిధులు కమిటీ సభ్యులుగా ఉంటారు. కమిటీ ఛైర్మన్ ఎవరైనా ఒకరిని నామినేటెడ్ సభ్యుడిగా నియమించుకోవడం అవకాశం కల్పించగా.. ఎస్‌సి డెవలప్‌మెంట్ >>2



# గుదిబండలా విద్యుత్ డిస్కంలు!

### వివిధ రాష్ట్రాల కరెంటు పంపిణీ సంస్థలకు లక్షల కోట్లలో నష్టాలు

### దేశ జిడిపిలో 2.4 శాతంగా నమోదు

### ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారుతున్న విధానం

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై భారంగా తయారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ పంపిణీ సంస్థలను తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవడంతో వాటి పరిస్థితి క్రమేపీ దిగజారుతోంది. ఈ నేపథ్యంలోనే 2022-23 నాటికి రాష్ట్ర డిస్కమ్‌ల మొత్తం పోగుపడిన నష్టాలు రూ.6.5 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది దేశ జిడిపిలో 2.4 శాతంగా నమోదైంది. ఈ మేరకు వీటికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒక డ్రాగ్‌గా కొనసాగుతున్నాయని ఆందళన వ్యక్తం చేసింది. వివిధ సంస్కరణల ప్రయత్నాలు ఉన్నప్పటికీ డిస్కమ్‌లు రాష్ట్రాలకు ఒక ముఖ్యమైన సవాలుగా ఉన్నాయని తెలిపింది. దీనిని పరిష్కరించడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడం, ప్రసార మరియు పంపిణీ నష్టాలను తగ్గించడంతో పాటు, విద్యుత్ సరఫరా యొక్క వాస్తవ వ్యయంతో సుంకాలను సర్దుబాటు చేయడం వంటి చర్యల యొక్క ప్రాముఖ్యతను గూర్చి నొక్కి చెప్పింది. ఇతర సిఫార్సు దశల్లో విద్యుత్ సరఫరా పరిశ్రమను విడదీయడం మరియు విద్యుత్ ఉత్పత్తి మరియు పంపిణీని ప్రైవేటీకరించడం ఉన్నాయి. తద్వారా రాష్ట్ర ఆర్థిక నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది వెల్లడించింది. డిస్కమ్‌లను ఆర్థిక బలోపేతం చేసే విధంగా పెంపొందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక మొత్తం నాణ్యతను మెరుగుపరచడానికి ఈ చర్యలు కీలకమైనవని వివరించింది. అనేక ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నాలు ఉన్నప్పటికీ, 2016-17 నుండి డిస్కమ్‌ల మొత్తం బకాయిలు సగటు వార్షిక రేటు >>2


రహ్మత్‌నగర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

# బిఆర్ఎస్‌కు బిజెపి రక్షణ

### కెసిఆర్, హరీష్‌ను ఎందుకు అరెస్టు చేయరు?

### మూడు నెలలైనా సిబిఐ ఎఫ్ఐఆర్ చేయలేదు..

### ఫార్ములారేస్‌లో కెటిఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతివ్వడంలేదు..

### రహ్మత్‌నగర్ బహిరంగ సభలో సిఎం రేవంత్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 4, ప్రభాతవార్త:** కాళేశ్వరంలో జరిగిన లక్షకోట్ల అవినీతి వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ సిబిఐకి ఫిర్యాదు చేసి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలదేని, వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీని సూటిగా ప్రశ్నించారు. సిబిఐకి ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని చెప్పిన కిషన్‌రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారంటూ ఆయన ప్రశ్నించారు. ఈ-ఫార్ములా రేస్ వ్యవహారంలోనూ రూ. 50 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేసిన కేటీఆర్‌పై ఫిర్యాదు చేసి రెండు నెలలు గడుస్తున్నా గవర్నర్ ఎందుకు అనుమతించడం లేదంటూ నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికల్ బంధమని, బీఆర్ఎస్‌ను కాపాడుతుంది బీజేపీనేనని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి రహ్మత్‌నగర్ కూడలిలో నిర్వహించిన రోడ్‌షోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం కట్టుడు, కూలుడు మూడేళ్లలో జరిగిందని, ఇందులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని ప్రధాని మోడి, కేంద్ర మంత్రి అమిత్‌షా పలుమార్లు ఆరోపించారన్నారు. సిబిఐకి ఫిర్యాదు చేస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీష్ రావును అరెస్ట్ చేస్తామని కిషన్‌రెడ్డి అన్నారని, జ్యుడిషియల్ కమిషన్ వేసి విచారణ చేసి నివేదిక తెప్పించి అసెంబ్లీలో చర్చించి సిబిఐకి ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదో స్పష్టం చేయాలన్నారు. మోడి ఎందుకు అడ్డుకుంటున్నాడు, అమిత్‌షా కేసీఆర్‌ను >>2



# చేవెళ్ల ప్రమాదంపై హెచ్ఆర్‌సి సుమోటోగా కేసు

**చేవెళ్ల,నవంబర్ 4,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ వివిధ దిన పత్రికలో వచ్చిన అనేక కథనాన్ని ఆధారంగా తీసుకుని చర్యలు చేపట్టింది. రోడ్డు భద్రతా లోపాలు, అధిక వేగం, హైవే విస్తరణ ఆలస్యం, >>2

# నైపుణ్య మార్పిడితో పురోగతి

### ఐటి, ఫార్మా, క్రీడల్లో సహకారానికి తెలంగాణ సిద్ధం

### క్యూబా రాయబారితో భేటీలో ఐటి మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 4 ప్రభాతవార్త:** ద్వైపాక్షిక సహకారం ద్వారా నైపుణ్యాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకొని ఉమ్మడి పురోగతి వైపు కలిసి అడుగేద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. తెలంగాణ - క్యూబా మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా, ఫస్ట్ సెక్రటరీ మిక్కీ డియాజ్ పెరెజ్‌తో మంత్రి మంగళవారం సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బయో టెక్నాలజీ, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ, ఏఐ, ఇన్నోవేషన్, అగ్రికల్చర్, సస్టైనబుల్ ఫార్మింగ్, స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్, కల్చర్ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేస్తున్న కృషిని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. టిహబ్, టీవర్క్స్, విహబ్ ద్వారా క్యూబా స్టార్టప్స్‌కు మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ఏఐ ఆధారిత డయాగ్నోస్టిక్స్, ఫార్మా రీసెర్చ్, పబ్లిక్ హెల్త్ డేటా తదితర అంశాల్లో సహకారం అందిస్తామన్నారు. ప్రపంచంలోని టాప్ 7 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలిచిన జీనోమ్ వ్యాలిని సందర్శించాలని క్యూబా ప్రతినిధులను ఆహ్వానించారు. బాక్సింగ్, >>2


మంగళవారం హైదరాబాద్‌లో క్యూబా రాయబారితో మంత్రి శ్రీధర్ బాబు



# బాధితులకు ఏదీ కోటి పరిహారం?

### సిగాచీ పేలుడు ఘటనపై హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్4:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి >>2

### రేపటి నుంచి మరో నలుగురు

# ఎమ్మెల్యేల విచారణ

### అనర్హత పిటిషన్ల వ్యవహారం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్4:** పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారణ ప్రక్రియ ప్రారంభించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల >>2




లైంగిక వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న డాక్టర్ సంపద ముండేకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నాగ్‌పూర్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన జరిపిన మహారాష్ట్ర అసోసియేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ సభ్యులు

# ట్రక్కును ఢీకొన్న కారు

>> కోల్పోయిగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరించారు. దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. దేవాఫతేపూర్ హైవేపై వేగంగా దూసుకొచ్చిన ఒక ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రక్కు కారును క్రేన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిన్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## గూడ్స్‌ను ఢీకొన్న ప్యాసింజర్‌రైలు

>> తప్పాయి. కాగామెము రైలు ముందుభాగం గూడ్స్ కంపార్టుమెంట్లపైకి ఎక్కింది. సీనియర్ రైల్వే అధికారులు, స్థానిక యంత్రాంగం మొత్తం స్పాట్‌కు చేరుకుని ప్రయాణీకులను రైలునుంచి దిగి ప్రత్యామ్నాయ రైళ్లలో పంపించారు. సాయంత్రం నాలుగు గంటలప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే అన్ని కోచ్‌లను తప్పించారు. తీవ్ర గాయాలపాలయిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మెమూరైలు కోర్బాప్యాసింజర్ రైలు అని అధికారులు తెలిపారు. మొదటి రెండు బోగీలు, మొట్టమొదటి రిజర్వు బోగీ కూడా తీవ్రస్థాయిలో దెబ్బతిన్నది. రైల్వే అధికారులు బాధితుల సమాచారం కోసం అత్యవసర నంబర్లు ప్రకటించారు. అలాగే మృతుల కుటుంబాలకు తక్షణ పరిహారం కూడా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలుచొప్పున తీవ్ర గాయాలపాలయినవారికి రూ.5 లక్షలు చొప్పున మంజూరుచేసారు. అలాగే రైల్వే ప్రమాదంలో ఒకమోస్తరు గాయాలు పాలయినా సరే వారికి లక్ష రూపాయలు పరిహారం తక్షణ ఖర్చులకింద చెల్లిస్తున్నట్లు రైల్వేశాఖప్రకటించింది.

# రాజధానిలో జిసిసి

>> దేశాయ్, ద్యుయిష్ బోర్స్ సిఐఓ/సిఓఓ డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తర్వాత అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం సిఎం రేవంత్ రెడ్డితో భేటీ అయింది. తెలంగాణ రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యుఎస్) ప్రాజెక్టులను విస్తరించాలని, ఆ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఏడబ్ల్యూఎస్ ప్రాజెక్టు పనులు, విస్తరణ ప్రణాళికలపై సీఎంతో వారు చర్చించారు. రాష్ట్రంలో ఏడబ్ల్యూఎస్ కంపెనీ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.

# 'రీయింబర్స్' కమిటీ

>> శాఖ కమిషనర్ కన్వీనర్‌గా కొనసాగుతారు. కమిటీ ట్రస్ట్ బ్యాంక్ ద్వారా స్వయం స్థిరమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అధ్యయనం చేయడం, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపు విధానం హేతుబద్ధీకరణ కోసం నిర్మాణాత్మకమైన బలమైన ఇన్‌పుట్‌లు అందించడం, ఉన్నత విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని సూచించింది. కమిటీ తమ సూచనలు, ప్రతిపాదనలను పరిశీలించి 3నెలల్లో ప్రభుత్వానికి సమర్పించాలని సూచించింది. రాష్ట్రంలో రూ. 10వేల కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ఈ నెల 3వ తేది నుంచి కాలేజీలు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజులుగా బంద్‌ను కొనసాగిస్తున్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న కాలేజీల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందితో హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో మీటింగ్‌ను ఏర్పాటు చేయాలని, 11న 10 లక్షల మంది విద్యార్థులతో ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు ఫాతి నాయకులు ప్రకటించారు.

## బాధితులకు ఏదీ కోటి పరిహారం?

>> విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున వసుదా నాగరాజు వాదనలు వినిపించారు. పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. "192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు" అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ. కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

# నైపుణ్య మార్పిడితో పురోగతి

>> అథ్లెటిక్స్‌లో క్యూబా నైపుణ్యాన్ని తెలంగాణకు అందించాలని కోరారు. నూతన ఆవిష్కరణలు, ఇన్నోవేషన్ డ్రివెన్ ప్రోగ్రెసివ్ విధానాలను అవలంభిస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని క్యూబా రాయబారి జువాన్ కార్లోస్ మార్సన్ అగులేరా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రమోషన్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## శాఖలు కేటాయింపు

>> ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ ఇప్పటి వరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పరిధిలో ఉంది. మైనారిటీ సంక్షేమ శాఖ ఇప్పటి వరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరిధిలో ఉంది. ఇంకా సిఎం రేవంత్‌రెడ్డి వద్ద హోమ్, ఎడ్యుకేషన్, కమర్షియల్ తదితర కీలక శాఖలు ఉన్నాయి. మంత్రి లక్ష్మణ్‌కుమార్ వద్ద ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు ఉన్నాయి. తనకు హోం శాఖ కావాలని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింకు హోంశాఖ ఇచ్చిందని.. ఇప్పుడు తనకు కూడా హోంశాఖఇచ్చి ప్రాధాన్యత కల్పించాలని అజారుద్దీన్ పట్టుబడినప్పటికీ ఆయనకు ఆ శాఖ ఇచ్చేందుకు సిఎం రేవంత్‌రెడ్డి సుముఖత చూపలేదని సమాచారం. జూబ్లీహిల్స్‌లో గతంలో 16 వేలఓట్ల తేడాతో ఓడిపోయిన అజారుద్దీన్‌తో తిరిగి పోటీ చేయించడం కంటే, గవర్నర్ కోటా కింద శాసన మండలి సభ్యుడిగా అవకాశం కల్పిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అజారుద్దీన్‌తో పాటు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు (టీజేఎస్) కోదండరామ్‌ను గవర్నరు కోటా కింద ఎమ్మెల్సీగా ఎంపిక చేసి అందుకు సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం కోసం పంపించారు. ఇంత వరకు గవర్నర్ ఆమోదించలేదు. కాగా, గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ అజారుద్దీన్ ఎంపిక విషయంలో ఏదైనా సాంకేతికపమైన ఇబ్బంది తలెత్తితే వచ్చే ఏడాదిలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీల్లో ఇతర కోటా కింద ఎంపిక చేసేందుకు అవకాశం ఉందని అంచనా వేసిన ఏఐసిసి ఆనిర్ణయం తీసుకుంది.

# సుమోటోగా కేసు

>> అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రవాణా శాఖ, హోంశాఖ, గనులు, భూగర్భ శాస్త్రం, ఎన్ఏహెచ్ఐ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, అలాగే టీజీఎస్ ఆర్టీసీ అధికారుల నుంచిమృత్యుఘోఆర్టీసీ బస్సును ఢీకొన్న కంకర టిప్పర్13 మంది దుర్మరణంప్రమాదంపై సమగ్ర నివేదికలను డిసెంబర్ 15, 2025 ఉదయం 11 గంటలలోపు సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. మరింత విచారణ జరిపి బాధ్యత వహించాల్సిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ మేరకు ఇవాళ హెచ్ఆర్సీ ఒక ప్రకటన తెలిపింది.

## వారం - వర్జ్యం

**05-11-2025, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**కార్తీకమాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, శుక్లపక్షం**
○ పౌర్ణమి సా.6.48
అశ్విని ఉ.9.39, స్వాతి కార్తె
వర్జ్యం : సా.6.01-7.25
దు.ఉ.11.29-12.15
శుభసమయం:.6.15-6.50, సా.4.30-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. నూతన ప్రయత్నాలు లాభిస్తాయి. సంఘంలో ప్రత్యేక గౌరవం లభిస్తుంది.

**వృషభం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపారాలు పురోభివృద్ధి ఉంటాయి.

**మిథునం:** ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలం. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** మీ మాట తీరు కొంత కటువుగా, ఎదుటి వారిని నొప్పించే విధంగా ఉంటుంది. జాగ్రత్త అవసరం.

**సింహం:** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరుతాయి. వాహన యోగం. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కన్య :**ఓర్పు, నేర్పుతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. నూతన కాంట్రాక్టులు లభిస్తాయి.

**తుల :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్త్రాల కొనుగోలు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** చిన్ననాటి మిత్రు సహాయ సహకారాలతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**ధనుస్సు:** మాట మీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు అవసరం. ఉద్యోగులకు బదిలీల సూచన.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**కుంభం:** మీ ఆలోచనా విధానం మంచి మార్పు వస్తుంది. స్వల్ప ధనలాభం. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి.

**మీనం :** దూరపు బంధువుల నుండి వచ్చిన వార్త ఆనందం కలుగుతుంది. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 12 రాష్ట్రాల్లో 'సర్' షురూ

## సుప్రీంలో తమిళనాడు సర్కార్ పిటిషన్

## కోల్‌కతాలో మమతాబెనర్జీ నిరసన ర్యాలీ

**న్యూఢిల్లీ, నవంబరు 4:** కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నుంచి 9 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్' స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) శ్రీకారం చుట్టింది. డిసెంబరు 4 వరకు ఓటర్ల వివరాలను ఎన్నికల కమిషన్ సేకరించనుంది. ఇందులో భాగంగా 51 కోట్ల ఓటర్ల వద్దకు బూత్‌లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించి అప్‌డేట్ చేస్తారని అధికారులు తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహించే ప్రాంతాల జాబితాలో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, గోవా, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్, లక్షదీప్ ఉన్నాయి. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం జరుగనుంది. డిసెంబర్ 9న సవరించిన ఓటర్ల జాబితా ముసాయిదాను ఇసి విడుదల చేయనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ఎస్ఐఆర్ ముగియనుంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, పుదుచ్చేరిల్లో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ)ను తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే అఖిలపక్ష సమావేశం నిర్వహించి, న్యాయపోరాటానికి దిగింది. 'సర్' రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేసూత్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, 'సర్'ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కోల్‌కతాలో పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సంఘం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పారదర్శకంగా సాగాలని, ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్లను ఏకపక్షంగా తొలగిస్తే, తాము చూస్తూ ఊరుకోమని పరోక్షంగా హెచ్చరించారు.

## రేవంత్‌కి నోటి విలువ.. నీటి విలువ తెలియదు: నిరంజన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్4:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నోటి విలువ, నీటి విలువ తెలియదు అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి విమర్శించారు. 60 ఏండ్ల కలను సాకారం చేసిన కెసిఆర్ గురించి సిఎం రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడడం సరికాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏం చేస్తారో చెప్పకుండా ఇప్పుడు కూడా కెసిఆర్ మీద, హరీష్ రావు మీద ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 14 ఏండ్లు ఒక ప్రత్యేకమైన పద్ధతిలో ప్రపంచ ఉద్యమాలకు కొత్త నిర్వచనం ఇచ్చేలా కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం పోరాడామని తెలిపారు. 60 ఏండ్ల తెలంగాణ కలను సాకారం చేయడం కోసం తెలంగాణ ప్రజల మీద జరిగిన దాడి, వివక్ష, అవమానాలను ప్రజలకు వివరించి తెలంగాణ సబ్బండ వర్గాలను ఏకంచేసి తెలంగాణను సాధించిన కెసిఆర్ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 10 ఏండ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో కెసిఆర్ అద్భుతంగా పనిచేశారని, దానికి ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదని పేర్కొన్నారు.

## వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమే: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్4:** దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశంలోని 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు.

ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు.




గురునానక్ జయంతి సందర్భంగా అమృత్‌సర్ నుంచి పాక్ బయలుదేరిన సిక్కులు

# బిఆర్ఎస్‌కు బిజెపి రక్షణ

>> ఎందుకు రక్షిస్తున్నాడంటూ ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటి కాదని అంటే ఈ నెల 11లోపు వారిని అరెస్ట్ చేసే దమ్ముందా అన్నారు. కాంగ్రెస్ పార్టీ, చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధిని కేసీఆర్, కేటీఆర్‌లు తమ అభివృద్ధిగా చూపుతూ ఫోటోలు దిగారన్నారు. పీజేఆర్ మరణం తరువాత ఉపఎన్నికల్లో అభ్యర్థిని నిలిపడమే కాకుండా పీజేఆర్ కుటుంబం కేసీఆర్‌ను కలవడానికి వెళితే మూడు గంటలపాటు ఇంటి ముందు నిలబెట్టలేదా అంటూ ప్రశ్నించారు. ఒక్క పీజేఆర్ విషయంలోనే కాదని పాలేరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ మంచి సంప్రదాయాన్ని కాలరాసి అభ్యర్థులను నిలిపింది కేసీఆర్ కాదా అంటూ ప్రశ్నించారు. అప్పుడు కనిపించని ఆడబిడ్డలు ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థులుగా కనిపిస్తున్నారా అంటూ నిలదీశారు. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనేనని, మీ జాతికి నీతి ఉంటే పీజేఆర్‌పై పోటీ పెట్టినందుకు రహ్మత్‌నగర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. జన్వాడలో 100 ఎకరాలు కేటీఆర్‌కు, గజ్వేల్‌లో 1000 ఎకరాలు కేసీఆర్, మొయినాబాద్‌లో 50 ఎకరాలు హరీష్‌రావు, శంకరపల్లి కవిత ఫాంహౌజ్‌లు ఉన్న విషయం నిజమా కాదా..! అన్నారు. కాదని అంటే 48 గంటల్లో వంద బస్సులు పెట్టి ప్రజలకు వాటిని చూపిస్తానని అన్నారు. రబ్బరు చెప్పులు వేసుకొని వచ్చిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు లక్షల కోట్లు ఎలా సంపాదించిందని, ప్రజలకు సమాధానమివ్వాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అయిదేళ్లు ఒక మహిళకు మంత్రి పదవి ఇవ్వలేదని అలాంటి వ్యక్తిని చీపురు దెబ్బలు కొట్టాలంటూ మాట్లాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14159 రేషన్ కార్డులు, ఉచిత కరెంటు 25వేల మందికి, 20వేల కుటుంబాలకు సన్నబియ్యం వస్తుందన్నారు. ఎన్నికల తరువాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పేదలకు 4వేల ఇందరిమ్మ ఇళ్లను అందించే బాధ్యత తనదని అన్నారు. జూబ్లీహిల్స్‌లో 30వేల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపు ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ ఆటలో అరటిపండు అని, బీఆర్ఎస్ కోసం బీజేపీ పనిచేస్తుందన్నారు. సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్‌యదదవ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుదిబండలా విద్యుత్‌డిస్కంలు!

>> 8.7 శాతం వద్ద వృద్ధి చెందాయని నివేదిక హైలైట్ చేసింది. పంపిణీ నష్టాలను తగ్గించడం, మీటరింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, సకాలంలో టారిఫ్ సవరణలను నిర్ధారించడం మరియు ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడానికి విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాలు కార్యాచరణ సామర్థ్యాన్ని ప్రాధాన్యపరచాలని నివేదిక వివరించింది. ఇది గత సంవత్సరాల నుండి మెరుగుదలని ప్రతిబింబిస్తుందని చెప్పింది. మరియు బాధ్యతాయుతమైన ఆర్థిక నిర్వహణకు నిబద్ధతను ప్రదర్శిస్తుందని తెలియచేసింది. అదనంగా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని నివేదిక పేర్కొంది. మరింత సానుకూల పరిస్థితుల నేపథ్యంలో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో రాష్ట్రాలు పురోగతి సాధించాయని పేర్కొంది. 2023-24లో రాష్ట్రాల స్థూల ఆర్థిక లోటు 2.91 శాతం వద్ద ఉంది, ఇది ఆర్థిక బాధ్యత చట్టం ద్వారా నిర్దేశించబడిన 3 శాతం పరిమితిలో బాగానే ఉంది. ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడి మరియు దీర్ఘకాలిక వృద్ధికి కీలక సూచిక అయిన మూలధన వ్యయం 2023-24లో బిదిశిలో 2.6 శాతానికి పెరిగింది, ఇది అంతకుముందు సంవత్సరంలో 2.2 శాతంగా ఉంది. 2024-25లో రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించాలని భావిస్తున్నాయని, ఈ నేపథ్యంలో 3.2 శాతంగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది.

## రేపటి నుంచి మరో నలుగురు

# ఎమ్మెల్యేల విచారణ

>> అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ తరఫున అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు సుప్రీంకోర్టుకు పిటీషన్ సమర్పించారు. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి)లను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లపై విచారణ జరగనుంది. స్పీకర్ ఇరువైపుల వాదనలు వింటారు. తొలుత పిటిషనర్లు, ఆ తర్వాత ప్రతివాదులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. రోజుకు ఇద్దరు చొప్పున విచారణ జరగనుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెమెరాల సమక్షంలో విచారణ కొనసాగుతుంది.

## డిప్యూటీ సివిల్ సర్జన్స్‌కి సివిల్ సర్జన్స్‌గా పదోన్నతులు

### డిప్యుటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు

### రెండు జీవోలను జారీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 4:** తెలంగాణ రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకి సివిల్ సర్జన్స్‌గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతోపాటు ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్లుగా ఉన్న వారికి జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన రెండు జీవోలను వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖలో 2024-25 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించి సివిల్ సర్జన్ (జనరల్ లైన్) పదవికి పదోన్నతి కోసం డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ ప్యానెల్‌ను ప్రభుత్వం ఆమోదించింది. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996లోని రూల్ 10 (ఎ) ప్రకారం, కొంతమంది డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకి సివిల్ సర్జన్స్‌గా తాత్కాలిక పదోన్నతి ఇస్తూ వారికి పోస్టింగ్ ఆర్డర్లను జారీ చేశారు. 36 మందికి సివిల్ సర్జన్లుగా పదోన్నతులు కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించి జీవో ఆర్‌టి నంబర్ 523ను ప్రభుత్వం జారీ చేసింది. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఆర్‌టి నంబర్ 522ను వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ జారీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్లుగా కొనసాగుతున్న ఎన్ కృష్ణవేణి, శ్వేత మోంగ, బి మంజునాథ్ నాయక్‌లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు.

## వివేకా హత్య కేసు:

# సిబిఐ కోర్టులో సునీల్ యాదవ్ కౌంటర్ దాఖలు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ2 గా వున్న కడపకు చెందిన సునీల్ యాదవ్ మంగళవారం నాడు నాంపల్లి సిబిఐ కోర్టులో కౌంటర్ దాఖ లు చేశాడు. ఈ కేసును మరోసారి విచారించాలని వివేకా తనయ సునీతా రెడ్డి సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. దీని తరువాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సునీల్ యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేస్తూ అనేక అంశాలను ప్రస్తావించాడు. కడప జైల్లో దస్తగిరి ని డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించిన ఘటనపై సిబిఐ విచారించలేదని, 2017 ఎంఎల్‌సి ఎన్నికల్లో వివేకా ఓటమి వెనుక అవినాష్ రెడ్డి కుట్ర కోణంపై నిగ్గు తేల్చాలని, వివేకా హత్య కేసులో సాక్షులు గా వున్న వారిలో ఆరుగురు మరణించిన విషయంపైనా సిబిఐ విచారణ చేయాలని సునీల్ యాదవ్ కోరాడు. కల్లూరు గంగాధర్ రెడ్డి అనంతపురం ఎస్‌పికి ఫిర్యాదు చేసిన తరువాత కూడా ఆయనకు రక్షణ కల్పించలేక పోయారని సునీల్ యాదవ్ తన పిటిషన్‌లో తెలిపాడు. ఈ కేసులో ఇంకా అనేక మంది ప్రముఖులను విచారించాల్సిన అవసరం వుందని అతను తెలిపాడు.

## తపాలాశాఖ నుంచి

# కొత్త యాప్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్4:** పోస్టల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా తపాలా శాఖ కొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. తమ సేవలను మరింత వేగంగా, సౌకర్యవంతంగా అందించేందుకు డాక్ సేవ అనే కొత్త యాప్‌ను తెచ్చింది. పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందించే సేవలన్నీ స్మార్ట్‌ఫోన్ ద్వారానే వినియోగించుకునేలా డాక్ సేవ యాప్‌ను తాజాగా విడుదల చేసింది. ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా సేవలు పొందొచ్చు. ఇక పోస్టాఫీస్ మీ జేబులోనే అంటూ యాప్ ను పరిచయం చేస్తూ.. పోస్టల్ డిపార్ట్‌మెంట్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టింది. తపాలా శాఖ అందించే అన్ని సేవలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపింది. పార్సిల్ ట్రాకింగ్, పోస్టేజ్ కాలిక్యులేషన్, ఫిర్యాదు నమోదు, ఇన్సూరెన్స్ ప్రీమియం పేమెంట్ వంటి సేవలను డాక్ సేవ యాప్ లో పొందొచ్చు. స్పీడ్‌పోస్ట్, మనీ ఆర్డర్ వివరాలను రియల్ టైమ్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జీ అవుతుందో వెంటనే లెక్కించొచ్చు. స్పీడ్‌పోస్ట్, రిజిస్టర్డ్ పోస్టు, పార్సిల్ బుకింగ్ సేవల కోసం గంటల తరబడి లైన్లో నిలబడే అవసరం లేకుండా యాప్ ద్వారానే చేసుకోవచ్చు. అలానే జీపీఎస్ సాయంతో సమీపం పోస్టాఫీసుల వివరాలు తెలుసుకోవచ్చు. కార్పొరేట్ వినియోగదారుల కోసం ప్రత్యేక విభాగం ఈ యాప్‌లో ఏర్పాటు చేశారు. జాతీయ, అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జీ అవుతుందో వెంటనే లెక్కించొచ్చు. స్పీడ్‌పోస్ట్, రిజిస్టర్డ్ పోస్టు, పార్సిల్ బుకింగ్ సేవల కోసం గంటల తరబడి లైన్లో నిలబడే అవసరం లేకుండా యాప్ ద్వారానే చేసుకోవచ్చు. అలానే జీపీఎస్ సాయంతో సమీపం పోస్టాఫీసుల వివరాలు తెలుసుకోవచ్చు.

## ముగ్గురు అక్కాచెల్లెళ్లకు కన్నీటి వీడ్కోలు

### తరలివచ్చిన జనం.. తోటి స్నేహితులు

### జిల్లేడుకొమ్మలతో పెళ్లిళ్లు నిర్వహించి అంతిమ సంస్కారాలు

**తాండూరు, నవంబరు 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో జరిగిన ఆర్టీసి బస్సు, కంకర టిప్పర్ ఢీకొన్న ఘటన తాండూరు ప్రాంతంలోని పలువురి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగిల్చింది. బస్సు ప్రమాదంలో మృతి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆ ముగ్గురు అక్కా చెల్లెళ్లకు జిల్లెడు కొమ్మలతో ఆచారం ప్రకారం పెళ్లి తంతు చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తోటి స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు పెద్ద ఎత్తున తరలివచ్చి అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. తాండూరు నియోజకవర్గం యాలాల మండలం పేర్కంపల్లిలో చెందిన ఎల్లయ్యగౌడ్ చాలా ఏళ్ల క్రితం నుండి తాండూరు పట్టణంలోనే నివాసముంటున్నాడు. పట్టణంలోని వడ్డెరగల్లిలో స్వంత నివాసాన్ని ఏర్పర్చుకున్నారు. ఎల్లయ్యకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. ఎల్లయ్యగౌడ్ సొంత వాహనాన్ని తీసుకొని డ్రైవింగ్ చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ఇటీవలే గత 15రోజుల క్రితమే తన పెద్ద కూతురు అనూష వివాహాన్ని కూడా చేశాడు. రెండో కూతురు తనూష హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతూ ఉద్యోగం చేస్తుంది. మూడో కూతురు సాయిప్రియ హైదరాబాద్ కోటి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. నాలుగో కూతురు నందిని అదే కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. కుమారుడు తాండూరు పట్టణంలోని ఓ ప్రవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. గత నాలుగు రోజుల క్రితం తాండూరుకు వచ్చిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సోమవారం పరీక్షలు ఉన్నాయని తాండూరు నుండి ఆర్టీసి బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మీర్జాగూడలో జరిగిన ఆర్టీసి బస్సు, కంకర టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకే సారి ముగ్గురు అక్కాచెల్లెళ్లు దుర్మరణం చెందారు. ప్రమాదంలో ఒకే సరి ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులతో పాటు బంధు వులు, స్థానికుల రోదనలు తీవ్రంగా కలిచివేశాయి. గత నెల 15న పెద్ద కూతురు అనూష వివాహాన్ని ఎంతో ఆర్భాటంగా చేసి ఎంతో ఆనందంగా ఉన్న ఎల్లయ్యగౌడ్ కుటుంబంలో అంతులేని విషాదం మిగిలింది. అక్కాచెల్లెళ్ల అంత్యక్రియలను వారి స్వగ్రామం పేర్కంపల్లిలో నిర్వహించారు.

# చేవెళ్ల బస్సు ప్రమాదంపై ఎట్టకేలకు సర్కారీ విభాగాల్లో చలనం

### చేవెళ్ల-తాండూరు మార్గాన్ని పరిశీలించిన పోలీసు, జాతీయ రహదారుల విభాగం అధికారులు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చేవెళ్ల బస్సు దుర్ఘటనపై సర్కారీ విభాగాల్లో ఎట్టకేలకు కదలిక వచ్చిం ది. సోమవారం ఉదయం తాండూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సును చేవెళ్ల నుంచి తాండూరు వైపు కంకర లోడ్‌తో వెళుతున్న భారీ టిప్పర్ ఢీకొనడంతో బస్సు, టిప్పర్ డ్రైవర్లతో పాటు 19 మంది మరణించగా 25 మంది గాయపడడం తెలిసిందే. ఈ ఘటనకు టిప్పర్ ఓవర్ లోడ్‌తో పాటు ఓవర్ స్పీడ్ కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

బస్సుతో పాటు టిప్పర్‌కు ఫిట్‌నెస్ వుందని రవాణా శాఖ అధికారు లు తెలిపారు. ప్రమాదం జరిగిన చేవెళ్లలోని మిర్జాగూడ వద్ద రహదారిపై గుంత వుండడం, ఇదే సమయంలో వేగంగా వస్తున్న టిప్పర్ గుంతను తప్పించపోయి, వేగాన్ని నియంత్రించలేక ఎదు రుగా వస్తున్న బస్సును ఢీకొని దానిపై ఒక్కసారిగా ఒరిగిపోయింది. దీంతో బస్సులో కుడి భాగం పూ ర్తిగా ఛిద్రం కాగా టిప్పర్‌లోని కంకర బస్సు లోని ప్రయాణీకులపై పడింది. ఈ కారణంగా కుడివైపు కూర్చున్న ప్రయాణికులే ఎక్కువగా మరణించా రు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఇదే సమయంలో పోలీసు శాఖ తరపున సోమవారం నాడు అదనపు డి జి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్ సహా సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతి, రోడ్ సేఫ్టీ ఐజి రమేష్ నాయుడు తదితరులు సం దర్శించారు. మంగళవారం డిజిపి శివధర్‌రెడ్డి సందర్శిం చారు. ఆయన వెంట ఉన్నతాధికారులు కూడా వున్నారు. పోలీసు ఉన్నతాధికారుల బృందం చేవెళ్ల...తాండూరు మార్గాన్ని కొంత దూరం వరకు పరిశీలించింది. ఈ సందర్భంగా డిజిపి పోలీసులకు కీలక సూచనలు చేశారు. ప్రమాద కర మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే సమయంలో వాహనదారులు రోడ్డు పరిస్థితులను బట్టి వాహనాల వేగాన్ని నియంత్రించుకోవాలని, అన్నిచోట్ల వేగంగా పోవడం సరైంది కాదని ఆయన తెలిపారు. మరోవైపు రవాణా శాఖ అధికారులు, జాతీయ రహదారుల అభివృ ద్ధి సంస్థ అధికారులు కూడా చేవెళ్ల వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతంతో పాటు చేవెళ్ల...తాండూరు మార్గాన్ని సందర్శించారు.

ఈ మార్గంలో ప్రమా దాలు ఎందుకు ఎక్కువగా జ రుగుతున్నాయనే దానిపై వారు స్థానికులతో పాటు పోలీసులను అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల...తాండూరు మార్గాన్ని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విస్తరించేందుకు అంగీకరించడం తెలిసిందే. ఇందుకోసం సుమారు వెయ్యి వరకు వున్న మర్రిచెట్లను తొలగించ నున్నారు. ఆర్టీసీ అధికారులు కూడా ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. హైదరాబాద్ నుంచి తాండూరు వెళ్లే ఆర్టీసీ బస్సుల డ్రైవర్లకు సూచనలు చేశారు. ఈ మార్గంలో వాహనాల వేగాన్ని పరిమితంగా వుండేలా చూడాలని, ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న భారీ వాహనాలను ప రిగణలోకి తీసుకుని, అవసరం అయితే ముందుగానే బస్సులను పక్కకు జరపడం, వేగాన్ని తగ్గించడం వంటివి చేయాలని డ్రైవర్లకు సూచించారు.

# టిప్పర్ బోల్తాపడి బస్సును ఢీకొట్టిందా?

### చేవెళ్ల రోడ్డుప్రమాదంపై కొత్త కోణం!

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మరో కొత్త కోణం వెలుగుచూస్తోంది. అతివేగంగా నడిపిన టిప్పర్ డ్రైవర్ కాష్లే అక్కడి కక్కడే మృతి చెందారు. అదే వాహనంలో ఉన్న యజమాని కూడా గాయపడ్డాడు. ఆయన కోలుకున్న తర్వాత మరిన్ని వాస్తవాలు వెలుగు చూడ నున్నాయి. అయితే, పలువురు సీనియర్ డ్రైవర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చిన తర్వాత ఓ అంచనాకు వచ్చారు. మీర్జాగూడ సమీపంలో రహదారిపై గుంతను తప్పించబోయిన టిప్పర్ డ్రైవర్ ఎదురుగా బస్సు కనబడగానే సడన్‌గా స్టీరింగ్ తిప్పడం వల్ల బోల్తా కొట్టిందని భావిస్తున్నారు. ప్రమాద స్థలిలో రోడ్డుపై టిప్పర్ ఎడమటైర్లు గాల్లో తేలుతున్నాయి. దాన్నిబట్టి ప్రమాదం అంచనా వేస్తున్నారు. ఆర్టీసి బస్సు సాధారణ వేగంతో రోడ్డుకు ఎడమవైపు నుంచి వస్తున్నట్లు తెలుస్తున్నది. మితిమీరిన వేగం వల్ల టిప్పర్ బాడీ (ట్రక్ బెండ్) ఒక్కసారిగా బస్సు కుడి వైపు బలంగా పడింది. బస్సు ఎడమ భాగం సగం వరకు కట్ అయింది. టిప్పర్‌లోని కంకర బస్సులో పడి ప్రయాణికులు కూరకు పోయారు. ప్రమాదంలో అధికంగా ప్రాణనష్టం వాటిల్లింది. భారత్‌బెంజ్ కంపెనీ తయారీ చేసిన టిప్పర్ ట్రక్‌బెడ్‌ను హైడ్రాలిక్ సిస్టమ్‌తో బరువుగా, దృఢం గా ఉంటుంది. టిప్పర్ సడన్‌గా కట్ చేయడం, ఒక్క సారిగా కుడివైపు బోల్తా కొట్టడం రెప్ప పాటులో జరిగిపోయాయి. టిప్పర్‌తో పోల్చుకుంటే బస్సు బాడీ నిర్మాణం అంతగా దృఢంగా ఉండదని చెబుతున్నారు. అధికబరువు గల టిప్పర్ ఒక్కసారి గా బస్సుపై పడటంతో అధిక ప్రాణనష్టం జరిగిం ది. బస్సు భాగాలు నుజ్జునుజ్జుగా మారా యి. ఇదంతా పలువురు సీనియర్ డ్రైవర్ల ప్రాథ మిక అంచనాలు మాత్రమే. అధికారుల పూర్తి స్థాయి విచారణ తర్వాత వాస్తవాలు తేలనున్నాయి.



గాలిలో తేలిన టిప్పర్ టైర్లు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎడిసిపి ఉదయ్‌రెడ్డి తదితరులు

## విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్న 11 మంది అరెస్టు

### పరారీలో 8 మంది

### 32 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 4, ప్రభాతవార్త:** ఐటి కారిడార్ కేంద్రంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న రెండు లింకులను పోలీసులు ఒకేసారి ఛేదించారు. హైటెక్ సిటీ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లలో మకాం వేసి, స్థానిక ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తులతో పాటు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వారిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 11మందిని అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నంచి 32.14 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 4.67 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో అడిషనల్ డిసిపి ఉదయ్ రెడ్డి వెల్లడించారు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని టీఎన్‌జీఓ కాలనీలో గల ఎస్‌ఎం లగ్జరీ కో-లివింగ్ హాస్టల్ కేంద్రంగా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఈనెల 3వ తేదీన దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో కడప జిల్లాకు చెందిన గుంత తేజక్రిష్ణ, ఐటి ఉద్యోగి పాకనాటి లోకేష్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కొంతమొత్తం డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు వీరు ఇచ్చిన సమాచారంతో మాదాపూర్‌లోని నైట్ ఐ హోటల్ మీద దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెన్నెల రవికిరణ్, పెద్దమంతూర్ హర్షవర్ధన్‌రెడ్డి, మన్నె ప్రశాంత్, సాజీర్ మోతుంగాలను అదుపులోకి తీసుకున్నారు. ప్రశాంత్ బర్త్‌డే కోసం డ్రగ్స్ పార్టీ ఏర్పాట్లు చేస్తుండగా వీరిని అరెస్టు చేసిన పోలీసులు మొత్తం నిందితుల వద్ద నుంచి మొత్తం 6 లక్షల విలువైన 32.14 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 4.67 గ్రాముల గంజాయి, 6 సెల్‌ఫోన్లు, రెండు బైకులు, 10వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ఇచ్చిన సమాచారంతో డ్రగ్స్ సేవించే కొనుగోలుదారులు ప ృద్వీ విష్ణువర్ధన్, కార్లపూడి ప్రీస్‌లీ సుజీత్, మేకల గౌతం, గుండెబోయిన నాగార్జున, గుంటక సతీష్‌రెడ్డిలతో కలిపి మొత్తం 11మందిని అరెస్టు చేశారు. వీరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు నైజీరియన్లతో పాటు వినయ్, లక్ష్మణ్, రిజ్వాన్, కార్తీక్, వంశీ, హర్ష అనే మరో 8మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**ఇద్దరు నైజీరియన్ల నుంచి కొనుగోలు..**

బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఓ నైజీరియన్ నుంచి టిఎన్‌జీఓ కాలనీలో పట్టుబడిన తేజక్రిష్ణ డ్రగ్స్ కొనుగోలు చేస్తుండగా, మరో నైజీరియన్ నుంచి మాదాపూర్‌లో పట్టుబడిన సాజీర్ మోతుంగర కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు. వీరు స్థానికంగా ఉండే వి క్రేతలకు, పలువురు డ్రగ్స్ సేవించే వారికి విక్రయిస్తున్నారు.

పట్టుబడిన వారిలో ఎక్కువగా ఐటి ఉద్యో గులు, విద్యార్థులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ సోషల్ మీడియా ద్వారా ఒకరికి ఒకరు కలుసుకొని, ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రైవేటు హాస్టళ్లు, కో లివింగ్ కేంద్రాలకు నోటీసులు జారీ చేసినట్లు ఏడిసిపి తెలిపారు. సమావేశంలో మాదాపూర్ ఏసిపి శ్రీధర్, గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ హబీబుల్లాఖాన్, డీఐ నరేష్, ఎస్‌ఓటీ ఇన్స్‌పెక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఇంట్లో డ్రగ్స్ పట్టివేత

### నిందితుడి అరెస్ట్.. మరో ముగ్గురి కోసం గాలింపు

**హైదరాబాద్ (సికింద్రాబాద్), నవంబరు 4, ప్రభాతవార్త:** ముషీరాబాద్‌లోని ఓ డాక్టర్ ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకోవడం కలకలం రేపింది. డ్రగ్స్ వ్యాపారానికి తెరతీసిన డాక్టర్ స్నేహితు లతో కలిసి ఇంట్లోనుంచే అమ్మకాలు జరుపు తున్నాడు. పక్కా సమాచారంతో దాడిచేసిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 15 గ్రాముల ఎస్‌ఎల్‌డీ బోల్ట్, 1.32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడు.. ఇంట్లోనే డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులు అతని నివాసానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులు తెలిపారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. హైదరా బాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్.. ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో దాచి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలి పారు. డ్రగ్స్ విక్రయించినందుకు వైద్యుడికి వీటిని ఉచితంగా ఇస్తున్నారని, దీంతో పిజి వైద్యుడు డ్రగ్స్‌కు బానిస అయ్యాడని తెలిపారు. అతడి ఇంట్లో ఓజీకుష్, ఎండిఎంఏ, కొకైన్, హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## వచ్చే యేడాది జనవరిలో 'ప్రో రెజ్లింగ్ లీగ్'

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** భారత క్రీడా రంగంలో కీలక అడుగు పడింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ప్రో రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూ ఎల్) తిరిగి వస్తుందని ప్రకటించింది. 2019లో చివరిసారిగా జరిగిన ఈ లీగ్, 2026 జనవరి లో తిరిగి రానుంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మన దేశంలో రెజ్లింగ్ కేవలం ఆట కాదు. అది మన వారసత్వం. మన సంస్కృతిలో, మట్టిలో కలిసిపోయిందన్నారు. మన అఖాడాలలో ఎంతో ప్రతిభ ఉంది, నేను ఏళ్లుగా చూస్తున్నాను. కానీ వారికి సరైన వేదిక దొరకడం లేదు. ఈ పాత క్రీడను ప్రపంచ స్థాయికి, ప్రొఫెషనల్ స్థాయికి తీసుకెళ్లే వేదిక ఈ ప్రో రెజ్లింగ్ లీగ్. కీర్తి కోసం కలలు కనే ప్రతి యువరెజ్లర్‌కు ఇది దారి చూపుతుందన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకండి

### డిజిటల్ అరెస్టు స్కాంలపై ఎన్‌పిసిఐ హెచ్చరిక

### బాధితులు ధైర్యంగా ఉండాలని, తక్షణమే 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టుల పేరిట అమాయకులను, వయో వృద్ధులను ఒక పథకం ప్రకారం మోసం చేస్తూ లక్షల రూపాయల నుంచి కోట్లాది రూపాయలను దోచుకుం టున్న ఘటనలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) తీవ్రంగా స్పందించింది. దీనిపై ఎన్‌పిసిఐ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పోలీసుతో పాటు సిబిఐ, కస్టమ్స్, ఐటి అధికారులమంటూ ఎవరు ఫోన్ చేసినా స్పందించవద్దని ప్రజల ను కోరింది. సైబర్ నేరగాళ్ల పక్కా వ్యూహం తో వీడియో కాల్స్ చేస్తూ అమా యకులను టార్గెట్ చేస్తున్నారని, ఈ క్రమంలో కొందరిని బెదిరించడంతో పాటు హడలెత్తిస్తూ డిజిటల్ అరెస్టు పేరిట ఒకచోట గంటల తరబడి కూర్చో బెడుతూ వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని ఎన్‌పిసిఐ పేర్కొంది. దోపిడీ సమయంలో బాధితులను మనీలాండరింగ్ కేసుల్లో ఇరికిస్తామని, డ్రగ్స్ కేసులో నిందితులుగా చేరుస్తామని, ఐటి కేసుల్లో చూపుతామని బెదిరిస్తున్నారని ఎన్‌పిసిఐ తెలిపింది. ఇలాంటి నేరాలకు పాల్పడే నేరగాళ్లు పోలీసు యూని ఫుఫాంలతో పాటు ప్రభుత్వ లోగోల ను చూపుతారని, నకిలీ పోలీసు స్టేషన్లను చూపిస్తారని, ఈ క్రమంలో పోలీసు సైరన్లు వచ్చేలా చేస్తారని ఎన్‌పిసిఐ తెలిపింది. ఇటువంటి మోసాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని, ఎవరైనా ఇలాంటి ఫోన్లు చేస్తే వెంటనే కట్ చేయాలని, బెదిరిస్తే 1930 లేదా సమీప పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎన్‌పిసిఐ వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసిన సమయంలో సెల్‌ఫోన్‌లో వుండే వారి డ్రస్సులు, లోగోలతోపాటు ఇతర వస్తువుల ఫోటోలను సేవ్ చేసుకోవాలని, ఇవన్నీ కేసుల విచారణలో సాక్షాలుగా పనికి వస్తాయని ఎన్‌పిసిఐ పేర్కొంది.

# మధ్యాహ్న భోజన మెటీరియల్ ధరల పెంపు


### గతేడాది డిసెంబరు నుంచి అమలు.. ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెటీరియల్ ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్రం తన వాటాగా ధర లను పెంచడంతో.. రాష్ట్రం వాటాను కూడా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన పెంచిన ధరలను 2024 డిసెం బరు నుంచి అమలు చేయనున్నట్టు విద్య శాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీచేశారు. బాల్‌వాటిక, ప్రాథమిక పాఠశాలలకు జాతీయ మధ్యాహ్న భోజన పథకం కింద వంట ఖర్చును రూ.5.45 నుంచి రూ.6.19 (గుడ్డు ధర మినహాయించి)కి ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ. 8.17 నుంచి రూ.9.29 (గుడ్డు ధర మినహాయించి)కి పెంచాలని నిర్ణయించారు. అలా గే 9, 10 తరగతులకు రూ.10.67 (రూ. 8.17+రూ. 2.5 (గుడ్డు ధర) నుంచి రూ. 11.79 (9.29+రూ.2.5 (గుడ్డు ధర))కి పెంచు తూ నిర్ణయం తీసుకు న్నారు. పెంచిన ధరలను 2024 డిసెంబరు 1నుంచి (గుడ్డు ధరతో సహా) అమలుచేయాలని నిర్ణయంచారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠ శాలల్లో పిఎం పోషణ్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అమలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం కాగా.. రాష్ట్ర వాటాగా 40 శాతం ఖర్చు చేస్తు న్నారు. అయితే రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే తమ ఖర్చులతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో 26,125 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా వాటిలో చదువు తున్న 16.70 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు.

# ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

### నలుగురికి గాయాలు

**మిర్యాలగూడ, నవంబరు 4, ప్రభాతవార్త:** ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వరుస బస్సు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మిర్యాలగూడ నియోజ కవర్గ పరిధిలోని మాడుగులపల్లి మండలం కుక్కడం శివారులో మంగళవారం తెల్లవారు జామున చెర్రీ ట్రావెల్స్ కు చెందిన ప్రైవేట్ బస్సు ట్రాక్టర్ ను వెనక నుండి బలంగా ఢీకొట్టడంతో నలుగురికి గాయాలు కాగా పెను ప్రమాదం తృటి లో తప్పింది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలంలోని టీకియాతండాకు చెందిన నిరంజన్ వరి పొట్టు వాహనంపై డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. అదే తండాకు చెందిన కూలీలు నీల, మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌కు చెందిన నిరంజన్, కల్లేపల్లి గ్రామానికి చెందిన రమేష్, సౌజన్య లతో కలిసి మాడుగుల పల్లి మండలం తోపుచర్ల నుండి వరిపొట్టు తీసుకొచ్చేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో కావలి నుండి హైదరాబాదు వెళుతున్న బస్సు కుక్కడం సమీపంలో ట్రాక్టర్ను వెనుక నుండి బలంగా ఢీకొట్టడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టగా అందులోని కూలీలు డివైడర్‌లపై పడి గాయాల పాలయ్యారు. బస్సు ముందు భాగం ధ్వంసం అయిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా వేరే బస్సులో గమ్యస్థానానికి పంపించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్కు తరలించి, బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు బస్సును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వంగపాటి బాల అంకయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సు ప్రయాణికులు సురక్షితంగా బయట పడటంతో అంత ఊపిరి పీల్చుకున్నారు.



కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆకాశంలో కనువిందు చేయనున్న బీవర్ సూపర్‌మూన్‌కు సంబంధించి నాసా విడుదల చేసిన చిత్రం.

# నేడు మరో 'సూపర్ మూన్'

### ఖగోళంలో కార్తిక పౌర్ణమి అద్భుతం

### దుబాయ్‌సహా గల్ఫ్ దేశాల్లో అత్యంత ప్రకాశవంతంగా చంద్రుడు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** ఖగోళంలో బుధవారం నాడు మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. కార్తిక పౌర్ణమి రోజున బీవర్ సూపర్ మూన్‌గా చంద్రుడు మరింత పెద్దదిగానూ ప్రకాశవంతం గానూ కనిపించను న్నాడు. బీవర్ సూపర్ మూన్ దుబాయ్ సహ పలు గల్ఫ్ దేశాలలోనే పెద్ద దిగా, ప్రకాశవంతంగా కనిపిస్తుం దని భారత్ సహ ఇతర ప్రపంచ దేశాల్లో సాధారణంగానే కనిపించనున్నాడని భారత అంతరిక్ష పరిశోధనా శాస్త్రవేత్త లతో పాటు నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే ఎనిమిది శాతం పెద్దగా 16 శాతం అధిక కాంతితో చంద్రుడు ప్రకాశవంతంగా కనువిందు చేయనున్నాడు. బీవర్ సూపర్ మూన్ సందర్భంగా చంద్రుడు భూమికి దగ్గరగా రానున్నాడు. ఈ ఏడాది అత్యంత పెద్ద ప్రకాశవంతమైన సూపర్ మూన్‌గా బీవర్ సూపర్ మూన్ నిలవనుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పౌర్ణమి రోజున చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే కక్ష్య బిందువుతో కలవడాన్ని సూపర్ మూన్‌గా పిలుస్తారు. కార్తిక పౌర్ణమి నాడు బీవర్ సూపర్ మూన్ కనువిందు చేయనున్న దుబాయ్ సహ గల్ఫ్ దేశాలలో చంద్రుడు భూమికి సుమారు మూడు లక్షల 56 వేల కిలోమీటర్ల దూరంలో వుంటాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది సాధారం కంటే 30 వేల కిలోమీటర్ల తక్కువ దూరంగా వారంటున్నారు. ఈ ఏడాది కనిపించిన బ్లడ్ మూన్, హంటర్ మూన్‌ల కంటే బీవర్ సూపర్ మూన్ పెద్దది ని వారు చెబుతున్నారు. కాగా బీవర్ సూపర్ మూన్‌ను తమ దేశ ప్రజలు వీక్షించేం దుకోసం దుబాయ్‌లోని అస్ట్రానమి గ్రూప్ ఆపరేషన్స్ భారీగా ఏ ర్పాట్లు చేసింది. ప్రస్తుతం అక్కడ చలికాలం మొదలవగా ఇంతకాలం ఎండ వేడిమితో ఇబ్బందులు పడ్డ ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఈ నేపథ్యంలో దుబాయ్ సహ గల్ఫ్ దేశాల్లో బీవర్ సూపర్ మాన్‌ను వీక్షించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్)" అధ్యక్షులు శ్రీ సరాల సత్యనారాయణ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వబడినది. ఈ పార్టీలో (1) సరాల సత్యనారాయణ, అధ్యక్షులు (2) శ్రీ బుర్రా సోమేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి (3) శ్రీ కొత్తూరి శంకర్, కోశాధికారిలు ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ ప్రధాన కార్యాలయము డోర్ నెం: 7-1-257/1, ఆదర్శనగర్, మణుగూరు టౌన్ & మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ -507 117. సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, డిటిసిపి భవనము, ఎ.సి.గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజులలోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్)" ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేసే ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

తేది : 4-11-2025 సం/- అధ్యక్షులు : తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్)

తెలంగాణ ప్రభుత్వం
మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం-నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూలు జిల్లా
కొటేషన్‌లు ఆహ్వానిస్తూ ప్రకటన

ఫైల్ నెం.E2/ / 2025-26 తేది: 03.11.2025

నాగర్ కర్నూల్ మునిసిపాలిటీ LED వీధి దీపాలు డ్రైవర్‌లు మరియు SWM లక్షణ స్వభావ వివరణ యొక్క కొనుగోలు పని చేపట్టడానికి, ప్రతిపాదిస్తోంది. క్రింది ఐటమ్‌లకు కొటేషన్‌లు పిలవబడుతున్నాయి. కొటేషన్‌ల దాఖలుకు చివరి తేదీ: తేది: 03.11.2025 సమయం సా.4.00గం. (క్ర.సం.1) 1. ప్రత్యేక వివరణ: RMC మెటీరియల్‌తో 250x250x8mm HR ప్లేట్ ఫౌండేషన్ ఫిక్సింగ్‌తో 20mm (J) బోల్ట్ బోల్ట్స్‌తో స్థాపన మరియు మెటల్ ప్రైమర్‌తో రౌండ్ MS పోల్స్ OD 125mmx5 దళసరి 24 అడుగుల పోల్స్. 2) కంట్రోలర్‌కు విద్యుత్ సరఫరాకు సౌరఫలకాల స్థాపన. 3) MS స్టీల్ ఫ్యాబ్రికేషన్ కేస్టింగ్ లైట్స్ యొక్క దయా, రంగు యాంబర్/ఎరుపు/ఆకుపచ్చ యారోలు. 180 నంబర్ లైట్‌లో లెడ్ యొక్క 300mm నంబర్ డయా, 5mm అల్ట్రా పవర్ ఫ్లాష్ ఫ్రీక్వెన్సీ 40-50/Min lam డయా 300mm 2) 3mm దళసరి 12 అంగుళాలతో, శాశ్వత పెయింట్‌తో, థర్మోప్లాస్టిక్ పెయింట్‌తో జీబ్రా క్రాసింగ్ లైన్‌లు. 3) సోలార్ ప్యానల్‌తో బ్లింకింగ్ పసుపుపచ్చ, 12V బ్యాటరీతో, క్యాస్టింగ్ MS షీట్ ఫ్యాబ్రికేషన్, యాంబర్ రంగు, 180 నంబర్స్ లైట్‌లో లెడ్స్ యొక్క నంబర్ 300mm డయా, 5mm అల్ట్రా విద్యుత్ లెడ్ నెమ్మదిగా డౌన్‌కు దాని సూచన, 30 వాట్ల కొరకు లెడ్ సోలార్ ట్రాఫిక్ వార్నింగ్ బ్లింకర్. 4) మునిసిపల్ ఘనవ్యర్థాల యొక్క రసాయనిక లక్షణ స్వభావాన్ని వివరించే అధ్యయనం మరియు భౌతిక విశ్లేషణ యొక్క అధ్యయన స్వభావ లక్షణ వివరణ వ్యర్థానికి ధర. క్ర.సం.1 నుండి 4 అన్నింటికీ యూనిట్ ఒక్కొక్కటి ఖరీదు. మరి ఏ ఇతర వివరాలకైనా పని వేళలలో నాగర్‌కర్నూలు మునిసిపాలిటీ ఇంజనీరింగ్ సెక్షన్‌ను సంప్రదించండి.

సం/-. కమిషనర్, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ.

DIPR.NO. 10202-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 04.11.2025

హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ-110057
ఫోన్: 011 49267000, టోల్ ఫ్రీ నెం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com
వెబ్‌సైట్: www.herohousingfinance.com | CIN: U65192DL2016PLC30148
సంప్రదించు చిరునామా: A-6, మూడవ అంతస్తు, సెక్టార్-4, నోయిడా-201301.

డిమాండ్ నోటీస్

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 ("చట్టం") సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002

HHFMAHLAP 24000052717 ... 28-10-2025 ... 04-10-2025

తేది: 05.11.2025, ప్రదేశం: తెలంగాణ సం/- అధీకృత అధికారి, హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

వార్త


మన సమస్యలకు పరిష్కారాలు మన దగ్గరే ఉంటాయి. కాని మనం ఎవరో పరిష్కరించుకోవాలని అనుకుంటామంతే.

-షేక్స్పియర్

# 'డిజిటల్' వంచనకు కళ్లెం ఎప్పుడు?

ఆర్థిక నేరాల జాబితాలో కొత్తగా చేరిన డిజిటల్ అరెస్టులు, కోట్లు కొల్లగొట్టడాలు వంటి మోసపూరిత వ్యవహారాలు విరివిగా జరగడంతో ఈ దేశానికి పెద్ద చిక్కొచ్చిపడింది. దేశం మొత్తం మీద రోజుకొక్కటైనా బయటపడుతోంది. ఈ ఏడాది సమాజానికి అతి పెద్ద సవాలు ఏదైనా ఉందంటే అది డిజిటల్ అరెస్టులే. జరిగిన సంఘటనలను విశ్లేషించుకుంటే బాధితులు ఎక్కువ మంది వృద్ధులే. దేశంలోనే ఇంతవరకు రూ.3 వేల కోట్లు మోసగాళ్ల ఖాతాల్లోకి చేరిపోయింది. వయోవృద్ధుల కష్టార్జితాన్ని, సంపదను, మోసగాళ్లు తేలికగా కొల్లగొట్టగలిగారంటే, దానికి పెట్టుబడి కేవలం జనంలో ఉండే భయమే. అరెస్ట్ అనే పదం వింటేనే భయపడతాం. ఇదెక్కడి గొడవరా బాబూ! అని నిట్టూర్పు విడుస్తాం. అలాంటిది కనీసం పోలీసుస్టేషన్‌కి వెళ్లకుండానే ఫోన్లోనే డిజిటల్ అరెస్ట్ అయ్యారు. అంటే ఇంక పైప్రాణాలు పైకే. ఈ బలహీనతను ఆసరాగా తీసుకుని డిజిటల్ అరెస్టులను కొత్త పదం సృష్టించారు. ఇది ఏ సాంకేతిక పద కోశంలోనూ కనపడని మాట. కనీసం పోలీసులకు పరిచయం లేని మాట. కానీ ఈ పదాన్ని సృష్టించి విశ్వామిత్రుడిని తలదన్నేలా విశ్వవ్యాప్తి చేయగలగటం విస్మయపరిచే విషయం. ఇది విస్తృత పరిధిగల అంశంగా సుప్రీంకోర్టు భావిస్తోంది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం సమర్పించిన రహస్య నివేదికను పరిశీలిస్తోంది. ధర్మాసనం ముందుకు డిజిటల్ అరెస్టుల సమస్య ప్రస్తావనలోకి రావడంతో రానున్న రోజుల్లో ఈ అంశంపై గట్టి పరిష్కారం లభించే అవకాశం ఉంది. దీనిని అతి పెద్ద సవాలుగా స్వీకరిస్తోంది. న్యాయవ్యవస్థ కఠినమైన ఆదేశాలను జారీ చేసే విషయమై ఆలోచిస్తోంది. నేరగాళ్లను గుర్తించడంలో ఎలాంటి ఆటంకాలున్నా, చట్ట పరిధిలో నుంచి మినహాయింపు నిచ్చే విధంగా నిర్ణయిస్తుందని ఎదురు చూస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్ మొదట్లో తాము ఊహించిన దానికంటే ఎక్కువగా ఉందని న్యాయవ్యవస్థ పరిధిలోనే పరిష్కారాలు, మార్గదర్శకాలు లభిస్తాయని పోలీసు వ్యవస్థ నమ్ముతోంది. మునుపటి విచారణలో, సుప్రీంకోర్టు మౌఖికంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు బాధ్యతను చేపట్టాలని ప్రతిపాదించింది. నకిలీ పత్రాలను ఉపయోగిస్తూ న్యాయమూర్తులు, పోలీసు అధికారులుగా నటిస్తూ మోసగాళ్ల మోసానికి డిజిటల్ పరికరాలే పరోక్షంగా సహకరిస్తున్నాయి. సైబర్ నేరాలు సరిహద్దుల అవతల నుండి ఉద్భవించాయని, "మనీ లాండరింగ్ ముఠాల" ద్వారా రూపొందించబడ్డాయని అటార్నీ జనరల్ వెంకటరమణి తన అభిప్రాయాన్ని కోర్టుకు నివేదించారు. డిజిటల్ అరెస్టుల వెనుక ఉన్న ఆర్గనైజేషన్ సైబర్ నేరాలు 'స్కామ్ కాంపౌండ్స్' నుండి ఉత్పన్నమవుతున్నాయి అనే అభిప్రాయపడ్డారు. హర్యానాలోని అంబాలాలో సీనియర్ సిటిజన్ జంట నుంచి రూ. 1.05 కోట్లు వసూలు చేయడానికి మోసగాళ్ళు డిజిటల్ అరెస్టు పేరిట దోచుకున్న కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. అయితే, దేశవ్యాప్తంగా అనేక నమోదవుతున్నాయని, అమాయక ప్రజలను, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను, నేరస్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయం న్యాయస్థానం ముందుకు వచ్చింది. 'ఆర్థిక కోణం మాత్రమే కాకుండా మానవీయ కోణం కూడా ప్రభావం చూపుతుంది. మోసపూరిత వ్యక్తులకు విదేశాలలో ఉపాధి హామీగా ఈ దగా ఉపయోగపడుతుంది. నేరస్థులున్యాయమూర్తుల ముఖాలను మార్ఫింగ్ చేస్తారు. కోర్టు గదులను నేపథ్యంగా చూపించి బాధితులకు కాల్‌చేస్తారు. డిజిటల్ అరెస్టుకేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు త్రిసభ్యధర్మాసనం అభిప్రాయపడింది. విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. తమకు ఒక పరిశీలనా నివేదికనిచ్చి సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని ఏర్పాటు చేసింది. సైబర్ నేరాలలోనే ఇది అతి కిరాతకమైన నేరం. ఈ రకం నేరం చేసే మోసగాళ్లు బెదరింపులకు పాల్పడుతూ, ఆడియో, విడియో కాల్స్‌తో ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగాచేసుకుని పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌లోనే బందీలుగా చేసి, డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని ఒక విధంగా చెప్పాలంటే మెస్మరైజ్ చేస్తున్నారు. కేంద్ర హోంశాఖ సిబిఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జటిలంగా మారుతుందని ధర్మాసనం పేర్కొన్నది. సైబర్ నేరాల కారణంగా ఎంతో మంది ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. ఈ కేసుల తీవ్రతను అర్థం చేసుకోకపోతే ఇకపై మరింత మంది మోసగాళ్ల గాలంలో పడిపోతారు. థాయ్‌లాండ్, నైజీరియా వంటి దేశాల నుంచి ఇలాంటి నేరాలు తొంగి చూస్తున్నాయి. ఇదే విషయమై ఇంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రొబేషనరీ ఐపిఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు డిజిటల్ అరెస్టు ముప్పు నుంచి ప్రజలను కాపాడాలంటే వారిని చైతన్యవంతుల్ని చేయడం ఒక్కటే తక్షణ కర్తవ్యంగా భావించాలని కోరారు. సైబర్ నేరగాళ్లు వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమని తాము చెప్పినట్లు చేయకుంటే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారు. కాగా అలాంటి సందర్భంలో ధైర్యం వహించి చాకచక్యంగా వ్యవహరించినప్పుడే ఇలాంటి ముప్పు నుంచి బయటపడతాం.

నువ్వు భయపడితే అది భయపెట్టేవాని సమర్థత కాదు, భయపడే అసమర్థత నీది.



ఎల్లెన్ గ్లాస్గో

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.



పాస్కల్

## ప్రజావాక్కు



### భయం కల్గిస్తున్న బస్ ప్రమాదాలు

**తెలుగు** రాష్ట్రాలలో బస్‌ప్రమాదాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వారంక్రితం కర్నూల్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్ అగ్ని ప్రమాదానికి గురై 25 మంది మరణించి వారం గడవక ముందే రంగారెడ్డి జిల్లాచేవెళ్ల సమీపంలో జరిగిన ఆర్టీసీబస్సు ప్రమాదంలో 19మంది మరణించడం బాధాకరం. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులోటిప్పర్‌లో అధికంగా కంకర (గ్రావెల్) లోడింగ్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లుగుర్తించారు. టిప్పర్‌వాహనంలోనియమిత సామర్థ్యాన్నిమించి మట్టిగుండు, కంకర లాంటి బరువైన పదార్థాలు లోడ్ చేయడంతో వాహనం సంతులనం కోల్పోయిందని అధికారులు పేర్కొన్నారు. వాహనం అధిక వేగంతో మలుపు తిరిగే సమయంలో బరువు అసమానంగా పడి నియంత్రణ తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టినట్లు స్పష్టమవుతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### కలికాలం

**అధికార** పదవుల కోసం పాకులాడ్డం మోసం చేసి ఎన్నికల్లో గెలవటం అనేది ఇప్పుడు చాలా సునాయాసంగా జరిగే పని. పురాణ, ఇతిహాసాల కాలంలోనూ ఇలానే మోసంచేసిరాజ్యాలను తమస్వాధీనంచేసుకునేవారు. అయితే ఆ కాలంలో రాజ్యాలను పోగొట్టుకుని అష్టకష్టాలు పడినా చివరికి వారికి న్యాయం జరిగేది. వారి రాజ్యం వారికి దక్కేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సిబిఐ, ఇడి, ఎసిబి వంటి దర్యాప్తు సంస్థలతోపాటు ఈ మధ్య ఎన్నికల సంఘం కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తు వారికి అనుకూలంగా పనిచేస్తోంది. వారిని గెలిపించటం కోసం ఓట్లను తారుమారు చేస్తోంది.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### నాణ్యమైన విద్య అందించాలి

**రాష్ట్ర** ప్రభుత్వం సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్‌కళాశాలల యాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులకునాణ్యతతో కూడిన విద్యఅందడం లేదు. విద్యార్థులు తమభవిష్యత్తుగురించి ఆందోళనచెందుతున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడ కుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి నిధులను విడుదల చేయాలి.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

### పెరుగుతున్న అంతర్జాల నేరాలు

**సాంకేతిక** విప్లవం వేగంగా విస్తరిస్తోన్నంతలో, అంతర్జాల నేరాల కేసులు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. స్నేహాలు, పరిచయాల కోసం రూపొందిన డేటింగ్ యాప్‌లు ఇప్పుడు నేరగాళ్లకు సులభమైన వేట వేదికలుగా మారాయి. యువత, ఒంటరి వ్యక్తులు స్నేహం కోసం అడుగుతారు. నేరగాళ్లు ఆ భావోద్వేగ అడుగునే దోపిడీగా మలుస్తున్నారు. హైదరాబాద్‌లో మలక్‌పేట యువకుడిపై ఈ మోసం గమనార్హం. టన్యా శర్మ" అనే పేరుతోపరిచయమైన మహిళ రూ. 1,950తో ప్రారంభించి, మొత్తం దాదాపు రూ. 6,49,840 వసూలు చేసింది. ఇదే ధోరణి దేశవ్యాప్తంగా వందలకేసుల రూపంలో ఉంది. మోసాల మూలం మానసిక బలహీనత, నేరగాళ్లు ఒంటరితనం, భావోద్వేగ ఆధారపడుదల, శారీరక ఆకర్షణలను గుర్తించి, నమ్మకాన్ని సంపాదించి, ఆర్థికంగాదోచుతారు. కొందరు దృశ్య సంభాషణలను రికార్డు చేసి భయపెట్టడం ద్వారా డబ్బు వసూలు చేస్తారు. బాధితులు భయంతో మౌనం పాటిస్తారు. ఫిర్యాదు చేయలేరు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యువతకు ప్రేరణ

**మహిళల** క్రికెట్ ప్రపంచకప్ విజయం భారతీయ క్రీడా చరిత్రలో గర్వించదగిన ఘట్టంగా నిలిచింది. ఎన్నో సంవత్సరాల కష్టసాధన, పట్టుదల, క్రమశిక్షణ ఫలితంగా భారత మహిళా జట్టు ఈ ఘన విజయాన్ని సాధించింది. గతంలో పురుషుల జట్టుమాత్రమే ప్రపంచకప్ గెలిచి గర్వించగా, ఇప్పుడు మహిళా జట్టు కూడా ఆగౌరవాన్ని తెచ్చి భారత జెండాను అంతర్జాతీయ స్థాయిలో ఎగరవేసింది. ఈ విజయంలో ముఖ్యపాత్ర వహించిన కెప్టెన్ సాహసస్ఫూర్తి, ఆటగాళ్ల మధ్య ఐక్యత, సమయోచిత నిర్ణయాలు అన్నీ కలిసి భారత జట్టును విజయం వైపు నడిపించాయి. ప్రతిఆటగాళ్ల ప్రదర్శన భారత మహిళా క్రీడాకారిణుల ప్రతిభను ప్రపంచానికి చాటింది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రైతు సమస్యలను పట్టించుకోండి

**వ్యవసాయ**రంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి. రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సునామీపై అవగాహన అవసరం

సునా మీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయా లో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడా నికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరు గుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది. ఇది జాతీయ, స్థానిక హెచ్చరిక, అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మన దేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్, నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది.

డి. జయరాం

సునామీలను నివారించడం సాధ్యం కానప్పటికీ, అత్యవసర సంసిద్ధత, సమయానుకూల హెచ్చరికలు, సమర్థవంతమైన ప్రతిస్పందన, ప్రభుత్వ సహాయం ద్వారావాటి ప్రభావాన్ని మనం తగ్గించవచ్చు. 2004 డిసెంబర్ 26న హిందూ మహాసముద్రంలో, ఇండోనేషియాలోని ఉత్తర సుమత్రా పశ్చిమ తీరంలో గల సిమెలుయే ద్వీపానికి ఉత్తరాన 6.8 నుంచి 9.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భూకంపం సృష్టించిన సునామీ 18మీటర్ల (55.8 అడుగులు)ఎత్తు అలలతో ఇండోనేషియా, శ్రీలంక, థాయ్‌లాండ్, దక్షిణ భారతదేశం, టాంజానియా వరకు విధ్వంసం సృష్టించింది. 1964లో అలాస్కాలో 9.2 తీవ్రతతో సంభవించిన గుడ్ ఫ్రైడే భూకంపం తర్వాత ఇదే అతిపెద్ద భూకంపం. ఈ సంఘటన 21వ శతాబ్దంలో సంభవించిన మొదటి పెద్ద ప్రపంచ విపత్తుగా చరిత్రలో అత్యంత ఘోరమైన విపత్తులలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ విపత్తులో అధికారిక లెక్కల ప్రకారం మన దేశంలో 10,136మంది మరణించారు. వీరిలో అత్యధిక మరణాలు తమిళనాడులో నమోదయ్యాయి. ఈ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, సునామీల పట్ల అవగాహన, సంసిద్ధత, ముందస్తు హెచ్చరిక, ప్రమాదకర ప్రభావాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచే లక్ష్యంతో 2015 డిసెంబరులో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నవంబర్ 5ను ప్రపంచ సునామీ అవగాహన దినంగా గుర్తించింది. సునామీలపై ప్రజలందరికీ అవగాహన ఉండాలి. ఎందుకంటే 1998 నుండి 2018 మధ్య సునామీల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇరవై వేల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. తీరప్రాంతాల్లో జనాభా అధికమవడం, సముద్ర మట్టం పెరుగుదల వంటి ఉమ్మడి ప్రభావాల కారణంగా భవిష్యత్తులో సునామీ మరణాల సంఖ్య ఇంకాపెరిగే అవకాశం ఉంది. ప్రపంచ సునామీ అవగాహన దినం అనేది జపాన్ మేధోమథనం నుంచి పుట్టింది. సునామీల ముప్పు ఉన్న దేశాలు వారివారి దేశాల ప్రజల తరలింపు మార్గాలను, కొత్త హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, పిల్లలు యువతలో అవగాహన పెంచాలని వైపరీత్యాల ప్రమాదాలను తగ్గించే ఐక్యరాజ్యసమితి కార్యాలయం (యుఎన్డిడిఆర్ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్) కోరుతోంది. 'సునామీ' అనే పదం జపనీస్ భాష నుండి ఉద్భవించింది. ఇందులో 'త్సు'అంటే నౌకాశ్రయం, 'నామి' అంటే తరంగం అని అర్థం. సునామీ అనేది సాధారణంగా సముద్రం క్రింద లేదా సమీపంలోసంభవించే భూకంపాలతో సంబంధం ఉండి నీటి అడుగున అంతరాయం సృష్టించే భారీ తరంగాల శ్రేణిని సూచిస్తుంది.

మహాసముద్రాలలో నీటి స్థానభ్రంశం ద్వారా సునామీలు ఉత్పన్నమవుతాయి. భూకంపం సమయంలో సముద్రపు అడుగుభాగంలో ఉన్న టెక్టోనిక్ ప్లేట్ల కదలిక ద్వారా ఇవి సాధారణంగా సృష్టించబడతాయి. అయినప్పటికీ, అగ్నిపర్వత విస్ఫోటనాలు, హిమనదీయ శిల్పాలపతనం, ఉల్క ప్రభావాలు లేదా కొండచరియలు విరిగిపడటం వల్ల కూడా ఇవి సంభవించవచ్చు. అయితే అన్ని భూకంపాలు సునామీలకు కారణంకావు. భూకంపం సునామీని సృష్టించడానికి నాలుగు ముఖ్యమైన షరతులు అవసరమని నిపుణులు చెబుతున్నా



రు. ఇందులో మొదటది, భూకంపం సముద్రం అడుగున సంభవించాలి. రెండు, రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత కనీసం 6.5గా నమోదవ్వాలి. మూడు, భూకంపంతో భూమి ఉపరితలం చీలిపోవాలి. నాలుగు, భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి 70 కిలోమీటర్ల కంటే తక్కువ లోతులో ఉండాలి. 1883 ఆగస్టు 26న ఇండోనేషియాలోని క్రాకటౌ అగ్నిపర్వత విస్ఫోటనం అత్యంత విధ్వంసకర సునామీని సృష్టించింది. ఈ పేలుడు కారణంగా 135 అడుగుల ఎత్తుకు అలలు ఎగిసిపడగా, జావా, సుమత్రా దీవుల్లోని సుందా జలసంధి వెంబడి తీరప్రాంత పట్టణాలు, గ్రామాలు ధ్వంసమయ్యాయి. సుమారు 36,417 మంది మరణించారు. ఇటీవలి చరిత్రలో ఉల్కలు లేదా గ్రహశకల ప్రేరిత సునామీలు నమోదు కానప్పటికీ ఈఖగోళ వస్తువులు సముద్రాన్ని తాకితే నిస్సందేహంగా పెద్ద మొత్తంలో నీరు స్థానభ్రంశం చెంది సునామీని సృష్టిస్తుందని శాస్త్రవేత్తలు నొక్కి చెబుతున్నారు. తీరప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలలో అధిక జనాభా కేంద్రీకృతమై ఉండటం వలన, వీరు సునామీల ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా లోతట్టు తీరప్రాంతాలు, చిన్న ద్వీపాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 కోట్లకు పైగా ప్రజలు సునామీలతో సహా తీవ్రమైన సముద్రమట్ట సంఘటనలకు గురవుతున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2019 తెలిపింది. సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడు మాత్రమే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేస్తుందని యునెస్కో 2022 నివేదిక నివేదించింది. 2004 హిందూ మహాసముద్రసునామీ దుర్ఘటన ఫలితంగాహిందూ మహాసముద్ర పరీవాహక ప్రాంతంలోని 27దేశాలకు ప్రయోజనం చేకూర్చే సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ సృష్టికి దారితీసింది. ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ (ఐఓసీ) యునెస్కో సమన్వయంతో రూపొందించిన గ్లోబల్ సునామీ వార్నింగ్ సిస్టం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఐఓసి యునెస్కో సునామీ కార్యక్రమం, సునామీ సర్వీస్‌ప్రొవైడర్లు, సమాచార కేంద్రాల మద్దతుతో, సునామీ ప్రమాదాన్ని అంచనా వేయడంలో, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను (ఇడబ్ల్యుఎస్) అమలు చేయడంలో ప్రమాదంలో ఉన్న కమ్యూనిటీలకు సంసిద్ధత చర్యల గురించి అవగాహన కల్పించడంలో సభ్యదేశాలకు మద్దతుఇస్తుంది. భారత ప్రభుత్వం భారత సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో అక్టోబర్ 2007 నుండి నిజ సమయ భూకంప పర్యవేక్షణ, సముద్రమట్ట టైడ్ గేజ్‌ల నెట్‌వర్క్‌తో 24 గంటలూ పనిచేసే విధంగా నెలకొల్పబడింది. సునామీసంసిద్ధతా కార్యక్రమం అనేది ఒక బహుళ స్థాయి కార్యక్రమం. సునామీ ప్రమాదం గురించి, అత్యవసర పరిస్థితుల్లో ఏమి చేయాలో ప్రజలకు తెలిసినప్పుడే ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ప్రభావ వంతంగా ఉంటుందనే సూత్రంపై ఇది ఆధారపడి ఉంది. సునామీ సంసిద్ధత ప్రామాణిక స్థాయిని చేరుకోవడానికి సహకార ప్రయత్నం ద్వారా ఇది సాధించబడుతుంది. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా ఆధారిత కమ్యూనిటీ పని తీరుగుర్తింపు కార్యక్రమంగా అమలు చేయబడుతుంది. ఇది జాతీయ, స్థానిక హెచ్చరిక, అత్యవసర నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ నాయకులు, ప్రజల మధ్య క్రియాశీల సహకారంగా సంసిద్ధత భావనను అర్థంచేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. జాతీయస్థాయిలో ఈ కార్యక్రమానికి జాతీయ విధానం, యంత్రాంగం మద్దతు ఇవ్వాలి. ఇక మనదేశంలో చూస్తే ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నేషనల్ సునామీ రెడీబోర్డును ఏర్పాటు చేసింది. ఒడిషా రాష్ట్రంలోని వెంకట్రాయిపూర్, నోలియాసాహి గ్రామాలు మన దేశంలో మొట్టమొదటి హిందూ మహాసముద్ర సునామీ రెడీ కమ్యూనిటీలుగా ఉన్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతానికి ఉన్న మూడు సునామీ సర్వీస్ ప్రొవైడర్లలో భారతదేశం ఒకటిగా పనిచేస్తుంది. •

# అమానవీయతతో మనుగడ సాధ్యమా!

జోస్యుల వేణుగోపాల్

అక్కడ, ఇక్కడ అని లేకుండా ఎక్కువగా ప్రభుత్వ రంగంలో ఈనిర్లక్ష్యమనేది ప్రజలకు నరకంగా మారుతోంది. ఏ వ్యక్తికైనా, ఏ ప్రభుత్వ రంగానికైనా సొంత ఎజెండా తప్ప ప్రజా సంక్షేమం పట్టదు. అనేక పుణక్షేత్రాల్లో దర్శనాలకు, స్నానాలకు, వెళ్ళిన వాళ్ళు, అనేక పార్టీ మీటింగుల్లో అభిమానంతో నాయకుడి జెండా మోయడానికి వెళ్ళినవాళ్ల మృత్యువాత పడడం చూస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల్ని గాలికొదిలేసిన ప్రభుత్వాలను చూస్తున్నాం. పరిశ్రమల్లోను, రోడ్డు ప్రమాదాలు, విమాన ప్రమాదాలకు ఎక్కువభాగం కారణం నిర్లక్ష్యమే. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా అధికార యంత్రాంగాల నిర్లక్ష్య ధోరణే కోట్ల మంది ప్రాణాలు హరించింది. ప్రభుత్వ రికార్డులైన ఆధార్ కార్డ్ లాంటి వాటిల్లో అడ్రసు నమోదు చేసే సమయంలో ఇష్టా రీతిన తప్పులు రాసి దాన్ని సరిదిద్దడానికి మరలా వారి చుట్టే తిరగాల్సి రావడం ప్రజల దౌర్భాగ్యం. అనేక ప్రభుత్వాసుపత్రుల్లోను, బ్యాంకుల్లోను వచ్చే జనం కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయకుండా చిన్నస్థాయి ఉద్యోగి నుండి అధికార్ల దాకా అందరూ ప్రజల్ని విసుక్కుంటూ మహిళలు, పిల్లలు, పెద్దవాళ్లు అనేది లేకుండా, ప్రతిపనికి గంటల తరబడి క్యూలో నిలబెడుతూ వారి సహనానికి పరీక్ష పెడతారు. ఏ వ్యవస్థ అయినా అది ప్రజలవల్లే నడుస్తుందనేది గుర్తించరు. చెమటోడ్చి రూపాయి రూపాయి కూడగట్టిన సొమ్ము అనారోగ్య సమయంలోకొన్ని హాస్పిటల్స్‌లో నిర్లక్ష్యం వల్ల డబ్బు, ప్రాణాలు రెండూ పోతున్నాయి. ఇటీవల అంతులేని ఆశ్చర్యపోయే నిర్లక్ష్యం ఓ వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన తెలంగాణాలో చూశాం. హైదరాబాద్ ఏరియా హాస్పిటల్‌లో ఓ.పి. చీటి రాయడానికి ఒక వ్యక్తిని రూల్స్ కారణంగా నిరాకరించి నిర్లక్ష్యం చేయడమేకాక అదే వ్యక్తి స్పృహకోల్పోయిన సందర్భంలో సిబ్బంది చనిపోయినట్లుగా నిర్ధారించి మార్చురీకి పంపడం వారం తర్వాత అదృష్టం కొద్ది అతను బయట పడడం జరిగితే ఆ విలువైన ప్రాణం ఖరీదు చిన్న పొరపాటుగా చెప్తున్నారు. మన రాష్ట్రంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సకాలంలో ట్రీట్‌మెంట్ జరగక ఒక గర్భవతి ప్రాణాలు కోల్పోయింది. ఒరిస్సాలోని ఒక మెడికల్ కాలేజీ హాస్పిట ల్‌లో తప్పుగా ఇంజక్షన్ ఇచ్చినా కారణంగా ఏడు మంది మృతిచెందారు. మధ్యప్రదేశ్‌లో కరెంటు స్థంభాన్ని ముట్టు కున్న చిన్నారి కరెంట్ షాకుకు గురై మృతిచెందింది. ఈ ప్రమాదాలన్నీ బయటపడ్డవి. దేశవ్యాప్తంగా ఇంకా బయటికి రాని ఇలాంటివి లక్షలు, కోట్లు. ఒక నిర్లక్ష్యం ఎందరి ప్రాణాలు తీసుకున్నా తామరాకు మీద నీటిబొట్టులా తమకు అంటకుండా చూసుకుంటారు అందుకు బాధ్యులు. దీనికిప్రైవేటు, ప్రభుత్వ, ఏ రంగము మినహాయింపు కాదు. ఇక రోడ్డు ప్రయాణాల్లో అన్ని రకాల వాహన చోదకుల నిర్లక్ష్యం వారి ప్రాణాలతో పాటు మరెందరినో బలితీసుకుంటోంది. ప్రభుత్వాల విధివిధానాలను అమలుపరిచే విద్యుత్తు, నీరు, విద్య, వైద్య రంగాల్లో నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. ఇక న్యాయ వ్యవస్థల్లో నిర్లిప్తతతో ఎంతోమంది నిందలు మోస్తూ తీర్పులకోసం దీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత వెంటనే జరిమానాలు, ప్రాణాలు నేలకొరిగిన తర్వాత పారితోషికాలు. లక్షలాది కుటుంబాల ఆరోగ్యాన్ని హరిస్తున్న మద్యపానాన్ని ప్రోత్సహిస్తాం, దాంతో సంభవించే మరణాలన్నిటికీ కాంపన్సే షన్స్ ఇస్తాం అని అంటారు. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా మన ప్రాణాలకు గ్యారెంటీ లేదు. వేల కోట్ల అప్పు లతో ఇస్తున్న ఉచిత పథకాల్లో నిర్వహణాలోపంపై నిర్లక్ష్యపు నీడ ప్రజలకు పీడగామారింది. పార్టీలు, ప్రతిపక్షాలు, ప్రభుత్వాలు ఒకరి నిర్లక్ష్యాన్ని మరొకరు ఎండగడుతూ నిం దిస్తూనే ఉన్నారు. ప్రతి పనిలో నిర్లక్ష్యం మనిషిని మానవ త్వం లేని శిలగా మారిస్తే, ఇది మానవ జాతి మనుగడకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయి. •

# బిసి, ఎంబిసిలకు ఏదీ సమన్యాయం?

మన్నారం నాగరాజు

భారతదేశంలో చిన్న రాష్ట్రాల కోసం జరిగిన పోరాటాలు ఎప్పటికప్పుడు ఒక ప్రధాన రాజ కీయ అందెలాగా నిలిచాయి. భౌగో ళిక విస్తీర్ణం తగ్గి పరిపాలన సులభ తరం అవుతుందని, ప్రాంతీయ సమ స్యలు త్వరగా పరిష్కారం అవుతా యని, ప్రజలకు సమాన న్యాయం లభిస్తుందని ఆశతో ప్రజలు చిన్న రాష్ట్రాల కోసం కష్టపడ్డారు. తెలంగాణ, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఉత్తరా ఖండ్ వంటి రాష్ట్రాల ఆవిర్భావం ఈ స్వప్నాన్ని నిజం చేసింది. అయితే ప్రశ్న ఏమిటంటే ఈ చిన్న రాష్ట్రాల్లో నిజంగా అన్ని వర్గాలకూ, ముఖ్యంగా బీసీలకు, రాజకీయ సమన్యాయం కలుగుతోందా? చిన్నరాష్ట్రాల కోసం పోరాటంలో ప్రధానంగా 'సమాన వనరుల పంపిణీ, సమాన రాజకీయ అవకాశాలు' అని తెలంగాణ ఉద్యమంలో కూడా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ముఖ్య భూమిక పోషించారు. పల్లె స్థాయి నుండి నగర స్థాయి వరకు వేలాది బీసీ నాయకులు, కార్య కర్తలు ఉద్యమంలో తలమునకలయ్యారు. ఆత్మగౌరవం స్థానిక పాలన, సొంత వనరులపై హక్కులనే నినాదాలు బీసీ సమాజంలో విశేష స్పందన కలిగించాయి. ముఖ్యమంత్రి మంత్రివర్గం, ముఖ్యమైన అధికార పదవుల్లో బిసిల శాతం అతి తక్కువగా ఉండటం గమనార్హం. చిన్నరాష్ట్రం ఏర్పడితే అధికారం సులభంగా అందుతుందని భావించిన బీసీల ఆశలు, వాస్తవ రాజకీయ కుతంత్రాల కిందనలిగిపోయాయి. రాజకీయ సమన్యాయం అనేది కేవలం పదవులు పంచుకోవడమే నిర్ణయాధికారం, విధానాల రూపకల్పనలో సమానపాత్ర కలిగి ఉండటమే. బీసీలు జనాభాలో 50శాతం పైగా ఉన్నా అసెంబ్లీ సీట్లలో, మంత్రివర్గంలో, లోక్‌సభ స్థానాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండటం అసమానతను చూపిస్తుంది. ఒక చిన్నరాష్ట్రంలో భౌగోళిక సౌలభ్యం ఉన్నా, రాజకీయ నిర్ణయాలు సాంప్రదాయిక కులాధారిత శక్తుల చేతుల్లోనే ఉండటం, సమన్యాయం కేవలం నినాదంగా మిగిలిపోవడానికి కారణమవుతోంది. తెలంగాణ ఏర్పాటుకు ముందు బీసీ వర్గాలు ఉద్యమానికి వెన్నెముకలా నిలిచాయి. కానీ అవిర్భావం తరువాత మంత్రివర్గంలో, ముఖ్యపదవుల్లో వారికున్న ప్రాధాన్యం చాలా తక్కువ. ముఖ్య మంత్రిత్వ శాఖలు (హోంశాఖ, ఆర్థిక శాఖ, మున్సిపల్, రెవెన్యూ) బీసీలకు దూరంగానే ఉన్నాయి. గ్రామ, మండల స్థాయిలలో కొంతమేర బీసీ నాయకులున్నా విధాన రూపకల్పనలో ప్రభావం చూపే స్థాయిలో అవకాశం తక్కువ. ఇక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యాన్ని, చాలా స్పష్టంగా చెప్పారు "అధికార వికేంద్రీకరణ ద్వారా బహుజనులకు, ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు, నిజమైన రాజ్యాధికారం తేవాలి అని. ఈ ఆలోచన ప్రకారం, చిన్నరాష్ట్రాల ద్వారా అధికారం కొద్దిమంది చేతుల్లో కాకుండా, గ్రామాల నుంచి పట్టణాల వరకు సమానంగా పంచబడాలి. తెలంగాణరాష్ట్రం ఏర్పాటుకు జరిగిన ఉద్యమంలో ఈ భావజాలంకొంతవరకు ప్రతిఫలించింది. ఎందుకంటే, ఆ ఉద్యమంలో బడుగు బలహీన వర్గాలే కాకుండా, బీసీలు, ఎంబీసీలు, నిమ్నకులాలు




పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీని రక్తం, చెమట, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. కానీ రాష్ట్రంఏర్పడి 11సంవత్సరాలు గడిచినా, అంబేద్కర్ కలలలోని 'నిజమైన ప్రజాధికారం' ఈ వర్గాలకు ఎంతవరకు చేరిందో ఆలోచిస్తే నిరాశ కలుగుతుంది. స్థానికసంస్థల నుంచే ప్రజాస్వామ్యానికి ప్రవేశం. నిమ్న కులాలకు చెందిన వ్యక్తులు రాజకీయ ప్రస్థానంలో ముందుకు రావాలంటే మొదటగా స్థానిక సంస్థలలో సర్పంచ్, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ వంటి పదవులలో అవకాశాలు రావాలి. ఎందుకంటే, ఇవే రాష్ట్రఅసెంబ్లీలు, పార్లమెంటులకు పునాది రాళ్లు. కానీ వాస్తవం ఏమిటంటే, రాష్ట్రంలోని కొన్నిగ్రామాల్లో ఇప్పటికీ కొంత మంది కులాలవారికి ఒక్కసారి కూడా సర్పంచ్ పదవి దక్క లేదు ఒక కులానికి గ్రామంలో ఓటు శాతం ఉన్నా, ఆ స్థానాన్ని ఎప్పటికీ ఇతర శక్తివంతమైన కులాలే ఆక్రమిస్తారు. కారణం రిజర్వేషన్ విధానంలో వర్గీకరణ లేకపోవడం. 2014లో తెలంగాణలో జరిగిన సర్పంచ్‌ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించబడింది. ఇది కాగితం మీద మంచి శాతం అనిపిం చినా, వర్గీకరణ లేకపోవడం వల్ల రిజర్వేషన్ ఎక్కువగా ప్రభావవంతమైన బీసీ కులాలకే దక్కింది. మిగిలిన నిమ్మ, బలహీన బీసీ కులాలకు మాత్రం ప్రాతినిధ్యం దొరకలేదు. ఇక 2019లో రాష్ట్రంలో మొత్తంగా 12,751 గ్రామ పంచా యతీలున్నాయి. పంచాయతీల్లో 50 శాతానికి లోబడే రిజ ర్వేషన్లు ఉండాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో బీసీ లకు 22,8శాతం, వారిలో 3146ఎస్టీలు, 2113 ఎస్సీలు, 3346లు, ఓపెన్ క్యాటగిరీలో 1417మందిసర్పంచ్‌లు బాధ్యతల్లోకి వచ్చినట్టు పంచాయతీరాజ్ గతంలో ఉన్నతాధికారులు వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించిన పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లు 34శాతం నుంచి 21శాతం తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఎదగకుండా దెబ్బతీశారు. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 21 శాతానికి తగ్గించింది. అదీగాక ఇంకేవేవో తప్పుడు లెక్కలు చూపి కేవలం 18శాతం రిజర్వేషన్లు అమలుచేశారు. మొత్తం గ్రామ పంచాయతీలు సుమారు 12,751 కాగా 56శాతం జనాభా ఉన్న బీసీలకు 8822గ్రామ పంచాయతీలు దక్కాలి. గతంలో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే 4300 పంచాయతీలో బీసీలకు దక్కాలి. కానీ 2332 మాత్రమే కేటాయించారు. అంటే సుమారు22శాతం మాత్రమే దక్కాయి. దీంతో రెండు వేల గ్రామ సర్పంచులు 3వేల వార్డు మెంబర్లు బీసీలకు దక్కాల్సినవి దక్కకుండా పోయాయి. అట్లనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్, మండల్ పరిషత్ చైర్మన్ పదవుల్లో కూడా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అణచివేశారు. ప్రభుత్వం కూడా "వర్గీకరణ లేని రిజర్వేషన్" విధానం మార్పు చేసి, ప్రతి బీసీ ఉపవర్గానికి తగిన ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల నుంచే అవకాశాలు రాజకీయశిక్షణ, ఆర్థిక సహాయం ఇవన్నీ కలిపి ఒక సమగ్రప్రణాళిక రూపొందించాలి. చిన్న రాష్ట్రాలు ఏర్పడితే బహుజనులకుఅధికారం వస్తుందని అంబేద్కర్ చెప్పినది సత్యమే. కానీ అధికారం సత్యంగా జనుల వద్దకు రావాలంటే, బహుజనులలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు ముందుగా హక్కులు, అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే, రాష్ట్రం చిన్నదైనా, అధికారం మాత్రం కొద్దిమందికే పరిమితం అవుతుంది. తెలంగాణ సాధనలో కష్టపడిన బీసీ, ఎంబీసీ, నిమ్న కులాలు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం పొందే రోజురాకపోతే, మనం అంబేద్కర్ కలలోని సమానత్వ రాజ్యానికి చాలా దూరంలోనే ఉన్నట్టే. మంత్రివర్గంలో ముఖ్య పదవుల్లో బీసీలకు నిర్దిష్ట శాతం రెజర్వేషన్ కల్పించాలి. బీసీవర్గాల నుండియువనాయకులకు శిక్షణ ఇచ్చి, రాజకీయాల్లో ప్రోత్సహించాలి. •



# 'సర్'పై మమత భారీ నిరసన

## ఆందోళనకారులను ముందుండి నడిపించిన ముఖ్యమంత్రి

**కోల్‌కతా, నవంబర్ 4:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ ఆందోళనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం వహించారు. మంగళవారం కోల్‌కతా వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సమగ్ర సవరణ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై నిర్వహిస్తోన్న నిశ్శబ్ద రిగ్గింగ్ అని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. బెనర్జీతో పాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. మొత్తం 3.8 కిలోమీటర్ల మేర ఈ మార్చ్ కొనసాగింది. దాంతో ఆ దారులన్నీ తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలతో నిండిపోయాయి. అయితే ఈ నిరసనలపై బిజెపి తీవ్రంగా మండిపడింది. తీవ్రంగా మండిపడింది. భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా టిఎంసి వ్యవహరి స్తోందని విమర్శించారు. మమతా బెనర్జీ దీనిలో లోపాలను ఎత్తి చూపాలనుకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి అని వ్యాఖ్యలు చేశారు. రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సరవణను చేపట్టనున్నట్లు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన విషయం తెలిసిందే. అండమాన్ నికోబర్, చత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుద్దుచ్చేరి, రాజస్థాన్,

తమిళనాడు, యుపి, పశ్చిమబెంగాల్‌లో జరగనున్న రెండో దశలో 51 కోట్ల మంది ఓటర్లు భాగం కానున్నారు అని తెలిసింది. ఇసి ప్రకటించినట్లుగా ఈ రోజు నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే బీహార్ ఎస్ఐఆర్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఎన్డీయే పార్టీలు మినహా ఇసి చేపట్టిన ఎస్ఐఆర్‌ను విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట బిజెపితో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

# బీహార్‌లో ప్రచారానికి తెర

## - రేపటి పోలింగ్ కోసం ఓటర్లకు తాయిలాలు పంపిణీ - బరిలో తేజస్వి, డిప్యూటీ సిఎం, పలువురు మంత్రులు - ఇసి పకడ్బందీ ఏర్పాట్లు.. భద్రత కట్టుదిట్టం

**పాట్నా, నవంబరు 4:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తొలి దశ ప్రచారం ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, వివిధ రాష్ట్రాల బిజెపి ముఖ్య మంత్రులు ఎన్‌డిఏ అభ్యర్థుల తరుపున ప్రచారం చేయగా, మహాకూటమి తరఫున కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజున ఆయా పార్టీల నేతలు, స్టార్ క్యాంపెయినర్లు ర్యాలీలు, రోడ్ షోలతో హోరెత్తించారు. ఎన్నికల ప్రచారం ముగియగా, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థుల తాయిలాలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తూ ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. భారీగా నగదు, మద్యం, వివిధ వస్తు సామాగ్రిని ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక తొలి దశ ఎన్నికలకు సంబంధించి ఈనెల 6వ తేదీ గురువారం 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. 1,314 మంది అభ్యర్థుల భవితవ్యం ఏమిటో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని తీర్పు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే ఆయా పోలింగ్‌కు అవసరమైన సామాగ్రి ఎన్నికల సిబ్బందికి అందజేసింది. బుధవారం సాయంత్రానికల్లా ఆయా పోలింగ్ కేంద్రాలకు యంత్ర సామాగ్రితో చేరుకోనున్నారు. ఎన్‌డిఏ, ఇండియా కూటమి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికారం తిరిగి దక్కించుకోవాలని సిఎం నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డిఏ, ఈసారి ఎలాగైనా విజయదుందుభి మోగించాలని ఆర్‌జెడి సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ శ్రమటోడ్చారు. ఇటు ఎన్‌డిఏ, అటు ఇండియా కూటమికి తొలి దశ ఎంతో కీలకం. ఇక తొలి దశలోనే మహామహులు బరిలో ఉన్నారు. వీరిలో మహా కూటమి ముఖ్య మంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి అగ్ర నేత తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎంలు సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా, మంత్రులు నితిన్ రాబిన్, మంగల్ పాండే, ప్రముఖ గాయని మైథిలీ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి రాం క్రిపాల్ యాదవ్ భవితవ్యం పరీక్షించుకుంటున్నారు.



**మోడీపై ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు**

**రాహుల్ పెళ్లి ఎప్పుడంటూ కేంద్రమంత్రి చురక**

పంచాయతీ నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు ఏదైనా ఎన్నిక జరిగినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజీగా ప్రచారం చేస్తూనే ఉంటారని, ఇప్పుడు బీహార్‌లో కుమారుడి పెళ్లికి తిరుగుతున్నట్లుగా పర్యటిస్తున్నారంటూ ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఎన్నిసార్లు కేవలం మోడీ ముఖం చూసి ఓట్లు వేస్తారని ఆయన ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఖర్గే గారూ, మీ యువరాజు రాహుల్ గాంధీ వివాహం ఎప్పుడైనా జరిగితే మాకు ఆహ్వానం పంపండి. ఆ వివాహానికి మేము తప్పకుండా హాజరవుతాం" అంటూ కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వ్యంగ్యంగా అన్నారు.

# ఫరీదాబాద్‌లో పట్టపగలే బాలికపై కాల్పులు!

**ఫరీదాబాద్, నవంబరు 4:** హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్ నగరంలో ఒక దుండగుడు నడిరోడ్డుపై 17 ఏళ్ల బాలికపై కాల్పులు జరిపాడు. కాల్పులకు తెగబడిన యువకుడు గత కొన్ని రోజులుగా ఆమెను వెంబడిస్తున్నాడు. ఈ ఘటన నగరంలోని ఒక ప్రైవేటు లైబ్రరీ వెలుపల చోటు చేసుకుంది. వీరిద్దరు నిత్యం ఆ లైబ్రరీకి వస్తున్నట్లు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను బట్టి తెలుస్తోంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఆ బాలిక దినచర్యను తెలుసుకుని నిత్యం ఆమె రాక కోసం వేచి చూస్తున్నాడని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. బాలిక సంఘటన స్థలానికి రావడానికి కొద్దిసేపటి ముందు నిందితుడు ఆ ప్రాంతానికి వచ్చి వేచి చూస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో గుర్తించారు.

# నేపాల్ జన్‌జెడ్ ఆందోళనలు చూసారు కదా! ఇప్పటికిప్పుడు మీ పిటిషన్ విచారణచేయలేం..

## అశ్లీలకంటెంట్ నిషేధంపై పిటిషన్ విచారణలో చీఫ్‌జస్టిస్ గవాయ్ హితవు




**న్యూఢిల్లీ, నవంబరు 4:** ఇంటర్నెట్ లో మితిమీరిపోతున్న అశ్లీల కంటెంట్ పై నిషేధం విధించాలంటూ దేశ అత్యున్నత న్యాయ స్థానంలో పిటిషన్ దాఖలైంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల వీడియోలు, క్లిప్పులు ఎదిగే పిల్లల మనసులను కలుషితం చేస్తాయని, తీవ్ర దుష్పరిణామాలకు కారణమవుతాయని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన సీజెఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని డివిజనల్ బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. నేపాల్ లో ఇటీవల జరిగిన జెన్ జెడ్ ఆందోళనలను ప్రస్తావించింది. ఇంటర్నెట్ లోని పలు సైట్లపై నిషేధం విధించడం వల్ల నేపాల్‌లో చోటుచేసుకున్న పరిణామాలు చూశారు కదా అంటూ పిటిషనర్ ను ప్రశ్నించింది. ఇప్పటికిప్పుడు ఈ పిటిషన్ ను విచారించలేమని చెబుతూ 4 వారాలకు వాయిదా వేసింది. ఈ నెల 23న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ పిటిషన్ పై విచారణకు ఆయన సుముఖంగా లేరని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. డిజిటలైజేషన్ తర్వాత దేశంలో ఇంటర్నెట్ వాడకం విపరీతంగా పెరిగిందని, చిన్నాపెద్దా తేడా లేకుండా, అక్షరాస్యతతో సంబంధం లేకుండా అందరూ నెట్ వాడుతున్నారని పిటిషనర్ చెప్పారు. కోవిడ్ తర్వాత చిన్నారుల్లో కూడా మొబైల్, ట్యాబ్, ల్యాప్ టాప్ వాడకం పెరిగిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో ఇంటర్నెట్ లో అశ్లీల కంటెంట్ ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. పోర్న్ కట్టడికి సంబంధించి జాతీయ స్థాయిలో ఓ పాలసీ తీసుకురావాలంటూ కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. ఇంటర్నెట్లో పోర్న్‌ను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రోత్సహించే సైట్లు కోట్ల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయని పిటిషనర్ చెప్పారు. ఈ వెబ్ సైట్లకు కేంద్రం ఎందుకు అనుమతిస్తోందని ప్రశ్నించారు. ఒక్క మన దేశంలోనే 20 కోట్ల అశ్లీల వీడియోలు, వీడియో క్లిప్పులు ఆన్ లైన్ లో అమ్మకానికి ఉన్నాయని చెప్పారు. డిజిటలైజేషన్ తర్వాత ఆన్ లైన్ లో అశ్లీల కంటెంట్ కేవలం ఒక్క క్లిక్ తో అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆన్ లైన్ లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న ఈ అశ్లీల కంటెంట్ వల్ల ఎదిగే పిల్లల మనసులు కలుషితమవుతాయని, ఇది దుష్పరిణామాలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే.. మా సహకారం ఉండదు

## అమెరికాకు తేల్చి చెప్పిన ఇరాన్



**టెహ్రాన్, నవంబరు 4:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని అమెరికాను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం ఆపేవరకు యుఎస్‌కు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. టెహ్రాన్‌లో విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ సహకరించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని ఖమేనీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం పూర్తిగా ఆపేసేంత వరకు యుఎస్‌కు ఇరాన్ సహకరించదన్నారు. సైనిక స్థావరాలను తొలగించడంతోపాటు మధ్యప్రాచ్యంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడం ఆపేస్తే దానితో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ అహంకారంతో వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాతో అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి తొందరపడటం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పేర్కొన్నారు. ఇదే క్రమంలో పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

**ఆ ప్రాంతంలోని హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టం : నెతన్యాహు**

తమ నియంత్రణలో ఉన్న రఫా ప్రాంతంలోని 200 మంది హమాస్ ఉగ్రవాదులను వదిలిపెట్టమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. వారికి ఎలాంటి సురక్షిత మార్గం ఉండబోదని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా హమాస్‌ను నిరాయుధీకరణ చేసేందుకు నెతన్యాహు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. ఆయుధాలను వదిలేయడానికి అంగీకరిస్తే హమాస్‌కు సురక్షిత మార్గాన్ని అందించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించే అవకాశాలు ఉన్నాయంటూ స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతోపాటు మిగిలిన బందీల మృతదేహాలను అప్పగిస్తే.. రెడ్‌క్రాస్ వాహనాల్లో ప్రత్యేక కారిడార్ నుంచి హమాస్ ఫైటర్లను తరలించే సాధ్యాసాధ్యాలను మధ్యవర్తులు చర్చించినట్లు అల్‌జజీరా వార్తాసంస్థ పేర్కొంది. అయితే, ఈ కథనాలను ఇజ్రాయెల్ ప్రభుత్వాధికారులు తీవ్రంగా ఖండించారు. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని ఆ దేశ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ విషయంపై జాతీయ భద్రతా మంత్రి ఇటీమర్ బెన్‌గ్విర్ నెతన్యాహుతో సంప్రదింపులు జరిపారు. 200 మంది హమాస్ ఉగ్రవాదులను చంపాలని లేదా జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు.

# భారతీయ విద్యార్థులకు కెనడా వీసా షాక్!

## భారీ సంఖ్యలో వీసా దరఖాస్తుల తిరస్కరణ

**టొరంటో, నవంబరు 4:** ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లాలనుకుంటున్న భారతీయ విద్యార్థులకు ఆ దేశ ప్రభుత్వం గట్టి షాక్ ఇస్తోంది. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానంగా ఉన్న కెనడా, ఇప్పుడు వారి దరఖాస్తులను పెద్ద ఎత్తున తిరస్కరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో భారతీయ విద్యార్థులు చేసుకున్న స్టడీ పర్మిట్ దరఖాస్తులలో ఏకంగా 74 శాతం తిరస్కరణకు గురైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2023 ఆగస్టులో ఇది కేవలం 32 శాతంగా ఉండటం గమనార్హం. కెనడా ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది అంతర్జాతీయ విద్యార్థుల వీసాల జారీపై పరిమితులు విధించింది. దేశంలోకి వచ్చే తాత్కాలిక వలసదారుల సంఖ్యను తగ్గించడం, స్టూడెంట్ వీసాలకు సంబంధించి జరుగుతున్న మోసాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఈ కొత్త నిబంధనల ప్రభావం భారత్ నుంచి వచ్చే దరఖాస్తుదారులపై తీవ్రంగా పడింది. ఆగస్టు 2023లో 20,900గా ఉన్న భారతీయ విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య, 2025 ఆగస్టు నాటికి కేవలం 4,515కు పడిపోయింది. వీసాల తిరస్కరణ వెనుక ప్రధాన కారణంగా వీసా మోసాలని కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం పేర్కొంది. 2023లో దాదాపు 1,550 దరఖాస్తులు నకిలీ అడ్మిషన్ లెటర్లతో వచ్చినట్లు గుర్తించామని, వాటిలో చాలా వరకు భారత్ నుంచే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది పటిష్ఠమైన వెరిఫికేషన్ వ్యవస్థ ద్వారా 14,000కు పైగా నకిలీ లెటర్లను గుర్తించినట్లు వెల్లడించింది. దీంతో పాటు, విద్యార్థులు తమ ఖర్చుల కోసం చూపించాల్సిన ఆర్థిక నిల్వల నిబంధనలను కూడా కఠినతరం చేసినట్లు ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రతినిధి వివరించారు. ఈ విషయంపై ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. వీసాల జారీ కెనడా అంతర్గత విషయమైనప్పటికీ, ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభావంతులైన విద్యార్థులు భారత్‌లో ఉన్నారని, వారి వల్ల కెనడా విద్యాసంస్థలు ఎంతో ప్రయోజనం పొందాయని గుర్తు చేసింది. భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంపై కెనడాలోని పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.


# హర్యానాలో క్రికెట్ కోచ్‌పై విచక్షణా రహితంగా కాల్పులు



## దుండగుల దాడిలో మృతిచెందిన క్రికెటర్, కోచ్

**గనౌర్,(హర్యానా), నవంబరు 4:** హర్యానాలోని గనౌర్ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక క్రికెటర్, కోచ్ అయిన రామ్‌కరణ్‌ను కొందరు దుండగులు కాల్చి చంపారు. సబ్‌డివిజనల్ ఆసుపత్రి సమీపంలో జరిగిన ఈ హత్యతో పట్టణంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కొనసాగుతున్న రాజకీయ కక్షలే ఈ హత్యకు దారితీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ముందురోజు సాయంత్రం ఆసుపత్రి వెలుపల రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఒక వాహనంలో వచ్చిన దుండగులు రామ్‌కరణ్‌పై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన ఆయనను వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను పలువురు ప్రత్యక్షంగా చూసినట్లు సమాచారం. ఈ హత్య వెనుక బలమైన రాజకీయ వైరం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కోడలు ప్రస్తుతం వార్డ్ నెం 12 కౌన్సిలర్‌గా పనిచేస్తున్నారు. నిందితులలో ఒకరిగా భావిస్తున్న సునీల్ లంబూ గతంలో గనౌర్ మున్సిపల్ కౌన్సిల్‌కు యాక్టింగ్ చైర్మన్‌గా వ్యవహరించారు. గత మున్సిపల్ ఎన్నికల నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. సోనేపట్ సీనియర్ పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, ఫోరెన్సిక్ బృందాలతో ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తు న్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గనౌర్ పోలీసులు నిందితులపై హత్య కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకు నేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పట్టణంలో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు.

# కటకటాల వెనక్కి ఇజ్రాయెల్ సైనిక న్యాయవాది!



**టెల్ అవీవ్, నవంబరు 4:** ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్నత స్థాయి న్యాయవాదిగా పనిచేసిన మేజర్ జనరల్ యిఫాత్ టోమర్ యెరుషాల్మి ఇప్పుడు కటకటాల వెనుక ఉన్నారు. వారం రోజుల వ్యవధిలో జరిగిన నాటకీయ పరిణామాలు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఉన్నపళంగా రాజీనామా చేయడం, కొద్దిసేపు అదృశ్యం కావడం, ఆ తర్వాత టెల్ అవీవ్ బీచ్‌లో కనిపించడం, చివరికి అరెస్ట్ కావడం వంటి పరిణామాలు ఇజ్రాయెల్‌ను కుదిపేస్తున్నాయి. పాలస్తీనా ఖైదీపై ఇజ్రాయెల్ సైనికులు అత్యంత దారుణంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో కీలకమైన సర్వైలెన్స్ వీడియోను తానే లీక్ చేసినట్లు యిఫాత్ గత వారం అంగీకరించారు. సైనికుల దురాగతం తీవ్రతను బయటపెట్టేందుకే తాను ఈ పనిచేశానని ఆమె తెలిపారు. అయితే ఆమె చర్యపై ఇజ్రాయెల్‌లోని తీవ్రవాద రాజకీయ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒత్తిడికి తలొగ్గి ఆమె రాజీనామా చేసినప్పటికీ, ఆమెపై వ్యక్తిగత దూషణలు ఆగలేదు. ఈ క్రమంలో, యిఫాత్ తన కుటుంబానికి ఓ రహస్య సందేశం పంపి, కారును బీచ్ వద్ద వదిలి అదృశ్యమయ్యారు. ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చనే ఆందోళనతో మిలిటరీ డ్రోన్లతో గాలింపు చేపట్టారు. చివరికి ఆదివారం రాత్రి ఆమె బీచ్‌లో ప్రాణాలతో కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ, అప్పటి నుంచి ఆమెపై విమర్శల దాడి మరింత పెరిగింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మద్దతుదారు, టీవీ వ్యాఖ్యాత యినోన్ మగల్ ఇక ఆమెను వేధించడం కొనసాగించవచ్చని ఎక్స్‌లో పోస్ట్ చేయడం వివాదాస్పదమైంది. యిఫాత్ ఫోన్‌లలో ఒకటి కనిపించకుండా పోవడంతో, సాక్ష్యాలను నాశనం చేయడానికే ఆమె ఆత్మహత్య నాటకమాడారని కొందరు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం ఇజ్రాయెల్‌లో రెండేళ్లుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ అంతర్గత విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో చూపిస్తోంది. కోర్టు విచారణలో భాగంగా, మోసం, నమ్మకద్రోహం, న్యాయ విచారణకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలపై యిఫాత్ కస్టడీని బుధవారం వరకు పొడిగిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. ప్రస్తుతం ఆమెను సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని మహిళల జైలులో ఉంచారు. ఇదే కేసుకు సంబంధించి మాజీ చీఫ్ మిలిటరీ ప్రాసిక్యూటర్ కల్నల్ మటన్ సోలోమేష్‌ను కూడా అరెస్ట్ చేసినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. 2024 జూలై 5న స్డే టెయిమాన్ సైనిక జైలులో పాలస్తీనా ఖైదీపై కొందరు సైనికులు విచక్షణారహితంగా దాడి చేసి, లైంగిక దాడికి పాల్పడ్డారని అభియోగాలున్నాయి.

## సంక్షిప్తంగా..

### బంగ్లా పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకం రద్దు



ఢాకా, నవంబరు 4: **బంగ్లాదేశంలోని** పాఠశాలల్లో మ్యూజిక్, పిఇటి టీచర్ల నియామకాలను రద్దు చేస్తున్నట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయులను నియమించాలని అక్కడి విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఈ చర్యలను ఇస్లాం వ్యతిరేక అజెండాగా అభివర్ణించిన బంగ్లా ఇస్లాం ఛాందసవాదులు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా సృష్టించిన మ్యూజిక్, పిఇటి టీచర్ల పోస్టులను రద్దు చేస్తున్నట్లు విద్యా శాఖ అధికారి మసూద్ అక్తర్‌ఖాన్ ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులను రద్దు చేయడానికి గల కారణాలను మీడియా ప్రశ్నించగా... ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. స్థానిక మీడియా వర్గాలు వెల్లడించిన కథనాల ప్రకారం.. యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో ప్రభుత్వ నిర్ణయాల్లో ఇస్లాం ఛాందసవాదుల జోక్యం పెరిగిపోతోంది.

### మణిపూర్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు ఉగ్రవాదులు హతం



**ఇంఫాల్, నవంబరు 4:** భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీ (యుకెఎన్ఎ)కి చెందిన నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మణిపూర్‌లోని ఖన్పీ గ్రామంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఖన్పీ గ్రామంలో 17 మంది యుకెఎన్ఎ ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారం మేరకు ఆర్మీ బలగాలు, అసోం రైఫిల్స్‌కు చెందిన పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ డాన్ పేరుతో గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులు బలగాలపై కాల్పులు జరిపారు. దాంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాదిని బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. మిగతా 11 మంది ఉగ్రవాలు పారిపోయారు.

### సూపర్‌పవర్‌గా ఎదుగుతున్న భారత్: అలెగ్జాండర్ స్టబ్

**హెల్సింకి, నవంబరు 4:** ప్రపంచ రాజకీయాల్లో భారత్ ప్రాముఖ్యత అంతకంతకూ పెరుగుతోన్న వేళ, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలుస్తుందని ఆయన జోస్యం చెప్పారు. అదే సమయంలో, ఇంతటి ప్రాధాన్యత కలిగిన భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సి)లో శాశ్వత సభ్యత్వం లేకపోవడం సరికాదని స్పష్టం చేశారు. తాను భారత్‌కు గొప్ప అభిమానినని పేర్కొన్నారు. విదేశీ వ్యవహారాల్లో భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విధానాలను ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితిలో భారత్ వంటి దేశాల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని స్టబ్ అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిని సంస్కరించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

### ముందుగా మేం అణుపరీక్షలను పునరుద్ధరించం: పాక్



**ఇస్లామాబాద్, నవంబరు 4:** రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం కాదని.. అదేవిధంగా అణుపరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపి వేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు.




పోస్టర్, టీషర్ట్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీహరి, నిర్వాహకులు రమేష్ తదితరులు

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### డిసెంబరులో తెలుగు ప్రీమియర్ క్రికెట్ లీగ్

### పోస్టర్ ఆవిష్కరించిన క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటీ శ్రీహరి పిలుపునిచ్చారు. ఈమేరకు డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన తెలుగు ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) క్రికెట్ పోటీల పోస్టర్‌ను తెలంగాణ క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి టీపీఎల్‌ను నిర్వహిస్తున్న జూపర్ ఎల్ఈడీ సంస్థ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి,ఆవిష్కరించారు. 'సే నో టూ డ్రగ్స్' ప్రచారాన్ని యువతలోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ టీపీఎల్ విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా క్రమశిక్షణ గల క్రీడాకారుడిగా, బాధ్యయుత పౌరుడిగా తయారు చేసే శక్తి క్రీడలకు ఉందని శ్రీహరి అన్నారు. క్రికెట్‌తో పాటు ఏదొక క్రీడలో యువత రాణించాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ కూడా అలవడుతుందని చెప్పారు. అనంతరం లీగ్ నిర్వాహక డైరెక్టర్ ఒ.రమేష్ మాట్లాడుతూ తమ సీఎస్ఆర్ నిధులతో ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ లీగ్‌ను కేవలం వినోదం కోసం నిర్వహించకుండా సమాజంలో ఆరోగ్య భద్రత, ఫిట్‌నెస్, క్రీడలపై అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 60 వేదికల్లో 600 టీమ్‌లతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నాకౌట్ పోటీలకు తెలంగాణ నుంచి 4, ఆంధ్ర నుంచి 4 జట్లు ఎంపిక చేస్తామని అన్నారు. గ్రామీణ క్రికెటర్లకు పెద్ద వేదికలపై క్రికెట్ ఆడే అవకాశం కల్పించాలనేది కూడా తమ ఆలోచన అని తెలిపారు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్ మనీ రూ.80 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

# రేపటి నుండి పత్తి కొనుగోళ్లు బంద్

### అలాట్‌మెంట్, స్లాట్ బుకింగ్ సమస్యలు

### కొత్త విధానంతో రైతుల ఇబ్బందులు

### సర్కార్‌కు జిన్నింగ్ మిల్లుల అల్టిమేటం లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పత్తి వ్యాపారులు, జిన్నింగ్ మిల్లులు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లు చేయబోమని అల్టిమేటమ్ జారీచేశాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యవ సాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అవలంబిస్తున్న అసమతుల్య అలాట్‌మెంట్, స్లాట్‌బుకింగ్ విధానాలతో ఎదురవుతున్న సమస్యల గురించి ఎన్నిసార్లు చెప్పినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో తామీ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పష్టంచేసింది. ప్రధానంగా పత్తి సేకరణ కోసం కాటన్ కార్పొరేషన్ ఇటీవల ప్రారంభించిన ఆండ్రాయిడ్ ఆధారిత అప్లికేషన్ అయిన కపాస్ కిసాన్‌ను యాక్సెస్ చేయడంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్‌లో పంట కోతకు సిద్ధమవుతున్న పలువురు రైతులకు మారుమూల గ్రామాల్లో టెలికాం నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల యాప్‌లో నమోదు చేసుకోలేక, స్లాట్‌లను బుక్ చేసుకోలేకపోతున్నారు.

గ్రామాల్లో సెల్ ఫోన్ల నెట్ వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల పేరు, భూమి టైటిల్ వివరాలు, ఆధార్ నంబర్ నమోదు చేసుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. దీంతో స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్నట్లు వాపోతున్నారు. మరోపక్క స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత మార్కెట్ మూసివేసినా, లేక అనివార్య కారణాల వల్ల ఆ తేదీకి రాలేకపోయినా మరుసటి రోజు పత్తిని విక్రయించవచ్చా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదని రైతులు అంటున్నారు.

ఈ నేపథ్యంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మనేని రవీందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని మండిపడుతున్నారు. మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చాకగానీ, తమకు కిసాన్ కపాస్ యాప్ గురించి తెలియదని కొందరు, ఒకవేళ తెలిసినా తమకు స్మార్ట్ ఫోన్లు లేవని మరికొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# నకిలీ సర్వే రిపోర్టులు, సిఎంపై తప్పడు ప్రచారం

### ఇసికి ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫిర్యాదు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పలు మీడియా ఛానల్స్ తప్పుడు ఆరోపణలు చేస్తూ, నకిలీ సర్వే రిపోర్టులు ప్రసారం చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రధాన ఎన్నికల అధికారి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేవారు. ఈ చర్యలు ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన మాత్రమే కాకుండా, భారత శిక్షాస్మృతి సెక్షన్ 499, 500 ప్రకారం దూషనాత్మక నేరం కిందకు వస్తాయని ఆయన అన్నారు.తప్పుడు ప్రచారాలు ముఖ్యమంత్రి ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, ఓటర్లను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకుని, ఇలాంటి దుష్ప్రచారం, నకిలీ సర్వేలు కొనసాగకుండా అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 238

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 4, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 238 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 51, రెవెన్యూ శాఖకు సంబంధించి 46, మున్సిపల్ శాఖకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇళ్ల కోసం 67, ప్రవాసీ ప్రజావాణీకి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# మెడికల్ పిజి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయింపు

### ఇది చరిత్రాత్మక నిర్ణయం

### వైద్య ఆరోగ్య మంత్రి రాజనర్సింహకు జూడాల కృతజ్ఞతలు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్(జూడా) ప్రకటించింది. చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జె ఐజాక్ న్యూటన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ అజయ్ నేతృత్వంలోని జూనియర్ డాక్టర్ల బృందం మంగళవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. తమ దశాబ్దకాల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్థానిక డాక్టర్లకు పీజీ సీట్లు పొందే అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని జూడాలు తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల బలోపేతానికి, నాణ్యమైన మెడికల్ విద్యను అందించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జూడాలు అభినందించారు.

ఇటీవలే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెంచడం, టీచింగ్ ఫాకల్టీ నియామకం, జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లకు స్టైఫండ్ 15 శాతం పెంచిన విషయాలను జూడాలు గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కాలేజీల్లో సౌకర్యాలు పెరిగాయని, దీంతో ఇటీవల జరిగిన అసెస్‌మెంట్‌లో ఒక్క సీటును కూడా నేషనల్ మెడికల్ కమిషన్ తగ్గించలేదని జూడాలు గుర్తు చేశారు. కాలేజీల అభివృద్ధితో పీజీ, యూజీ సీట్లు అదనంగా వచ్చాయని.. దీంతో తమకు అవకాశాలు పెరిగాయని డాక్టర్లు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని జూడాలు తెలిపారు.



# జన్‌ధన్‌లో బోగస్ .. 21.25 లక్షల ఖాతాలకు ఆధార్ నో

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జన్‌ధన్ పథకానికి వివిధ బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. బోగస్ ఖాతాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం ప్రతీ బ్యాంకు జన్‌ధన్ ఖాతాకు ఖాతాదారుడి ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని మాత్రం కొన్ని బ్యాంకులు పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాల సొమ్మును జన్ ధన్ ఖాతాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో కేంద్రం జమ చేస్తోంది. అయితే తెలంగాణలో 21,24,728 జన్ ధన్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో బోగస్ ఖాతాలను గుర్తిం చడం సాధ్యం కావడం లేదు. ఖాతాదారులకు ఇతర బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లను గుర్తించడం సైతం కష్టంగా మారుతుంది. అందుకే వెంటనే అనుసంధానం పూర్తి చేయాలని గత ఏడాది రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సైతం ఆదేశించింది.

అయినప్పటికీ ప్రధాన బ్యాంకుల్లో దాదాపు సగం మేర ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం గమనార్హం.

ఈ విధంగానే ఆదిలాబాద్ జిల్లాలో 5.82 లక్షల మంది పేదలకు జన్ ధన్ ఖాతాలుంటే వీటిలో 1.33 లక్షల ఖాతాలకు, హైదరాబాద్‌లో 12.47 లక్షల జన్ ధన్ ఖాతాలకు 1.60 లక్షల ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదు. దీంతో ఈ ఖాతాల్లో ఎన్ని బోగస్ ఉన్నాయనేది గుర్తించడం కష్టతరంగా మారిందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# మౌలిక సదుపాయాల కల్పనలో బిఆర్ఎస్, కాంగ్రెస్ విఫలం




### మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ వంటి ప్రతిష్టాత్మక నియోజకవర్గంలో సైతం అభివృద్ధి జరగకపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రంగా ఉండటం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల అసలైన ప్రతిఫలమేనని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో వర్షం పడితే రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయని, డ్రైనేజ్ నీరు ఇళ్లలోకి వస్తుందని, ప్రజలు గోడలు కట్టుకుని బతికే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానిం చారు. ఇది అభివృద్ధి కాదు, ఇది పాలన వైఫ ల్యం అని ఎద్దేవా చేశారు. బస్తీల్లో మౌలిక సదుపా యాలు పూర్తిగా కూలి పోయాయని, వీధిలైట్లు పని చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం ప్రజల జీవితాలను ఇబ్బం దులకు గురిచేస్తుందని తెలిపారు. ఇంత ముఖ్యమైన ప్రాంతంలో ఇలాంటి దుస్థితి ఉంటే, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఊహించుకోవచ్చునని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, రాజకీయ ప్రలోభాలు, మాయ మాటలతోనే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలు పక్కనపెట్టి, రియల్ ఎస్టేట్ లాభాలు, కాంట్రాక్టులు, రాజకీయ బేరసారాలు మాత్రమే ప్రభుత్వ ప్రాధాన్యం అయిపోయాయని ఆయన అన్నారు. ఎలక్షన్ కోడ్ నడుస్తున్న సమయంలో ముఖ్యమంత్రి ప్రజలను ప్రలోభపెట్టే విధంగా చేసిన వ్యాఖ్యలు అసహ్యకరమని డా. బూర నర్సయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీకి ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలు ఆపేస్తామని చెప్పడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణానికి రెండు వైపులన్నారు. ప్రజలు ఈసారి జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌లో బిజెపికి మద్దతు ఇచ్చి, కాంగ్రెస్, బిబీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీలను ప్రజలు ఇప్పుడు తీవ్రంగా ప్రశ్నిస్తు న్నారన్నారు.

# కల్వకుంట్ల కుటుంబాన్ని రక్షించడమే రేవంత్‌రెడ్డి బాధ్యత?


### బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజలకు అనేక సందేహాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు నయీం దోచుకున్న ఆస్తులను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచుతాం అని మాట్లాడారు. ఇప్పటికి 22 నెలలు అవుతున్నా, ఎందుకు నోరు మెదపడంలేదు? అంటూ ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని, బిఆర్ఎస్ నాయకులను రక్షించడమే రేవంత్ రెడ్డి బాధ్యతా? ఫోన్ ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌ని అరెస్ట్ చేయకుండా ఈ ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్–బిఆర్ఎస్ మధ్య ఎలాంటి చీకటి ఒప్పందం ఉన్నదో ప్రజలు ఇప్పుడు బహిరంగంగా అడుగుతున్నారు.

ఓటుకు నోటు కేసులో అప్పట్లో కెసిఆర్ రేవంత్ రెడ్డిని రక్షించారు. ఇప్పుడు ఆ రుణం తీర్చేసే ప్రయత్నం జరుగుతుందా అన్న అనుమానం కలుగుతుంద న్నారు. ఇదేనా కొత్త రాజకీయ నీతి?మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు సహా, బిఆర్ఎస్ కాలంలో ఉన్న ముఖ్య అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నిశ్శబ్దం వెనుక ఏ ఒప్పందం దాగి ఉంది?పదేళ్లు బిఆర్ఎస్ దోచు కుంది. ఇప్పుడు అదే మార్గంలో కాంగ్రెస్ కొనసా గిస్తుందన్నారు. ఇద్దరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుని, నింద మాత్రం బిజెపిపై మోపుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలన్నారు. అని. కానీ 22 నెలలు అయినా, ఒక లేఖ కూడా రాయలేక పోయారు. ఎందుకు? ఎవరిని రక్షిస్తున్నారు?ప్రజలు ఇప్పుడు అన్నీ గమని స్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఒక్కటే కాదు, ఇది భవిష్యత్తు ఎన్నికల తీర్పు నకు సూచన. రేవంత్‌రెడ్డి ఎంత బురద చల్లినా, కమలం బురదలోనే వికసిస్తుంది. గత ఏడు సంవత్స రాలుగా ప్రజల ఆశీర్వాదంతో, బిజెపి ఒక అసెంబ్లీ సీటు నుంచి ఎనిమిది సీట్ల వరకు ఎదిగిందన్నారు.

# బహరెయిన్‌లో భర్త అంత్యక్రియలకు సమ్మతిస్తూ మృతుడి భార్య అఫిడవిట్ దాఖలు

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 4, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లికి చెందిన శ్రీపాదనరేష్ ఐదేళ్ల క్రితం బహరెయిన్‌లో మృతి చెందడంతో అప్పటి నుంచి అతని మృతదేహం మార్చురీలో మగ్గుతున్నది. ఆయన మృతదేహాన్ని భారత్‌కు రప్పించడం సాధ్యం కాదని ఇండియన్ ఎంబసీ స్పష్టం చేయడంతో బహరెయిన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సమ్మతిస్తూ మృతుని భార్య శ్రీపాద లత(మునికోట నాగమణి) నిరభ్యంతర పత్రంపై సంతకం చేసారు. తదుపరి తీసుకోవాల్సిన చర్యల కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన సిఎం ప్రవాసీ ప్రజావాణిని సందర్శించి మృతుడు సోదరుడు ఆనంద్‌తో కలిసి జి.చిన్నారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డికి అందజేసారు. ప్రభుత్వం.. బహరెయిన్‌లోని ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి అక్కడే అంత్యక్రియలు జరిగేలా చూడాలంటూ ఎమ్మెల్యే కోరారు. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ బహరెయిన్ వెళ్లి అంత్యక్రియలకు హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్లు సంగి దేవేందర్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి సామాజిక సేవకులు మెరుపు తేజ, ఆకుల ప్రవీణ్, బొజ్జ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బహరెయిన్‌లోని సామా జిక కార్యకర్తలు డి.వి. శివకుమార్, కోటగిరి నవీన్‌కుమార్, నోముల మురళి భారత కార్యా లయంతో సమన్వయంచేసి సాంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు.




చిన్నారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్‌ఛైర్మన్ మంద భీమిరెడ్డి తదితరులు

# ప్రజలను మోసం చేసే పార్టీ కాంగ్రెస్

### ఓట్ల కోసం, సీట్ల కోసం ఎంతకైనా దిగజారుతారు

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసే పార్టీ అని, ఓట్ల కోసం, సీట్ల కోసం, వాళ్లు ఎంత దిగజారడానికైనా సిద్ధమే అని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రజలను ఆకట్టుకునేందుకు ఆకాశాన్నే చేతిలో పెడతామని చెబుతారు, కానీ వాస్తవంలో మాట నిలబెట్టుకోరు. హామీలు ఇవ్వడమే వాళ్ల లక్ష్యం – కాని అమలు మాత్రం శూన్యం అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డిక్లరేషన్ల పేరుతో వివిధ వర్గాల ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారన్నారు. మహిళల కోసం మహిళా డిక్లరేషన్, దళితుల కోసం దళిత డిక్లరేషన్, రైతుల కోసం కిసాన్ డిక్లరేషన్, యువత కోసం యువ డిక్లరేషన్ అంటూ.. ప్రతి వర్గానికి అనేక హామీల వర్షం కురిపించారు.

కానీ ఇప్పుడు ఆ డిక్లరేషన్లు అన్నీ ఎక్కడున్నాయి? మాయమైపోయాయి.. మసకబారిపోయాయి.. ప్రజలకు చేసిన వాగ్దానాలు బుట్టదాఖలయ్యాయి. ఓట్లు, సీట్లు దక్కించుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఆ హామీల విలువ మరిచిపోయింది. ఇదే వాళ్ల నిజస్వరూపం –మాటలు గొప్పగా, పనులు సున్నా! ఏ ఒక్క డిక్లరేషన్ అయినా కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈరోజు గుర్తు చేసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు.

దళితులకు సంబంధించిన హామీలు... ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పారు. విద్యార్థులు 10వ తరగతి పాస్ అయితే రూ.10,000, డిగ్రీ పూర్తయితే రూ.50,000, ఆపై ఉన్నత విద్య కోసం రూ.1 లక్షతో పాటు ప్రాజెక్ట్ లు, పరిశోధనల నిమిత్తం మరో రూ.5 లక్షలు ఇస్తామని మాటలు చెప్పారు... ప్రకటనలు గుప్పించారు. కానీ ఈ హామీలలో ఒక్కటీ నెరవేరలేదన్నారు. కాగితం మీద మాత్రమే ఉన్న దళిత డిక్లరేషన్ – ప్రజల జీవితాల్లో మాత్రం శూన్యం! అన్నారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సందర్భంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అదే పాత నాటకం మొదలుపెట్టిందన్నారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా, మళ్లీ అదే వాగ్దానాలతో పేద ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

# మక్కల కొనుగోలు పరిమితి 25 క్వింటాళ్లకు పెంపు

### కేంద్రం దృష్టికి జిన్నింగ్ మిల్లుల సమస్యలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త :** ఈ సీజన్‌లో మక్కల దిగుబడి ఎక్కువగా ఉంటుందనే అంచనాలతో పాటు, రైతుల విజ్ఞప్తి మేరకు వాటి కొనుగోలు పరిమితిని ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుండి 25 క్వింటాళ్లకు పెంచాలని నిర్ణయించినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మక్కల కొనుగోలు కోసం 214 కొనుగోలు సెంటర్లు ప్రతిపాదించగా, 125 సెంటర్లు ప్రారంభించి, మిగిలిన వాటిని కూడా వెంటనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 125 సెంటర్ల ద్వారా 23,131 మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్టు చెప్పాం ు. మొత్తం రూ.2500 కోట్ల ఖర్చుతో మక్కలను కొనేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలియచేశారు. కాగా జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై సిసిఐ సిఎండి లలిత్ కుమార్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సిసిఐ అవలంబిస్తున్న అలాట్‌మెంట్ విధానం వల్ల కొనుగోళ్లు కొన్ని జిన్నింగ్ మిల్లులలో మాత్రమే జరుగుతున్నందున, అనేక జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు నెలకొంటోందని చెప్పారు. అలాగే కపాస్ కిసాన్ యాప్ లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు, మిల్లుదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లను రెండు రోజులలో ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తేమ శాతం 12 కు పైగా ఉంటుందని, దీనిని సీసీఐ వారు కొనకపోవడంతో, రైతులకు బహిరంగ మార్కెట్లో మంచి ధర రాకపోవడంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎకరాకు 7 క్వింటాల కొనుగోలు పరిమితి ఎత్తివేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన సవరణలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కీలక పరిణామం

### రామచందర్‌రావు, కిషన్‌రెడ్డితో జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్ భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయి బిజెపికి పూర్తి మద్దతు ప్రకటించారు. రెండు పార్టీల నాయకులు బుధవారం మీడియా సమావేశం నిర్వహించి తమ భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నారు. హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో జరిగిన ఈ భేటీలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డితోపాటు రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీ జనసేన అధ్యక్షులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు జరిగినట్టు నాయకులు తెలిపారు.

# ఉపఎన్నికలో గెలుపే లక్ష్యం

### కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం: మేయర్ గద్వాల విజయలక్ష్మి

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించేందుకు కీలకమైన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గాంధీభవన్‌లో జరిగింది. కమిటీ చైర్ పర్సన్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, చైర్ పర్సన్ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించ బడింది. సమావేశంలో పాల్గొన్న కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు.7 డివిజన్ల ఇంఛార్జిలు, చైర్మన్‌లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకమై కాంగ్రెస్ గెలుపు అనే ఏకైక లక్ష్యంతో కట్టుబడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ "జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పై అపారమైన నమ్మకం ఉంచారు. ఈ నమ్మకాన్ని కాపాడుకుంటూ, ప్రతి డివిజన్‌లో సమన్వయంతో పనిచేసి, నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నదే మా సంకల్పం అని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త, నాయకుడు ఒక్కొక్కరు ఒక్కో డివిజన్‌లో బూత్ లెవెల్ వరకు చురుకుగా పనిచేయాలి. ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణ ఇవే మన విజయ సూత్రాలు అని పిలుపునిచ్చారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వకపోతే యుద్ధమే

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** ఫీజుల సమస్యలు చర్చించడానికి అఖిల పక్షం ఏర్పాటు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 6 వేల కాలేజీలు మూసివేసి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి పట్టింపులేదని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తూ వెంటనే స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 24 నెలలు గడుస్తున్న చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. బిసిలు ఉన్నత చదువులు చదువుకొని అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక పోతున్నారు. ఫీజులు చెల్లించడానికి డబ్బులు లేవనడం విద్యను నిర్లక్ష్యం చేయడమే అవుతుందని, బకాయిలు ఇవ్వకపోతే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏంచేస్తున్నారని కృష్ణయ్య ప్రశ్నించారు.



## సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నారాయణస్వామి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 4:** తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాజకీయం మరింత వేడెక్కుతోంది. గెలుపు కోసం అందివచ్చే ఏ చిన్న అవకాశాన్ని కూడా రాజకీయంగా వదిలిపెట్టడం లేదు. ఈ క్రమంలో చేరికలపై పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరికలు జరిగాయి. తన అనుచరులతో కలిసి వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ స్వామి కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వీరికి పార్టీ కండువా కప్పి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. నారాయణస్వామితో పాటు ఆయన కుమారుడు రామచందర్‌కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు,దామోదర రాజనర్సింహ,పార్టీ నేతలు అర్కల నర్సారెడ్డి, బిఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవలే తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్,మాజీ మంత్రి హరీశ్‌రావు వడ్డెర సంఘం నాయకులతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ స్వామి కాంగ్రెస్ గూటికి చేరడం ఆసక్తిగా మారింది.

## రాష్ట్రంలో విచ్చలవిడిగా ఎరువుల వాడకం

### 20 లక్షల టన్నులకుపైగా యూరియా వినియోగం

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త :** తెలంగాణలో పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. రాష్ట్రంలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగిం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకుపైగా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పొలాల్లో చల్లుతున్నట్లు అధికారులు గుర్తించారు.

## యుఎఇ నిర్బంధంలోని సోదరుడి విడుదల కోసం నటి సెలీనాజైట్లీ పోరాటం

**న్యూఢిల్లీ, నవంబరు 4:** యూఏఈలో నిర్బంధంలో ఉన్న తన సోదరుడు, ఆర్మీ మాజీ మేజర్ విక్రాంత్ కుమార్ జైట్లీకి సహాయం అందించాలంటూ ప్రముఖ నటి సెలీనా జైట్లీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర విదేశాంగ శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది. విక్రాంత్ జైట్లీతో సెలీనా మాట్లాడేందుకు, అలాగే యూఏఈ లోనే ఉన్న ఆయన భార్యతో సంప్రదింపులు జరిపేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై పూర్తి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించింది. విక్రాంత్ జైట్లీ 2016 నుంచి యూఏఈలో నివసిస్తున్నారు. అయితే, జాతీయ భద్రతా కారణాల రీత్యా 2024 సెప్టెంబర్ నుంచి ఆయన్ను అక్కడి అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నట్లు కోర్టుకు తెలియజేశారు.

## ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి పాక్ వెళ్లిన భారత్ సిక్కు బృందం

**న్యూఢిల్లీ, నవంబరు 4:** సిక్కుల మతగురువు గురునానక్ జన్మస్థలం నన్‌కానా సాహిబ్ సందర్శనకోసం వెళ్లిన 2100 మంది సిక్కు యాత్రీకులు అట్టారీ వాగా సరిహద్దును దాటుకుని పాకిస్తాన్‌లో ప్రవేశించారు. వారందరికీ సాదరస్వాగతం లభించింది. ఆపరేషన్ సింధూర్‌తర్వాత సరిహద్దులను రెండుదేశాలు మూసివేసాయి. మొట్టమొదటిసారిగా సిక్కుల బృందం పాక్‌ను సందర్శించింది. బుధవారం గురునానక్ జన్మస్థలం వెళతారు. లాహోర్‌కు పశ్చిమప్రాంతంలో 80 కిలోమీటర్ల దూరంలో ఈనన్‌కానా సాహిబ్ ఉంది. ఆ తర్వాత గురుద్వారా పంజా సాహిబ్ హసన్ అబ్దల్, గురుద్వారా సచ్చాసౌదా ఫరూకాబాద్, గురుద్వారా దర్బార్ సాహిబ్ కర్తార్‌పూర్‌లను కూడా సందర్శించి ఈనెల 13వ తేదీ భారత్‌కు తిరిగి వచ్చేస్తారు. పాకిస్తానీ ప్రబుత్వం 2150 మంది సిక్కు భక్తులకు వీసాలు మంజూరుచేసింది. గురునానక్ 556వ జయంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీరంతా పాక్ వెళ్లారు. పదిరోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలో వీరంతా సిక్కుప్రార్థనలు చేస్తారు. భారత ప్రభుత్వం కూడా వీరందరికీ అనుమతులు మంజూరు చేసింది. ఎస్‌జిపిసి యాత్రావిభాగ్ ఇన్‌ఛార్జి పల్వీందర్‌సింగ్‌మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐలను అనుమతించకపోవడంపై భారత ప్రభుత్వ విధానం తమకు అర్థం కాలేదన్నారు. ముందు భారత ప్రభుత్వం అనుమతులు నిరాకరించింది. సిక్కు సంఘాలనుంచి తామరతంపరలుగా విజ్ఞప్తులురావడంతో పరిశీలనచేసింది. పాక్ సిక్కుగురుద్వారా ప్రభంధక్‌కమిటీ అద్యక్షుడు పంజాబ్ మైనార్టీమంత్రి రమేష్‌సింగ్ అరోరా, ఎవాక్యూయీ ట్రస్టు ప్రాపర్టీబోర్డు చీఫ్ సాజిద్‌మహమూద్‌చౌహాన్, అదనపు కార్యదర్శి నాసిర్ ముస్తాక్ ఈ భక్తులను పాక్‌వైపు చెక్‌పోస్టువద్ద సాదరస్వాగతం పలికి తోడ్కొని వెళ్లారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ప్రతినిధిబృందం గురీందర్‌కౌర్, ఢిల్లీ గురుద్వారా మేనేజ్‌మెంట్‌కమిటీ ప్రతినిది రవీందర్‌సింగ్ స్వీతాలు కూడా పాకిస్థాన్ బృందంలో ఉన్నారు.

# ప్రమాదాలను ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదు

### వాటి నివారణ కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలి : డిజిపి శివధర్‌రెడ్డి

### బస్ ప్రమాద ఘటనాస్థలం పరిశీలన

**చేవెళ్ల, నవంబరు 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ గేటు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన డిజిపి శివధర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగిందని, ప్రమాద సమయంలో దాదాపు 40 మీటర్లు లక్కెళ్లడంతో తీవ్రత మరింత పెరిగిందన్నారు. ప్రమాదంలో ఆర్టీసీలో రైడ్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, రోడ్డు మలుపు ఉన్నా ఆక్సిడెంట్ అయ్యేంత తీవ్ర మలుపు ఏమి లేదన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని, పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెళ్ళడవుతాయన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్ మెకానిక్ ద్వారా పరిశీలిస్తున్నామని, టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని, ఇది అందరి బాధ్యతగా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందని, చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల వలన మరణిస్తున్నారన్నారు. రోడ్డు మీద డ్రైవ్ చేసే వారు డిస్టెన్స్, కండిషన్‌ను అంచనా వేసుకొని డ్రైవ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుండి అవగాహనా కార్యక్రమాలు చెప్పాడుతామన్నారు. రోడ్ సేఫ్టీ సమస్యలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్పీడ్ లిమిట్ ఉన్న చోట తప్పులు, ధైర్యం, నిరక్ష్యం ప్రాణాలు తీస్తోందన్నారు. ఎంత ఎక్స్ పీరియన్స్ ఉన్నప్పటికీ రోడ్లపై జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. కాబట్టి రోడ్లపై ప్రతి మలుపు వద్ద జాగ్రత్తగా ఉండాలి అని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా అరైవల్ పేరుతో కొత్త రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు డీజీపీ వెల్లడించారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు, సోషల్ క్యాంపెయిన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్కూళ్లు, కాలేజీలు, కార్పొరేట్ సంస్థలతో సమన్వయం చేస్తూ డ్రైవర్లలో భద్రతా చైతన్యం పెంపొందించే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం చేవెళ్ల ప్రమాదంపై స్థానిక ఏసీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోందని, ఘటనకు కారణాలు త్వరలో వెల్లడిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డిసిపి యోగేష్ గౌతమ్, అడిషనల్ డీసీపీ కె ఎస్ రావు, చేవెళ్ల ఎసిపి కిషన్ గౌడ్, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి సాయి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల బస్సు ప్రమాదస్థలాన్ని పరిశీలించిన తర్వాత మంగళవారం పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డిజిపి శివధర్‌రెడ్డి

# ఫిన్‌టెక్ 'గ్లోబల్ కమాండ్ సెంటర్'గా హైదరాబాద్

### రీసెర్చ్, బ్రేక్‌త్రూ ఐడియాలకు ప్లాట్‌ఫామ్‌గా గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్

### డాయిష్ బోర్స్ గ్రూప్ జిసిసి ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 4:** హైదరాబాద్‌ను గ్లోబల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ(ఫిన్ టెక్)కి అత్యంత కీలకమైన గ్లోబల్ కమాండ్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం రాయదుర్గంలో అంతర్జాతీయ దిగ్గజ ఫైనాన్షియల్ మార్కెట్ సంస్థ డాయిష్ బోర్స్ గ్రూప్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పిల్లర్‌గా ఉన్న డాయిష్ బోర్స్ గ్రూప్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ పటిష్ఠమైన పాలసీలు, స్థిరత్వం, ఇక్కడి టాలెంట్ పూల్‌పై గ్లోబల్ కంపెనీలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచంలోని టాప్ టెన్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలలో ఏడు ఇక్కడ నిర్వహిస్తుండటం మనకు గర్వకారణ మన్నారు. డాయిష్ బోర్స్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ క్యాపి టల్, సంపదకు శక్తినిచ్చే కేంద్రంగా అంతర్జాతీయ యవనికపై మరోసారి నిరూపిం చుకుందన్నారు. నగరాన్ని కేవలం ఇంక్యుబేషన్ హబ్‌గా మాత్రమే కాకుండా గ్లోబల్ ఆవిష్కరణ పవర్‌హౌస్‌గా మార్చేలా ఒక ప్రత్యేక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించ బోతున్నట్లుగా వెల్లడించారు. ఈ హబ్ రీసెర్చ్, బ్రేక్‌త్రూ ఐడియాలకు ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పెట్టుబడులను ఆకర్షిం చడంపైనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే వాల్యూను సృష్టించేందుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ జీసీసీ షాంఘై స్టాక్ ఎక్స్చేంజ్ వంటి ప్రధాన ఎక్స్చేంజీలతో సహా 24 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహించే గ్లోబల్ మార్కెట్లకు అత్యున్నత సేవలు అందిస్తుందన్నారు. తొలిదశలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇంజనీరింగ్ వంటి డీప్ టెక్నాలజీ రంగాల్లో 1,000 మందికి హై స్కిల్డ్ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెండింతలు అవుతుందన్నారు. కార్యక్రమంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డ్యుయిష్ బోర్స్ సీఐవో/సీవోవో డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, డైరెక్టర్ డాక్టర్ లుడ్విగ్ హీన్సెల్‌మన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డుల కుటుంబీకులకు బీమా సొమ్ము అందజేత

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** సైబరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాలలో చనిపోయిన ఇద్దరు హోంగార్డుల కు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు బీమా పథకం కింద వచ్చిన నగదును వారి కుటుంబీకులకు హోంగార్డుల అదనపు డిజి స్వాతి లక్రా అందజేశారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం హోంగార్డు ఇమ్మడి తిరుపతి కుటుంబానికి 30 లక్షల రూపాయలు, సైబరాబాద్ కానిస్టేబులఖ సింహాచలం కుటుంబానికి 28 లక్షల రూపాయలను స్వాతి లక్రా అందజేశారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ చెక్కులను ఆమె హోంగార్డుల కుటుం బీకులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు అధికారులతో పాటు హోంగార్డుల విభాగం అధికారులు, హోం గార్డుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## మండలి భవనం పునర్నిర్మాణ పనులను సమీక్షించిన చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 4:** తెలంగాణ శాసన సభ ప్రాంగణములో, తెలంగాణ శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంగళవారం పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అతి త్వరలోనే శాసన మండలి భవన ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. నరసింహా చార్యులు, ఆర్ అండ్ బి అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జరుగుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలోనే నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. శాసన మండలి నూతన సమావేశ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అతి త్వరలోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని, తాజాగా ఇప్పటి వరకు పూర్తి అయిన పనుల గురించి సీఎం ఆరా తీశారని, ఖచ్చితంగా శాసన మండలి సమావేశాలు పాత భవనంలోనే నిర్వహించాలని వారు ఆదేశించారని తెలిపారు. పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా, వేగం పెంచాలని, త్వరగా భవనాన్ని పూర్తి చేసి శాసన మండలి అధికారులకు అప్పగించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.

# వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

### కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ

### బయోఫర్టిలైజర్స్‌నే వినియోగించాలి

### ఉద్యాన విశ్వవిద్యాలయ విసి రాజిరెడ్డి

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని కొండా లక్ష్మణ్ ఉద్యానవన శాఖ విశ్వ విద్యాలయం ఉపకులపతి దండ రాజిరెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం రామ గిరి ఖిల్లా, వ్యవసాయ అనుబంధ శాఖల సహకారంతో రైతు సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1.20 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో వరి పండిస్తున్నారన్నారు. అయితే వరికి కిలోకు 300 లీటర్ల నీటి అవసరం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో వరి పండిస్తే సరిపోతుందన్నారు. మిగిలిన వరి పంటకు ప్రత్యమ్నాయంగా కూరగాయలు, కందులు, గోధుమలు, నువ్వులు, మక్కలు, శనగలు, ఇతరత్రా పంటలు వేయాలని రైతులకు సూచించారు. ఐదు పంటలు పండించవచ్చని, కానీ రైతులు వరి, పత్తి రెండు పంటలు మాత్రమే సాగు చేస్తున్నారన్నారు. అలాగే పంటలకు బయో ఫెర్టిలైజర్ మందులను విరివిగా ఉపయోగించాలన్నారు. అయితే ప్రస్తుతం రైతులు అధికంగా రసాయన పురుగు మందులు వాడుతున్నారని, అందువల్ల క్యాన్సర్ తదిర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకప్పుడు కూరగాయలు, పెసలు, కందులు పండించిన తెలంగాణలో ప్రస్తుతం రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు పలువురు పాల్గొన్నారు.

# ఇళ్లు కూలగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా!

### మీ మంత్రుల ఇళ్ల మీదకు బుల్డోజర్లు ఎందుకు వెళ్లలేదు?

### ఎల్లారెడ్డిగూడ సభలో కెటిఆర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 4, ప్రభాతవార్త:** ఇళ్లను కూలగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పేదల ఇళ్లపైకి వెళ్లిన బుల్డోజర్లు చెరువులో ఉన్న నీ సోదరుడి ఇంటికి, మంత్రుల ఇంటికి ఎందుకు వెళ్లడం లేదంటూ ప్రశ్నించారు. పేదల్లోకు ఒక న్యాయం, మీ వాళ్లకు ఒక న్యాయమా అంటూ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమాజీగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో మంగళవారం రాత్రి నిర్వహించిన భారీ రోడ్‌షో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిని మోసం చేసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికలు పదేళ్ల వికాసానికి రెండేళ్ల విధ్వంసానికి, పదేళ్ల అభివృద్ధికి, రెండేళ్ల వెనుకబాటుతనానికి మధ్య యుద్ధం అన్నారు. కారుకు, బుల్డోజరుకు మధ్య పోటీ అని కారుకు ఓటేస్తేనే రేపటి భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని, రిటైర్డ్ ఉద్యోగులకు రెండేళ్లు గడుస్తున్నా చిల్లిగవ్వ రాలేదని, మహిళలకు రూ. 2500, 400ల ఫించను రాలేదని, ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ ఏవి అమలు కాలేదన్నారు. ఆయన మాటలు నమ్మిన ఉద్యోగులు నేడు ఉద్యోగాలు రాక నిద్రలేకుండా ఏడుస్తున్నారన్నారు. రైతులు సంతోషంగా లేరని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని అన్నారు. ఓటు కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారంటీల కార్డు చూపి ఏం చేశారంటూ నిలదీయాలన్నారు. ఈ ఎన్నికలు కేవలం జూబ్లీహిల్స్‌కు పరిమితం కాదని, నాలుగు కోట్ల మంది భవిష్యత్తును నాలుగు లక్షల మంది తమ ఓటు ద్వారా తేల్చిచెప్పేవని అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని, కారు గుర్తుకు ఓటు వేసి మాగంటి సునీతగోపీనాథ్‌ను గెలిపించాలన్నారు. ఓటు వేయకుంటే పథకాలు నిలిపివేస్తానని ప్రజలను బెదిరిస్తున్నారని, రేవంత్ రెడ్డి నడిపేది సర్కారా లేక రౌడీదర్బారా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి వారికి ఓటర్లు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. తల్లిదండ్రులను చూసుకోని ఉద్యోగులకు జీతంలో 15 శాతం కోతపెడుతానని చెప్పిన రేవంత్‌రెడ్డి తల్లిదండ్రుల లాంటి పదవీవిరమణ పొందిన ఉద్యోగుల డబ్బులు ఇవ్వకుంటే ఆయన జీతంలోనూ కోత పెట్టాలి కదా అంటూ ప్రశ్నించారు. ఓటు ద్వారా ప్రజలు రేవంత్‌రెడ్డికి వాత పెట్టాలని, సరైన సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిగూడలో జరిగిన రోడ్‌షోలో కెటిఆర్

## డిజిపితో ఇద్దరు ఐపిఎస్ అధికారుల భేటీ

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త :** ఇటీవలే ఐపిఎస్ హోదా అందుకున్న మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డి, సిఐడి ఎస్‌పి శ్రీనివాస్ (ఇంతకు ముందు వీరిద్దరు నాన్ కేడర్ ఎస్‌పిలుగా వున్నారు) మంగళవారం నాడు డిజిపి శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశా రు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులను ఐపిఎస్ హోదా అందుకున్నందుకు డిజిపి అభినందించారు.

## 1,037 ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సేవలు మరో యేడాది పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 4:** ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 1,037 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సేవలను మరోసారి ఏడాది పాటు కొనసాగించేందుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకానికి సంబంధించిన పద్ధతులను అనుస రించాలని నెలకు రూ.19,500 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పంచాయతీ సెక్రటరీల సంఖ్య గ్రామ పంచాయతీల సంఖ్యను మించకుండా చూసుకోవాలని ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులపై క్యూఆర్ కోడ్

### గడువుతీరిన మందులను అరికట్టేందుకు అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 4:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ.500 కోట్ల విలువైన ఔషధాలను కొనుగోలు చేస్తుండగా ఏటా పెద్ద మొత్తంలో మందులు గడువుతీరి వృథా అవుతున్నాయి. రాష్ట్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)ల నుంచి మొదలుకొని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, జిల్లా, బోధనాసుపత్రులు దాదాపు 6,300 వరకు ఉన్నాయి. అన్ని చోట్లా క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో మందుల వివరాలు తెలుసుకునేలా సరికొత్తగా సాఫ్ట్‌వేర్‌ను రూపొం దిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ఓపీ రోగులకు ఇచ్చే స్లిప్‌పై తాజా విధానంలో క్యూఆర్ కోడ్ రానుంది. రోగికి రాసే మందుల వివరాలను దాని ఆధారంగా డాక్టర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ ప్రకారం ఫార్మసిస్టు మందులు ఇస్తారు. రోగి మళ్లీ ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే దాని ఆధారంగా గతంలో వాడిన మందుల వివరాలు మొత్తం తెలుస్తాయి.

## బొగ్గు నుండి సింథటిక్ సహజవాయువు

### ఇసిఎల్, ఎన్టీపిసి మధ్య ఒప్పందం

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త :** సౌకర్యవంతమైన విద్యుత్ ఉత్పత్తిని నిర్ధారించడం, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరచే ప్రయత్నాలలో భాగంగా బొగ్గు నుండి సింథటిక్ సహజ వాయువు (ఎస్ఎన్‌జి) సౌకర్యాన్ని అభివృద్ధి చేయడానికి ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఇసిఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) తెలిపింది. అధికారిక ప్రకటన ప్రకారం ప్రతిపాదిత సౌకర్యం దాని క్యాప్టివ్ మైన్స్ నుండి అధిక బూడిద దేశీయ బొగ్గును ఉపయోగించి సింథటిక్ సహజ వాయువును ఉత్పత్తి చేస్తుందని వెల్లడించింది.

# రోజుకు 15 మందిని చంపేస్తున్న అతివేగం

### తెలుగు రాష్ట్రాల్లో రెండేళ్లలో ఓవర్‌స్పీడ్ కారణంగా 11 వేల మంది బలి

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో ఏటా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారు 15 వేల మంది వరకు వుండగా ఇందులో ఐదున్నర వేల మంది అతి వేగం కారణంగా చనిపోతున్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే 90 శాత ం వరకు వుండగా ఇందులో అతివేగం మరింతగా వుంటుందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 19 మంది మరణించడానికి కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ మితిమీరిన వేగం కారణంగా తేలడంతో తెలుగు రాష్ట్రాల్లో అతివేగం కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరోసారి తెరపైకి వచ్చింది.

దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారు లక్షా 15 వేల మంది వరకు వుండగా ఇందులో 40 శాతం మరణాలు అతి వేగం కార ణంగా చోటు చేసుకుంటున్నట్లు కేంద్ర రహదారి భద్రతా విభాగం పరిశీలనలో వెల్లడయ్యింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మౌలిక వసతులు ఎక్కువగా వున్న తెలుగు రాష్ట్రాలలో ఈ తరహా దుర్ఘటనలు ఎక్కువగా వుందని, ఈ విషయంలో రెండు రాష్ట్రాలు ఏడవ స్థానంలో వున్నట్లు ఆ పరిశీలనలో వెలుగు చూసింది.

పెద్ద రాష్ట్రాలుగా వున్న యుపి, గుజరాత్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిషా, మధ్యప్రదేశ్‌లతో పోలిస్తే తెలంగాణలో అ తివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ అనేక మంది మరణిస్తున్నట్లు కేంద్ర రహదారి భద్రతా విభాగం తేల్చింది. అతి వేగం వి షయానికే వస్తే ప్రభుత్వ వాహనాలకు స్పీడ్ లిమిట్స్‌తో పాటు స్పీడ్ లాక్‌ల ఏర్పాటు వుంటుండగా ప్రైవేటు వాహనాలకు ఇవేవి వుండకపోగా, రేసు గుర్రాల దూసుకు పోతాయని అందరికి తెలిసిందే. కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదానికి బస్సు ఓవర్ స్పీడ్ ఒక కారణం కాగా రోడ్డుపై పడివున్న బై క్‌ను ఢీకొన్న తరువాత కూడా ఆపకుండా 200 మీటర్ల వరకు వేగంగా వెళ్లడం, ఈ సమయంలోనే బైక్ నుంచి పెట్రోల్ కారి నిప్పురవ్వలు ఎగసి పడి మంటలు చెలరేగాయి. ఈ మంటలు బస్సుకు అంటుకుని 20 మంది సజీవ దహనం అయ్యారు. కర్నూలు దుర్ఘటనను మరువక ముందే చేవె ళ్లలో సోమవారం ఇదే అతివేగం కారణంగా మరో దుర్ఘటన జరిగి 19 మంది బలయ్యారు. పరిమితికి మించిన కంకర లోడ్‌తో అతి వేగంతో వెళుతున్న టిప్పర్ ఎదురుగా 70 మంది ప్రయాణీకులతో వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో 19 మంది మరణించారు. మృతుల్లో ఆర్టీసీ బస్సు డ్రై వర్‌తో పాటు టిప్పర్ డ్రైవర్ కూడా వున్నారు. ఒక్క చేవెళ్ల దుర్ఘటనే కాదు. రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 80 శాతం దుర్ఘటనలు అ తి వేగం కారణమని తేలింది. అతి వేగం వల్ల తెలుగు రాష్ట్రాల్లో నిత్యం 15 మంది మరణిస్తున్నట్లు కేంద్ర రహదారి భద్రతా విభాగం పరిశీలనలో తేలింది. యముడి దున్నపోతులను తలపిస్తున్న టిప్పర్లు, ఇసుక లారీలు

ఇదిలావుండగా తెలుగు రాష్ట్రాల్లో అతి వేగం కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు ఇసుక లారీలు, టిప్పర్లు ప్రధానంగా నిలుస్తున్నాయి. ఇసుక లారీలు, కంకర, బండరాళ్లతో వెళ్లే టిప్పర్లు పగలు రాత్రి అనే తేడా లేకుండా ఓవర్ లోడ్‌తో పాటు ఓవర్ స్పీడ్‌తో వెళుతున్న తీరు ఆయా ప్రాంతాల వాసులను భయకంపితులను చేస్తుంటుంది.

ఇతర ప్రాంతాల విషయం ఎలావున్నా హైదరాబాద్‌లో రాత్రి వేళల్లో టిప్పర్లు, ఇసుక లారీలు కార్ రేసింగ్‌లో పాల్గొనే వాహనాల మాదిరిగా అతి వేగంతో వెళుతుంటాయి. ఇందులో బండరాళ్లతో వెళ్లే టిప్పర్లకు వెనుక భాగంలో ఎలాంటి రక్షణ వ్యవస్థ వుండడం లేదు. ఈ కారణంగా అనేకసార్లు టిప్పర్ల నుంచి బండరాళ్లు రోడ్లపై పడిపోవడం, ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ జాంలు ఏర్పడడం పరిపా టిగా మారింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల పలువురు మరణించగా మరికొందరు గాయపడిన ఉదంతాలూ వున్నాయి. చేవెళ్ల దుర్ఘటన తరువాత టిప్ప ర్లు, ఇసుక లారీలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం వుంది.

# ఆ పదివేలు లాలూ తాతలు దిగొచ్చినా దోచుకోలేరు..



## ధ్వజమెత్తిన కేంద్ర మంత్రి అమిత్ షా

**పాట్నా, నవంబర్ 4:** బీహార్‌లో జంగిల్‌రాజా తిరిగి రావ్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కేంద్రమంత్రి అమిత్ షా బీహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ ఇటీవల బీహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా ఆ సొమ్మును దోచుకోలేరన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ, నితీశ్ అభివృద్ధి మోడల్‌కు, ఆర్జేడీ, జంగిల్‌రాజ్‌కు మధ్య పోటీ జరుగుతోందని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బీహార్‌ను సమగ్ర అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. బీహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తే మిథిలాంచల్‌కు సాగునీరు అందించడానికి, ఆ ప్రాంతంలో వరదలను అరికట్టడానికి, కోషి నది నీటిని ఉపయోగించుకోవడానికి మొత్తం రూ.26,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే బీహార్ అభివృద్ధి బాటలో నడుస్తుందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. వైశాలి జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ ఆర్జేడీ నేతలు తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కావాల్సిన డబ్బు వారికి ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. యుపిఎ పాలనలో, కేంద్రం బీహార్‌కు రూ.2లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని, ఎన్డీఏ పాలనలో మోడీ ప్రభుత్వం పదేళ్లలో రూ.15 లక్షల కటోడ్ల విడుదల చేసిందన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడం గురించి ఎన్డీఏ మాత్రమే ఆలోచించగలదని ఆర్జేడీ కాదని విమర్శించారు.

# పథకాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట)**ఎత్తిపోతల నిర్మాణాలలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు.నాణ్యతా ప్రమాణాల అంశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.నాణ్యతా లోపించిందని తెలిస్తే ఉపేక్షి ంచేది లేదని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.రైతాంగాం కళ్ళలో వెలుగులు నింపడంతో పాటు హుజుర్నగర్,కోదాడ నియోజకవర్గలను సస్యశ్యామలం చేయడానికే ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొదలు పెట్టమన్నారు. అటువంటి నిర్మాణంలో నాణ్యత లోపించిందని తేలితే సహించేది లేదని ఆయన అధికారులకు,ఏజెన్సీ లకు అల్టిమేటం జారీ చేశారు.హుజుర్నగర్,కోదాడ నియోజకవర్గాలలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలపై మంగళవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్,ఇ.ఎన్.సి లు అంజద్ హుస్సేన్,శ్రీనివాస్, రమేష్ బాబు లతో పాటు హుజుర్నగర్ కోదాడ నియోజకవర్గలకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.ఎ హుజుర్నగర్ నియోజకవర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకంతో పాటు జవహర్ జానపహాడ్ బ్రాంచ్ కెనాల్,బెట్టే తండా,నక్కగూడెం,రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకాల పురోగతి తో పాటు,హుజుర్నగర్ లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన పురోగతిపై ఆయన సమీక్షి ంచారు.అంతే గాకుండా కోదాడ నియోజకవర్గ పరిధిలోని రెడ్లకుంట, రాజీవ్ శాంతినగర్,ఆర్9,మోతే ఎత్తిపోతల పథకాలతో పాటు కోదాడ లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన నిర్మాణం పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్దేశిత ఆయకట్టు కుబనుకుని ఉన్న భూములు సేద్యంలోకి వస్తాయని భావిస్తే ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన అధికారులకు సూచించారు. మైనర్ మార్పులతో ఆదనపు ఆయకట్టు సేద్యం లోకి వచ్చిందుకు అయ్యే అదనపు నిధులను మంజూరు చేయిస్తానని ఆయన వెల్లడించారు.ఎత్తిపోతల పథకాల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వం భూసేకరణ నిర్వహించి రైతులకు నగదు చెల్లింపులు జరిపిన భూములను సత్వరమే అధికారులు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. పంటకు పంటకు మధ్యలో ఉండే సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాల పై ఆయకట్టు రైతాంగం పెంచుకున్న ఆశలు నెరవేరాలి అంటే నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణకు రైతు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు పదిమంది సభ్యులు కమిటీలో ఉండేలా పర్యవేక్షణ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు.

# 'వేదం'ను బహిష్కరించవద్దు అమెరికా కోర్టుల ఆదేశం

## చేయని నేరానికి 43 యేళ్లు శిక్ష అనుభవించిన ఎన్నారై



**పెన్సిల్వేనియా, నవంబరు 4:** అమెరికాలో 43 ఏళ్ల పాటు ఓ హత్య కేసులో నిర్దోషిగా జైలు శిక్ష అనుభవించిన భారత సంతతి వ్యక్తికి తాత్కాలిక ఊరట లభించింది. అతడిని దేశం నుంచి బహిష్కరించవద్దని రెండు అమెరికా కోర్టులు ఇమ్మిగ్రేషన్ అధికారులను ఆదేశించాయి. సుబ్రమణ్యం వేదం (64) అనే తన తొమ్మిది నెలల వయసులో తల్లిదండ్రులతో కలిసి చట్టబద్ధంగా భారత్ నుంచి అమెరికాకు వలస వెళ్లారు. పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో ఆయన తండ్రి ప్రొఫెసర్‌గా పనిచేయడంతో అక్కడే పెరిగారు. అమెరికాలో శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కలిగిన వేదం, 1982లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత అరెస్ట్ అయ్యారు. 1980లో తన స్నేహితుడు థామస్ కిన్సర్ హత్యకు గురయ్యాడు. చివరిసారిగా కిన్సర్‌తో కనిపించింది వేదమే కావడంతో, ఎలాంటి బలమైన సాక్ష్యాలు లేకపోయినా పోలీసులు అతడిని నిందితుడిగా చేర్చారు. కోర్టు రెండుసార్లు అతడిని దోషిగా నిరా ధరించింది. అయితే, 40 ఏళ్లకు పైగా న్యాయపోరాటం చేసిన వేదం తరఫు న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు దాచిపెట్టిన కీలకమైన బాలిస్టిక్స్ ఆధారాలను ఇటీవల బయటపెట్టడంతో ఆగస్టులో న్యాయమూర్తి ఆయన శిక్షను రద్దు చేసి, నిర్దోషిగా ప్రకటించారు. గతనెల 3న పెన్సిల్వేనియా జైలు నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాల్సిన వేదంను, ఇమ్మిగ్రేషన్ అధికారులు నేరుగా అదుపులోకి తీసుకున్నారు. బహిష్కరణల కోసం ప్రత్యేకంగా ఎయిర్‌స్ట్రిప్ ఉన్న లూసియానాలోని డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. సుమారు 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఎల్ఎస్‌డీ డెలివరీకి సంబంధించిన డ్రగ్స్ కేసులో వేదంపై ఆరోపణలు ఉన్నాయి. దీనిని కారణంగా చూపుతూ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు ఆయనను బహిష్కరించాలని చూస్తున్నారు. అయితే, చేయని నేరానికి 43 ఏళ్లు జైల్లో గడిపిన వ్యక్తి విషయంలో ఈ పాత కేసును పరిగణనలోకి తీసుకోరాదని, జైల్లో ఉన్నప్పుడే ఆయన డిగ్రీలు సంపాదించి, తోటి ఖైదీలకు ట్యూటర్‌గా సేవలందించారని ఆయన న్యాయవాదులు వాదిస్తున్నారు. ఈ విషయంపై హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్పందిస్తూ హత్య కేసులో తీర్పు మారినంత మాత్రాన, పాత డ్రగ్స్ కేసు శిక్ష రద్దు కాదని స్పష్టం చేసింది. అయితే, తాజాగా ఇమ్మిగ్రేషన్ కోర్టుతో పాటు, పెన్సిల్వేనియాలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు కూడా ఆయన బహిష్కరణపై స్టే విధించాయి. రెండు వేర్వేరు కోర్టులు సుబు (సుబ్రమణ్యం) బహిష్కరణ సరికాదని చెప్పడం మాకు ఉపశమనం కలిగించింది.

చేయని నేరానికి 43 ఏళ్లు జైల్లో మగ్గిన వ్యక్తికి మరో అన్యాయం జరగదని ఆశిస్తున్నామని ఆయన సోదరి సరస్వతి వేదం అన్నారు. ప్రస్తుతం ఆయన కేసుపై ఇమ్మిగ్రేషన్ అప్పీల్స్ బోర్డు తుది నిర్ణయం తీసుకోవడానికి కొన్ని నెలలు పట్టవచ్చు.



# ప్రభుత్వ విద్యా వవస్థను బలోపేతం చేయాలి: కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:** విద్యా వవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లతో మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థలు బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలలో పూర్తి సదుపాయాలు కల్పించడం జరిగిందని, విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. కళాశాలలలో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా అధ్యాపకులు పర్యవేక్షి ంచాలని, విద్యార్థుల గైర్హాజరుపై వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని, ఫలితాలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ముఖ గుర్తింపు ద్వారా విద్యార్థుల హాజరు తీసుకోవాలని, యు డైస్ యాప్ లో వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధ్యమిక విద్యాశాఖ అధికారి రాందాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లేరు సరస్సు అభివృద్ధి కోసం అథారిటీ ఏర్పాటు

**విజయవాడ ,నవంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కొల్లేరు వన్యప్రాణి సంరక్షణా ప్రాంతం, రామ్సార్ స్థలంగా గుర్తింపు పొందిన సరస్సును సుస్థిరంగా అభివృద్ధి చేయడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం కోసం అథారిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కొల్లేరు సరస్సు పరిరక్షణ, అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక రూపొందించడం అథారిటీ కీలక లక్ష్యంగా ఉంది.పర్యావరణ కాలుష్యం నియంత్రణ, నీటి నాణ్యత మెరుగుదల. చేపల వైవిధ్యం రక్షణ, సుస్థిర మత్స్యాభివృద్ధి. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఆదాయ అవకాశాలు. జీవ వైవిధ్యం సంరక్షణ, ఆక్రమించే జాతుల నియంత్రణ. సిల్టేషన్ నియంత్రణ, నీటి ప్రవాహ వ్యవస్థ పునరుద్ధరణ. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం జరిపి పురోగతి సమీక్ష చేస్తారు...అథారిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడుగా ఉంటారు. ఉపాధ్య క్షులుగా పర్యావరణ, అరణ్య, విజ్ఞాన సాంకేతిక శాఖ ప్రధాన కార్యదర్శి,రెవెన్యూ, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీ రాజ్, వాటర్ రిసోర్సెస్, టూరిజం, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్లు (ఏలూరు, భీమవరం, మచిలీపట్నం), బయోడైవర్సిటీ బోర్డు, విల్ డెహ్రా సభ్యులుగా ఉంటారు.

# ఓవర్‌లోడ్ వాహనాలపై నియంత్రణ ఎవరిది?

## విజిలెన్స్ బృందాల తనిఖీలు అంతంత మాత్రమే, జీరో బిల్లులతో ఓవర్‌లోడ్

## ఇసుక, కంకర డస్ట్ తరలింపులలో కనిపించని టార్పాలిన్లు

**రంగారెడ్డి అర్బన్,నవంబర్04,ప్రభాతవార్త:-**చేవెళ్ల బస్సు ఘటనతో ఓవర్ లోడ్ వాహనాల నియంత్రణ అంశం తెరమీదకు వచ్చింది.ఎవరు ఓవర్ లోడును కంట్రోల్ చేయాలి.కమర్షియల్ వాహనాలు ఏ మేరకు తరలించాలి..ఎంత లోడ్డు ఉండాలి..లేకుంటే అవాహనాలపై ఎంత పెనాల్టీ వేయాలి.. నిబంధనలు అతిక్రమిస్తే వాటిపై ఎలాంటి కేసులు నమోదు చేయాలి..వాహనం సీజ్ చేయాలంటే ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకుంటారనే అంశాలపై ఇప్పుడు జోరుగా చర్చ జరుగుతున్నది.విజిలెన్స్ బృందాలు సైతం ఏంచేస్తున్నాయనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతున్నది.కమర్షియల్ వాహనాలు పరిమితికి మించి రవాణా చేయవద్దనే నిబంధనలు ఉన్నాయి.ఆ వాహనాలను నిత్యం పర్యవేచినసిన చేయాల్సి ఉంటుంది.రవాణా శాఖ అధికారులు ప్రతి రోజూ తనిఖీలు చేయాలి.కానీ వారి ఉదాసీనత కారణంగానే కమర్షియల్,మైన్స్ మినరల్స్ తరలించే వాహనాలు నిబంధనలు పాటించడం లేదని సమాచారం.తనిఖీ చేయాల్సిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని,రాష్ట్రంలో ఏదైనా ఘటన జరిగితేనే స్పందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.దీనికి తోడు మైనింగ్ వ్యాపారులు (క్రషర్ మిషన్ వ్యాపారులు) నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేబిల్లులు లేకుండా అంటే మైనింగ్ రాయల్టీ చెల్లించకుండా జీరో బిల్లులతో ఓవర్ లోడ్ వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని,టిప్పర్లు,లారీలు ఓవర్ లోడ్,ఓవర్ స్పీడ్ కాణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులే పేర్కొంటున్నారు. వాటిపై చర్యలు తీసుకోకుండా కొంతమంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తనిఖీలు చేయాల్సిన అధికారులు నిరక్ష్యంగా వ్యవరించడం,సిబ్బందికి సైతం డ్యూటీలు సరిగ్గా చేయడం లేదని సమాచారం. నిబంధనలకు తూటుపోడిచి టిప్పర్లు ఇసుక, కంకర,డస్ట్ తరలించే సమయంలో విధిగా టార్పలిన్లు ఉండాలనే నిబంధన ఉన్నది.వీటితో పాటు కర్రలు,చెత్త తరలింపు,ఇతరత్రా తరలించే కమర్షియల్ వాహనాలు,ప్రయాణికులను తరలించే వాహనాలు సైతం పరిమితికి మించి తరలించవద్దని రవాణా శాఖ యాక్ట్ చెబుతున్నది.టార్పలిన్లు లేకుండా ఇసుక,డస్ట్,కంకర తరలించే వాహనాలపై రూ.10 వేల జరినామా విధించాలని యాక్టులోనే పేర్కొన్నారు.కానీ అలా చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతు,ప్రమాదాల బారినగురవుతున్నారు. టిప్పర్లు, కమర్షియల్ వాహనాలు ఓవర్ లోడుతో వెళ్లే వాటిపై యాక్షన్ తీసుకునేందుకు ప్రభుత్వం విజిలెన్స్ బృందాలు సైతం ఏర్పాటు చేసింది.ఆ బృందం లో 20 నుంచి 30 మంది వరకు ఉంటారని,అందులో పోలీస్,మైనింగ్, ఆర్టీఏ, జీఎస్టీ, పారెస్ట్ అధికారులు సైతం ఉంటారు. తనిఖీల్లో ఎవరికి సంబంధించినవి వెలుగులోకి వస్తే ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే,రాయల్టీ ఇన్స్పెక్టర్లు మహిళలు కావడం,సివిల్ డ్రస్సులో ఉండడంతో టిప్పర్,కమర్షియల్ వాహన డ్రైవర్లు వాహనాలు ఆపడం లేదని,ఆపినా వారిపైనే బెదిరింపుకు పాల్పడు తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అయితే ఆ బృందంలో ఆర్టీఏ అధికారులు సైతం ఉండాలి.కానీ ఉన్నతాధికారుల నీలక్ష ధోరణి కారణంగా తనిఖీలు పూర్తి స్థాయిలో చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.దీంతో వాహనాలు ఓవర్ లోడుతో వెళ్తున్నాయనే విమర్శలు వసున్నాయి. మరోవైపు, రవాణా శాఖ అధికారులు కొన్ని సందర్భాల్లో ఓవర్ లోడుతో వెళ్తున్న వాహనాలపై కేసులు రాయాలంటే కూడా జంకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందికి తగిన భరోసా లేకపోవడం,కేసులు రాస్తే కూడా ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం.దీంతో సిబ్బందిలో కొంత నైరాశ్యం నెలకున్నట్లు సమాచారం.దీనికి తోడు నిబంధనలు అతిక్రమించిన క్రషర్,లారీ యజమానులపై కేసులు రాస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని,

సీజ్ చేసిన వాహనాలను సైతం వెంటనే తీసుకెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఇసుకను రవాణా శాఖ అధికారులు వాహనాలను సీజ్‌చేస్తే భద్రపరిచేందుకు సీజింగ్ యార్డులు సైతం లేకపోవడంతో కేవలం కేసులకే పరిమితం అవుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

# గోవుల సంరక్షణపై మరింత బాధ్యత

## - టిటిడి ఇఓ సింఘాల్ పరిశీలన

**తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో గోసంరక్షణకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని ఎస్వీ గోసంరక్షశాల, తిరుమలలో గోశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ స్వదేశీ గోజాతులకు చెందిన ఆవులు ఉన్నాయి. వీటి ఆరోగ్యం, సంరక్షణపై గతంలో వెల్లువెత్తిన ఆరోపణలతో టిటిడి పాలనపై అనుభవం, అధికారులతో సమన్వయం చేసుకునే తత్త్వం కలిగిన ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్ మంగళ వారం ఉదయం ఉన్నఫళంగా తిరుపతిలోని ఎస్వీ గోశాలను పరిశీలించారు.

గోశాలకు ఇన్‌ఛార్జిగా డిఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు వ్యవహరిస్తున్నారు. ఆయనకు రైతాంగం, గోమాతల సంరక్షణపై అవగాహన ఉంది. ఈ నేపథ్యంలో గోవుల ఆరోగ్యసంరక్షణ, నాణ్యమైన దాణా, ఏ సమయంలో ఎలాంటి ఆహారం అందించాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గోశాలలో సిబ్బందితో మమేకమై వారితో కలసి ఫణికుమార్‌నాయుడు గోమాతలకు సేవలందిస్తున్నారు. మంగళవారం ఇఓ సింఘాల్ పరిశీలనలో గోవుల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రతపై తనిఖీ చేశారు.

# నార్మ్‌లో ముగిసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



సిబ్బందితో ప్రతిజ్ఞచేయిస్తున్న అధికారులు

**అత్తాపూర్ నవంబరు4,ప్రభాతవార్త :** రాష్ట్ర,దేశ సమగ్రత,వాటి పారదర్శకత, ఉద్యోగలు నుంచి జవాబుదారీతనం గురించి అవగాహన కల్పించడం చాలా అవసరమని పలువురు అధికారులు పేర్కొన్నారు. మన భాగస్వామ్య బాధ్యత" అనే ముఖ్య ఉద్దేశ్యంతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను అక్టోబర్ 27 నుండి నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ప్రజా సేవకు సంబంధించిన అన్ని అంశాలలో పారదర్శకత, సమగ్రత మరియు జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం వంటిపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమం మంగళవారం నార్మ్‌లో నిర్వహించారు.మొదటగా నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ సిబ్బంది, సైంటిస్ట్‌ప్రొబేషనర్లకు (ఫోకర్స్) సమగ్రత ప్రతిజ్ఞ చేశారు.అనంతరం నైతిక పాలన పట్ల సమిష్టి నిబద్ధతను పునరుద్ఘాటించారు. విజిలెన్స్ నిర్వహణ యొక్క ముఖ్యమైన సూత్రాలు జవాబుదారీతనం, బాధ్యత, నిజాయితీ మరియు సమగ్రత, మరియు సేకరణ, ఆర్థిక మరియు పరిపాలనా ప్రక్రియలలో పర్యవేక్షణను బలోపేతం చేయడంలో వాటి ఔచిత్యాన్ని ఆయన నొక్కి చెప్పారు. ముగింపు సందర్భంగా, విజిలెన్స్ అధికారి డాక్టర్ డి. తమ్మి రాజు మాట్లాడుతూ... నివారణ నిఘాలో ఉద్యోగులు మరియు సమాజం యొక్క చురుకైన పాత్రను మరియు నిరంతర అవగాహన ప్రచారాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వివేక్ పుర్వార్,సిఏఓ (ఎస్‌జి), సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎఐపిఆర్, సిసిఎస్ నియమాలు మరియు సమయ నిర్వహణకు ప్రత్యేకించి సూచనలతో విజిలెన్స్ సూత్రాలకు కట్టుబడి ఉండవలసిన అవసరాన్ని ఆయన వివరించారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా, "విజిలెన్స్: మన భాగస్వామ్య బాధ్యత" అనే కేంద్ర ఇతివృత్తంతో అనేక చేరువ మరియు అవగాహన కార్యకలాపాలు నిర్వహించడం జరిగిందని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్ఖుడా గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు అక్టోబర్ 28న పెయింటింగ్ పోటీలో 8 మరియు 10 తరగతుల విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

# ధర్నాకు దిగిన విద్యార్థులు



ఉన్నత విద్యా మండలి ముందు బైటాయించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, విద్యార్థులు

**మెహిదీపట్నం నవంబర్ 04, ప్రభాతవార్త :** విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూడడం ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ఫీజు బకాయిల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యా మండలిని ముట్టడించారు. ఈ సందర్భంగా వేలాదిమంది విద్యార్థులు తరలి రావడంతో ఉన్నత విద్యా మండలి ప్రాంగణమంతా విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. విద్యార్థులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ఉన్నత విద్యా మండలి ముందు బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీంతో మాసబ్ ట్యాంక్ ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్ మయంగా మారాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాటాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలు విడుదల లో నిర్లక్ష్యం వహిస్తుండడంతో విద్యార్థులు కాలేజీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది అన్నారు. ఆంక్షలు ,కోతలతో ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఫీజు బకాయిలు విడుదల చేయక పోవడంతో లక్షలాది మంది విద్యార్థు భవిష్యత్తు గాలిలో దీపం గా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారకుంటే లక్షల మంది విద్యార్థులతో విద్యార్థిమార్చ్ చేపడతామని హెచ్చరించారు.

# మణికొండలో ఇంటి వివాదం - కుటుంబాల మధ్య ఘర్షణ

## కేసు నమోదు - కాల్పులు అవాస్తవం : రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న

**గచ్చిబౌలి, నవంబరు 4 ప్రభాతవార్త** ఇద్దరు రాజకీయ నాయకుల కుటుంబాల మధ్య ఏర్పడిన కుటుంబ తగాదాలు, ఆస్థి వివాదాలు పోలీస్ స్టేషన్‌లో కేసుల వరకు వెళ్లాయి. ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే కెఈ ప్రభాకర్‌కు తన అల్లుడితో ఏర్పడిన వివాదాలు సంచలనంగా మారాయి. మణికొండలోని ఓ ఇంటి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, రివాల్వార్‌తో బెదిరించారని ఇరువర్గాలు రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ వివాదంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రివాల్వార్ బెదిరింపులు పుకార్లేనని, ఇరువర్గాల పిర్యాదులపై దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. ఈ వివాదంలో కాల్పులు జరిగాయనే విషయం అవాస్తవమని పోలీసులు తెల్చిచెప్పారు. ఇంటి వివాదంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ కెఈ ప్రభాకర్ కుమార్తెను పటాన్ చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ కుమారుడు అభిషేక్ గౌడ్‌కు ఇచ్చి గత 14 సంవత్సరాల క్రితం వివాదం జరిపించారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. కాగా అభిషేక్ గౌడ్ దంపతులు ఉండేందుకు మణికొండ పంచవటి కాలనీలో ఉన్న ఇంటిని ప్రభాకర్ వారికి ఇచ్చాడు. గత కొన్ని సంవత్సరాల క్రితం అభిషేక్‌గౌడ్ దంపతులు ఈ ఇంటి నుంచి మరో చోటుకు మారారు. కాగా అభిషేక్‌గౌడ్ క్రిష్ణ దర్మ పరిషత్‌లో పనిచేస్తుండగా, సదరు ఇంటిని క్రిష్ణ ధర్మ పరిషత్ కార్యాలయం కోసం వాడుకునేందుకు ఇచ్చాడు. ఇదే సంస్థలో పనిచేస్తున్న అభిషేక్ గౌడ్ మామ వెంకటేష్‌గౌడ్, రాము యాదవ్‌లు దాదాపు 1కోటి రూపాయల వ్యయంతో ఇంటి ఇంటీరియర్ పనులు చేపట్టారు. మరోవైపు గత సంవత్సర కాలంగా అభిషేక్ గౌడ్‌కు తన భార్యతో వివాదాలు ఏర్పడి దూరంగా ఉంటున్నారు. దీంతో అల్లుడు ఉండడం కోసం కేటాయించిన మణికొండ ఇంటిని కెఈ ప్రభాకర్ తిరిగి తీసుకున్నాడు. దీంతో ఇంటీరియర్ కోసం తాము పెట్టిన డబ్బులు ఇవ్వాలంటూ వెంకటేష్‌గౌడ్, రాము యాదవ్‌లు అటు అభిషేక్‌గౌడ్‌ను, ఇటు కెఈ ప్రభాకర్‌ను అడిగినా స్పందించలేదు.

## ఈ పొడగిరి ఎవరో !



అరడుగుల బుల్లెట్టు దూసుకుపోతే ఎంత నష్టమో! చూసాం కానీ ఆరడుగుల అబ్బాయిలనూ చూసాం తాజాగా ఓ ఆరడుగుల పది అంగుళాల పొడవున్న అమ్మాయిని తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి దర్శనానికి వెళ్తున్నాపుడు భక్తజనం ఎగాదిగా చూసారు. ఆశ్చర్యపోయారు. వారికెంత మిస్మయం కలిగిందంటే కళ్లర్పకుండా చూసారంటే నమ్మాల్సిందే మరి. ఆమె ఎవరో కాదు. శ్రీలంకకు చెందిన నెట్‌బాల్ ప్లేయర్ తార్జిని శివలింగం. సంప్రదాయ వస్త్ర ధారణల్లో భక్తి భావంతో ఆమె శ్రీవారి గుడిలోకి నడచివచ్చింది. సాధారణంగా మన పూర్వీకులు కొన్ని వేల సంవత్సరాల క్రితం బాగా పొడుగ్గా ఉండేవారని విన్నాం. ఇపుడు కాస్తంత పొడుగు తగ్గినా చూస్తున్నాం.

## పిల్లలకు తాజా పాలు..



పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణ మవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలామంది..ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్లు ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవని హెచ్చరిస్తున్నారు నిపుణులు. దీని మీద కార్నెల్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలో ఎన్నో ఆశ్చర్యకర విషయాలు వెల్లడ య్యాయి. పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చిరు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విషయం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతున్నాయనీ చెబుతున్నారు.యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింత శ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధకులు. వినియోగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లనూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ముఖ్యంగా గర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణమవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలామంది.

## విశేష ఫలితాలనిచ్చే కార్తీక పూర్ణిమ



**భారతీయ హైందవ సనాతన సంప్రదాయం ప్రకారం సంవత్సరంలో ఉన్నటువంటి పన్నెండు మాసాలకు పన్నెండు ప్రత్యేకతలు చెప్పబడినాయి. అన్నింటిలోకి అతి శ్రేష్ఠమయినది కార్తీకమాసం. కార్తీక మాసం శివకేశవులకు అబేధమయినది. పరమశివుణ్ణి, శ్రీమహా విష్ణువుని యిద్దరినీ పూజించవచ్చును.**

శ్రీ మహావిష్ణువును 'కార్తీక దామెదరుడి'గా పిలుస్తారు. కార్తీకస్నానాలు అనేవి కార్తీక మాసంలో చాలా ముఖ్యమయినవి. నదీ స్నానాలు మంచిది. వీలయినంతవరకు కార్తీక మాసంలో నదీస్నానాలు చేయడానికే ప్రయత్నించాలి. కార్తీకమాసంలో నదీస్నానాలతోపాటు దానాలు, జపం, ఉపవాసాలు మంచివి. చాలా మంది పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం ప్రదోషవేళలో దేవుడికి పూజలు చేసి నక్షత్ర దర్శనం అయిన తరువాతనే భోజనాలు చేసారు. వీటినే 'కార్తీక నక్తాలు' అనే పేరుతో పిలస్తారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమిని హిందువులకు పరమ పవిత్రమైన రోజు. ఇది మహా శివరాత్రితో సమానమైన పుణ్యదినం. 'త్రిపురి పూర్ణిమ' తిపురి పూర్ణిమ' దేవ దీపావళి అని కూడా అంటారు. ఆశ్వయుజ అమావాస్య అంటే దీపావళి వెళ్ళిన మర్నాడు కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఇక ఆరోజు నుండి కార్తీకమాసం ముగిసే వరకూ ప్రతిరోజూ సాయంవేళ దీపాలు వెలిగించి ప్రారంభం చేస్తారు.ఈ మాసంలో ప్రతి దినమూ పవిత్రమైనదే. సోమవారాలు, రెండు ఏకాదశులు, శుద్ధ ద్వాదశి, పౌర్ణమి దినాలు ఒకదానికంటే మరొకటి అధిక ప్రభావవంతమైనవి. నెలరోజులు చేసే కృత్యాల ఫలితం ఒక ఎత్తు, పౌర్ణమి నాటి కృత్యాల ఫలితం మరొక ఎత్తు, అందువల్ల అనేక వ్రతాలు, పూజలు, కృత్యాలకు దైవారాధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలనీ పురాణాలు తెలిపాయి. . ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాల్లో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తారు. మహాభారత కథనాన్ని అనుసరించి కార్తికేయుడు తారకాసురుని సంహరించిన రోజే కార్తీక పౌర్ణమి. ప్రజలను నానారకాలుగా హింసిస్తున్న తారకాసురుడు ఇక లేడన్న ఆనందంతో దీపాలు వెలిగించి సంబరం చేసుకున్నారు. వెయ్యేళ్ళ రాక్షసుల పాలన అంతరించిన శుభసందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు చెప్తున్నాయి. కార్తీక పౌర్ణమి అటు శివునికి, ఇటు విష్ణు మూర్తికి కూడా ప్రియమైన రోజు. ఈరోజున దీపం వెలిగిస్తే మనం తెలిసీ తెలీక చేసే పాపాలన్నీ హరించుకుపోతాయి. కార్తీక సోమవారాల్లో, కార్తీక పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయిస్తారు. ఈ విశిష్ట దినాన సత్యనారాయణ వ్రతం చేసుకోవడం చాలా శ్రేష్ఠం. ప్రధానంగా కార్తీక పౌర్ణమి నాడు తెల్లవారు జామున సముద్రంలో లేదా నదిలో స్నానం చేయడం శుభప్రదం. నదిలో స్నానం చేసే అవకాశం లేనివారు ఉదయానే లేచి స్నాన జపాలు ముగించి ఆలయానికి వెళ్ళి దేవుని దర్శించుకుంటారు. ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక ఒత్తి చొప్పున ఏడాది మొత్తాన్ని సూచిస్తాయి ఈ ఒత్తులు. కొందరు దీపాలను అరటి దొన్నెపై ఉంచి నదిలో లేదా కొలనులో వదులుతారు. ఇంకొందరు శివాలయంలో దీపాలు వెలిగిస్తారు. ఆ వీలు లేనివారు ఇంట్లోనే దేవునిముందు లేదా తులసికోట ఎదుట దీపం వెలిగిస్తారు.కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించడమే. సకల పుణ్యనదుల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. కార్తీక పౌర్ణమినాడు చేసే దీపారాధనతో ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, పరలోకంలో ముక్తి లభిస్తాయి. కార్తీక పౌర్ణమి జైనులకు, పంజాబీలకు కూడా విశిష్ట పర్వదినం. గురునానక్ జయంతి కూడా ఈరోజే. ఈ విశేష పర్వదినాన గంగా మహోత్సవం కూడా నిర్వహిస్తారు. కార్తీక మాసంలో పదిహేనవ రోజున పౌర్ణమి వస్తుంది. అందువల్ల కార్తీక పౌర్ణమి అంటారు ఆ రోజున దీపావళి రోజున కేదారేశ్వర నోములు నోచుకోని వారు కార్తీక పౌర్ణమి రోజున నోముకుంటారు.కార్తిక పౌర్ణమి రోజునాడు మహిళలందరూ ఆలయాలకు వెళ్లి వత్తులు వెలిగిస్తారు. పౌర్ణమినాడు కృత్తికా నక్షత్రంలో చంద్రుడు ఉంటాడు. కార్తీకమాసంలో వచ్చేటటువంటి పౌర్ణమి అంటారు



**- పర్వతాల శ్రీనివాస్**

## సృష్టి రక్షణ

పురాణేతిహాసాల్లోవివిధ సందర్భాల్లో సప్తమాతృకల ప్రస్తావన కనిపిస్తుంది. ఆ విశ్వ శక్తిని నిర్వహణ శక్తిగా అభివర్ణించాయి. సృష్టి సంరక్షణ కోసం అవతరించిన దేవతా శక్తులే సప్తమాతృకలు. శాక్తేయులు అమ్మవారిని శాంతమూర్తిగానూ, ఉగ్రమూర్తిగానూ కూడా ఉపాసిస్తారు. ఆ పద్ధతిలో సప్తమాతృకా ఉపాసన విధానం ఒకటి. వర గర్వంతో లోకకంటకులుగా మారిన శుంభనిశుంభ, ధూమ్రలోచన, రక్తబీజ, మహిషాసురుల సేనాల్ని నిర్మూలించడానికి అమ్మవారు బ్రహ్మాది దేవతల్లోని శక్తులను ధరించినట్లు దేవీ భాగవతం, మార్కండేయ, వరాహ, అగ్ని పురాణాలు ఉన్నాయి. బ్రహ్మ నుంచి బ్రాహ్మి, విష్ణుమూర్తి నుంచి వైష్ణవి, పరమశివుడి నుంచి మహేశ్వరి, యముడి నుంచి కౌమారి, ఇంద్రుడి నుంచి ఇంద్రాణి, ఆదిశక్తి నుంచి చాముండి, యజ్ఞ వరాహమూర్తి నుంచి వారాహిగా అవతరించిన జగన్మాత దుష్ట శిక్షణ, శిష్టరక్షణ గావించింది. శివపురాణంలోనూ సప్తమాతృకల ప్రస్తావన ఉంది. ఈ మాతృకలకు శివపార్వతులు పూజార్హతను ప్రసాదించి, వీరిని అర్చించిన వారికి అభీష్టసిద్ధి కలుగుతుందని వరమిచ్చారు.



## మేలు చేసే క్యారెట్

రోజూ ఒక క్యారెట్ తింటే కంటిచూపు బాగుంటుందని చాలాసార్లు విని ఉంటాం. కానీ ఆ మాటను పెద్దగా పట్టించుకోక కళ్లజోళ్లు కొనితెచ్చుకుంటాం. క్యారెట్ కళ్లకే కాదు మరెన్నో విధాల మేలు చేస్తుంది..

✦ క్యారెట్లో ప్రొటీన్లు, పీచు, ఎ, బి1, బి6, సి, కె విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం విస్తారంగా ఉంటాయి.

✦ ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నీ మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

✦ వీటితో ఎముకలు, దంతాలకు పటుత్వం వస్తుంది.

✦ తరచూ క్యారెట్లు తినేవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. ✦ చర్మం పొడిబారదు. ముఖానికి మెరుపునిస్తాయి. ✦ జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. సమయానికి ఆకలి వేస్తుంది. మలబద్ధక సమస్య రాదు. ✦ వీటిలోని విటమిన్‌ఎ కంటిచూపును మెరుగుపరుస్తుంది. ✦ ఊబకాయం రాదు.బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం.

✦ మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఇవి రక్తపోటును క్రమబద్ధం చేస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.



✦ క్యారెట్లతో కూర, పచ్చడి, హల్వా, జ్యూస్ చేయొచ్చు, ఫ్రైడైస్, సాంబార్లకు అదనపు రుచి తెస్తాయి. సలాడ్, కేక్, కుకీస్, ఐస్క్రీమ్, చాక్లెట్లు, విఠాయిల్లో క్యారెట్లను ఉపయోగిస్తారు. వీటిని ఉడికించి లేదా పచ్చివి కూడా తినొచ్చు.

## ఆరోగ్యానికి ఆరు సూత్రాలు

**ఇంటివంట అంటే ఎవరికి నచ్చకుండా ఉంటుంది... ఐతే, రుచికి దాసోహమై ఒక్కోసారి అదుపు లేకుండా తినేస్తూ ఉంటాం. ఫలితంగా బరువు పెరగడంతోపాటు ఇతర సమస్యలూ తలెత్తుతాయి. మరి ఇంట్లో ఆహారాన్ని పరిమితంగా తింటూ ఆరోగ్యంగా ఉండాలంటే...**

ఇవి పాటించాల్సిందే! పాటిస్తే ఎన్నో ప్రయోజనాలు ఆరోగ్యానికి ఆరు సూత్రాలు.. పాటిస్తే ఎన్నో ప్రయోజనాలు



ఆహారంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండేలా చూసుకోండి. ఇవి బరువు పెరుగుదలకు కారణమవుతాయి. బ్రౌన్‌రైస్, బ్రౌన్ బ్రెడ్‌లకు ప్రాధాన్యం ఇవ్వండి. వీటిలోని సంక్లిష్ట పిండిపదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జంక్‌ఫుడ్ అంటే వెంటనే నోరూరుతుంది. కానీ వాటితో ఆరోగ్య సమస్యలూ వస్తాయి. బదులుగా తాజా కాయగూరలు, పండ్లు, ఆకుకూరలకు ప్రాధాన్యం ఇస్తే సరి. గుడ్డు, పాలు, పెరుగు తీసుకున్నా మంచిదే.నీళ్ల తాగడంవల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. రోజుకి కనీసం ఎనిమిది గ్లాసుల నీళ్ల తాగడం మర్చిపోకండి. తినేటప్పుడు టీవీ, సెల్‌ఫోన్ చూడొద్దు. తిండిపైనే దృష్టి పెట్టండి. రంగు, రుచి, వాసనను ఆస్వాదిస్తూ తింటేనే అది వంటపడుతుంది. నిద్ర అలవాట్లు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం అలవర్చుకోవాలి. అలాగే నిద్రకు గంట ముందు ఫోన్‌కు దూరంగా ఉంటే మంచిది.

## రవితేజ, ఆషికా ఫ్యామిలీ డ్రామా





మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో హోల్సమ్ ఎంటర్‌టైనర్ ఆర్76 చేస్తున్నారు. ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను బిగ్ కాన్వాస్‌పై స్టైలిష్‌గా రూపొందిస్తున్నారు. ఈ రోజు నుంచి హీరో రవితేజ, హీరోయిన్ ఆషికా రంగనాథ్ పై మూవీ టీం ఒక పాటను చిత్రీకరిస్తోంది. ఈ పాట కోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్‌మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న ఈ పాట అదిరిపోయే డ్యాన్స్ నంబర్‌గా ప్రేక్షకులను అలరించనుంది.ఎలక్ట్రిక్ ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూస్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ప్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సెసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ :ప్రసాద్‌మూరెళ్ళ, నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్‌ప్రసాద్ :ఎడిటర్, ఏఎస్ ప్రకాష్ : ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: రవితేజ, ఆషికా రంగనాథ్.సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్‌తిరుమలనిర్మాత: సుధాకర్‌చెరుకూరి బ్యానర్: ఎస్‌ఎల్‌వి సినిమాస్ డిఓపి: ప్రసాద్ మూరెళ్లసంగీతం: భీమ్స్ సిసిరోలియోఎడిటర్: శ్రీకర్‌ప్రసాద్‌ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్‌ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి పీఆర్వో: వంశీశేఖర్

## 'ఫీనిక్స్' నవంబర్7న రిలీజ్



తప్పకుండా మీ అందరికీ కనెక్ట్ అవుతుంది: ప్రీరిలీజ్ ఈవెంట్ లో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతిమక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచమైన చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించారు. ఏకే బ్రేవ్‌మ్యాన్ పిక్చర్స్ బ్యానర్ పై రాజలక్ష్మి 'అన్ల' అరసు ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే తమిళ్ లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ చిత్రం తెలుగులో నవంబర్ 7 రిలీజ్ కానుంది. ఈ సందర్భం మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ,అందరికి నమస్కారం. ఈ వేడుకకు వచ్చిన గోపీచంద్‌కి థాంక్యూ. ఆయన చెప్పిన మాటలు మాకు ఎంతో ఆనందాన్నిచ్చాయి. ఇది మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం. ఒక తండ్రిగా నేను చాలా ఆనందంగా ఉన్నాను.

# తెర

## పవర్ ఫుల్ కంటెంట్ సినిమా 'కృష్ణ లీల': డైరెక్టర్ దేవన్



యంగ్ హీరో దేవన్ హీరోగా, ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ 'కృష్ణ లీల'.'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్నజి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా, టీజర్, ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. 'కృష్ణ లీల' నవంబర్ 7న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో, డైరెక్టర్ దేవన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'కృష్ణలీల'సినిమా ఎలా మొదలైంది?**

నేను సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసేవాడిని. రెండు సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అదే తరహా పాత్రలు రావడంతో కొత్త క్యారెక్టర్స్ కోసం ఎదురు చూస్తున్నప్పుడు నిర్మాత జోష్న, రైటర్ అనిల్ ఈ కథ చెప్పారు. కథ విని ఒక వారం రోజుల తర్వాత ఈ జనరేషన్‌కి ఈ కథని ఎలా చెప్పొచ్చో కొన్ని మార్పులు చేసి ఒక కొత్త రకం స్క్రీన్ ప్లేతో చెప్పాను. అది వారికి చాలా నచ్చింది.ఎవరు డైరెక్ట్ చేస్తారు అన్నప్పుడు నేనే డైరెక్ట్ చేస్తానని చెప్పాను.

**కృష్ణలీలా ఎలా ఉండబోతుంది?**

'కృష్ణ లీల' తిరిగి వచ్చిన కాలం .. లీల అంటే ఆట. ఆయన ఒక ప్రేమ కథని ఎలా ఆడారు? ఎలా ఆడించారనేది కృష్ణ లీల. మనిషి కాలాన్ని వెనక్కి తిరిగి తీసుకురాలేడు. .

**క్రిష్ణ తత్వం చాలా పెద్ద సబ్జెక్టు కదా.. జనాలకు అర్థమయ్యేలా ఎలా చెప్పారు?**

కృష్ణ తత్వం అనేది ఒక మహా సముద్రం. భగవద్గీతలో చెప్పే వాక్యాలు ఈ కథకి చాలా అద్భుతంగా కనెక్ట్ అయ్యాయి. నేను గంగాధర శాస్త్రి ప్రవచనాలు ఎక్కువగా వినేవాడి. ఆయనకి కథ చెప్పినప్పుడు నాకున్న చాలా సందేహాల్ని ఆయన నివృత్తి చేశారు. ఈ కథ విషయంలో హెల్ప్ చేశారు.

**ధన్య బాలకృష్ణ గురించి?**

ఈ కథ చెప్పినప్పుడు అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. నేను చెప్పిన కథను చాలా అద్భుతంగా పట్టుకున్నారు. చాలా మంచి పెర్ఫార్మర్. పృథ్వి, తులసి ఇలా చాలా మంచి నటులు ఉన్నారు. వాళ్ళ ఎక్స్పీరియన్స్ మాకు ఎంతగానో ఉపయోగపడింది.

**ఆడియన్స్‌కి ఏం చెప్తారు?**

ప్రేమ అనేది చాలా గొప్ప ఎమోషన్. అది భార్యాభర్తలు, తండ్రి కొడుకులు, మనకి మన ఫ్రెండ్స్‌కి, మనకి జంతువులకు మధ్య ఉన్నది ఏదైనా కూడా ప్రేమే. ఈ సినిమా చూసిన తర్వాత మన ఫ్రెండ్,మనతో పరిచయమున్న వ్యక్తులు అందరి పట్ల మనకి ఒక గొప్ప అనుబంధాన్ని ఫీల్ అవుతాము.

**అవుట్ పుట్ చూసినప్పుడు ఏమనిపించింది?**

-మేమేదైతే అనుకున్నామో స్క్రీన్ మీదకి అద్భుతంగా వచ్చింది. విఎఫ్ఎక్స్ టీం కూడా నాకు చాలా సపోర్ట్ చేశారు.

**మీరు డైరెక్టర్, హీరో. ఎందులో కొనసాగుతారు?**

-అది కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికైతే ఈ సినిమాని ఆడియన్స్‌కి దగ్గరికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ఉన్నాను.ఆల్ ది బెస్ట్ థాంక్ యూ.

## చలన చిత్ర అవార్డులపై రాజీనా?



55వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రకటన సందర్భంగా నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బెస్ట్ యాక్టర్ అవార్డు మమ్ముట్టికి లభించగా, జాతీయ అవార్డులు ఇప్పుడు రాజీ పడ్డాయి. మమ్ముట్టి లాంటి గొప్ప నటుడికి అలాంటి అవార్డులు అవసరం లేదు" అని తన అద్భుత నటనతోనే కాకుండా, వివాదాస్పద వ్యాఖ్యలతో కూడా తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రకటన సందర్భంగా కూడా ఆయన అదే ధోరణి ప్రదర్శించారు.

## 'కె-ర్యాంప్' విజయం ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది : కిరణ్ అబ్బవరం



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'కె ర్యాంప్' మూవీ హౌస్ ఫుల్ షోస్‌తో పెరుగుతున్న కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయం దిశగా పరుగులు తీస్తోంది. ఈ సినిమా సక్సెస్ ఫుల్ గా థర్డ్ వీక్ ప్రదర్శితమవుతూ 40 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించి దీపావళి బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచింది. 'కె ర్యాంప్' సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించారు. జైన్స్‌నాని దర్శకత్వం వహించారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ నేపథ్యంలో 'కె ర్యాంప్'ర్యాంపేజ్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్లగణేష్ అతిథులుగా హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా మూవీ టీమ్‌కు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ 'కె ర్యాంప్'సక్సెస్ సెలబ్రేషన్స్ లో పాల్గొనేందుకు వచ్చిన పెద్దలు అందరికీ ధన్యవాదాలు. మా సినిమా రోజు రోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. మా టీమ్ లో ఎవరూ తక్కువ ఎవరు ఎక్కువ కాదు, టీమ్ ఎఫర్ట్ పెట్టి కష్టపడ్డాం. మా కష్టాన్ని గుర్తించి మా సినిమాను ప్రేక్షకులు హిట్ చేయడం హ్యాపీగా ఉంది అని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ యంగ్ అండ్ డైనమిక్ టీమ్ 'కె ర్యాంప్' సినిమాను రూపొందించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను నేను కోరేది ఒక్కటే, చిన్న చిత్రాలను ఆదరించండి. ఇలాంటి టీమ్ కు ప్రేక్షకుల ఆదరణ, ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ మా అందరికీ హ్యాపీ ఈవెనింగ్ ఇది. 'కె ర్యాంప్' సక్సెస్ సెలబ్రేషన్స్ కు మా డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, టీమ్ అందరూ వచ్చారు. మా సినిమా విజయాన్ని మా కంటే మీరంతా ఎక్కువ ఎంజాయ్ చేస్తున్నారు. మా టీమ్ అంతా ఒక ఫ్యామిలీలా మారిపోయాం. 'కె ర్యాంప్' సినిమా మనకు అన్నీ నేర్పింది. కె ర్యాంప్ సినిమా మాత్రం ఎప్పటికీ ప్రత్యేకంగా మిగిలిపోతుంది. ఈ సినిమా ఎంత వసూళు చేసింది అనేదాని కంటే థియేటర్స్‌లో ఫ్యామిలీ ఆడియెన్స్ అంతా కలిసి సినిమా చూస్తూ నవ్వుకోవడం హీరోగా ఎంతో సంతృప్తిని ఇచ్చింది. పండక్కి మీ అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే సినిమా చేశాం. ఆ నమ్మకం నిజం కావడం హ్యాపీగా ఉంది. మీ వాడిగా భావించి ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. గతేడాది, ఈ ఏడాది దీపావళికి హిట్ ఇచ్చాం. మీ సపోర్ట్ ఉంటే వచ్చే దీపావళికి కూడా హిట్ సినిమా ఇస్తాను. అన్నారు.

## మహిళల వరల్డ్ కప్ ట్రోఫీతో..

# టాప్‌కు బ్రాండ్ వాల్యూ

### 20 నుండి 100% పెరిగిన ఫీజులు.. కొత్త తారలుగా ఉమెన్ ఇన్ బ్లూ టీమ్



**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆటతో పాటు, ఆర్థికంగా కూడా ఈ విజయం ఒక బలమైన పునాదిని వేసింది. చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు ప్రపంచ కప్ విజయం కేవలం ట్రోఫీని మాత్రమే అందించలేదు, వారి బ్రాండ్ విలువను కూడా అమాంతం పెంచేసింది. దేశవ్యాప్తంగా అపారమైన అభిమానం, ప్రశంసలు దక్కించుకున్న ఈ ఉమెన్ ఇన్ బ్లూ టీమ్ సభ్యులు ఇప్పుడు అడ్వర్టైజింగ్ ప్రపంచంలో కొత్త తారలుగా వెలుగుతున్నారు. ఈ గెలుపు తర్వాత భారత క్రీడాకారిణుల బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజులు 25 నుంచి 100 వరకు పెరిగాయి. స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ, షఫాలీ వర్మ వంటి స్టార్ ఆటగాళ్ల కోసం బ్రాండ్లు క్యూ కడుతున్నాయి. ప్రధానంగా జెమీమా రోడ్రిగ్స్ ఫీజు రెట్టింపు (100 శాతం పెరుగుదల) అయింది. ఈ బ్రాండ్ విలువ పెరుగుదలలో, సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన జెమీమా ముందంజలో ఉంది. సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే బ్రాండ్‌ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. జెమీమా ఇప్పుడు ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేయనుంది. ఇప్పటికే రెడ్ బుల్, బోట్, నైక్ వంటి బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉన్న జెమీమా కోసం 10 నుండి 12 విభిన్న కేటగిరీలలోని బ్రాండ్‌లతో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇతర ప్లేయర్ల పరిస్థితి చూస్తే ఇప్పటికే 20కి పైగా బ్రాండ్లను ఎండార్స్ చేస్తున్న స్టార్ ప్లేయర్‌లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ ఎండార్స్‌మెంట్ ఫీజులు కూడా 30 నుండి 50 శాతం వరకు పెరుగుదల చోటు చేసుకుంది. వీరి ప్రస్తుత ఫీజు రూ.60 నుండి రూ.75 లక్షల వరకు ఉంది. ఇక యువ తారలైన షఫాలీ వర్మ, దీప్తి శర్మ కూడా బ్రాండ్‌ల నుంచి ఎక్కువ ఆసక్తి వ్యక్తమవుతోంది. వీరి ఫీజులు కూడా ఒక్కో బ్రాండ్‌కు రూ.40 నుండి రూ. 50 లక్షల వరకు పెరిగే ఛాన్స్ ఉంది.

## మే బ్యాంక్ ఛాంపియన్‌షిప్..

# ప్లేఆఫ్‌లోకి అదితి



**న్యూఢిల్లీ:** మేబ్యాంక్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజున భారత్ ప్లేయర్ అదితి అశోక్ ఈవెన్ పార్ 72 రౌండ్ సాధించి టి27ను ముగించింది. మూడు బర్డీలు మరియు మూడు బోగీలతో,3వరౌండ్ తర్వాత టి12స్థానంలో నిలిచిన అదితి, 70-70-66-72 రౌండ్లతో నాలుగు రోజుల పాటు 10 అండర్ పార్ స్కోరుతో ఈ వారాన్ని ముగించింది. ఏడు అండర్ 65తో ఉన్న మియు యమషిత హై జిన్ చోయ్ (73) మరియు హన్నా గ్రీన్ (68)తో కలిసి ప్లే ఆఫ్‌లోకి ప్రవేశించింది. త్రీ వే ప్లేఆఫ్ కోసం వారందరూ 18అండర్‌తో టై అయ్యారు.మొదటి రౌండ్ నుంచి నాల్గవ రోజు ఇబ్బంది పడిన హై జిన్ చోయ్ ఒక ఓవర్ 73 పరుగులు చేసి ఫీల్డ్‌ను నడిపించగా, ఆ తర్వాత ఐదు స్ట్రోక్‌ల వెనుకబడి ఉన్న హన్నా గ్రీన్, ఫోర్‌అండర్ 68 పరుగులు చేసి ఆమెను అధిగమించింది. 18వ హోల్‌ను మొదటి ప్లే ఆఫ్ హోల్‌గా సెట్ చేయడంతో, జపాన్‌కు చెందిన యమషిత బర్డీ చేసిన తర్వాత టైటిల్‌ను దక్కించుకుంది, హన్నా గ్రీన్ మరియు హై జిన్ చోయ్ మాత్రమే సమానం చేయగలిగారు. ఇది టైటిల్ లేకుండా చోయ్ కెరీర్‌లో టాప్ 10లో 29వ స్థానాన్ని సంపాదించడాన్ని సూచిస్తుంది. నాల్గవ స్థానంలో నిలిచిన ఐదుగురు ఆటగాళ్లలో ప్రపంచ నంబర్ వన్ జీనో తితికుల్, సీ యంగ్ కిమ్, ఐ ఇవై, ఎ లిమ్ కిమ్ మరియు యాన్ లియు ఉన్నారు.




## వన్డే వరల్డ్ నంబర్ 1గా

# వోల్వార్ట్

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచ కప్‌ను తొలిసారి సాధించి సంబరాల్లో ఉన్న భారత్ మహిళా టీం వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటి వరకూ ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న స్మృతి తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. ఇదే సమయంలో భారత్ చేతిలో ఓటమి పాలైన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి ప్రస్థానం ముగిసింది. టోర్నమెంట్ అంతటా వోల్వార్ట్ సంచలనాత్మక ఫామ్‌తో సెమీఫైనల్, ఫైనల్‌లో వరుసగా సెంచరీలు చేయడం ద్వారా ఆమెను ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేర్చింది. 25 ఏళ్ల ఆమె అద్భుతమైన 571 పరుగులు, కెరీర్‌లో అత్యధిక రేటింగ్ 814 సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఇక టోర్నమెంట్ అంతటా నంబర్ 1 లో నిలిచి, టీం ఆఫ్ ది టోర్నమెంట్‌లో కూడా స్థానం సంపాదించిన స్మృతి ఇప్పుడు 811 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో దిగజారింది. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై జెమీమా రోడ్రిగ్స్ చేసిన మ్యాచ్ విన్నింగ్ సెంచరీ ఆమె కెరీర్‌లో తొలిసారిగా టాప్ 10లోకి ప్రవేశించడానికి దారితీసింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన మారిజాన్ కాప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై 20 రన్స్‌కు 5 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచ కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో సెమీఫైనల్ మరియు ఫైనల్‌లో 7 వికెట్లు, 82 పరుగులతో సహకారం అందించడం ద్వారా నాల్గవ (392) స్థానానికి చేరుకుంది.

# నారాయణన్ 126వ రౌండ్‌కు అర్హత

### చెస్ వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా స్టీవెన్ ఓటమి



**న్యూఢిల్లీ:** చెస్ ప్రపంచ కప్ 2025 టైబ్రేక్ గేమ్ మొదటి సెట్‌లో దక్షిణాఫ్రికాకు చెందిన స్టీవెన్ రోజాస్‌ను ఓడించి, 128వ రౌండ్‌కు అర్హత సాధించిన మొదటి ఆటగాడిగా భారత ఎస్‌ఎల్ నారాయణన్ నిలిచాడు. మొదటి గేమ్‌లో నల్లజాతి వ్యక్తిగా సిసిలియన్ డిఫెన్స్‌ను ఆడి, వేగవంతమైన వెర్షన్‌లో నారాయణన్ పక్కా ప్రణాళికతో తెల్లజాతి డిఫెన్స్‌లను ఢీకొట్టాడు. అసమాన ఘర్షణతో తెల్లజాతి వ్యక్తితో కేవలం 22 కదలికలలో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. టైబ్రేకర్ యొక్క మొదటి సెట్‌లో తన రెండు గేమ్‌లను గెలిచి ముందుకు సాగడంతో దీప్తయాన్ ఘోష్ చైనాకుచెందిన పెంగ్ జియోంగ్లియన్ కంటే మెరుగ్గా నిరూపించుకున్నాడు. కోల్‌కతాకు చెందిన ఈ భారత ఆటగాడు టైబ్రేకర్ యొక్క మొదటి గేమ్‌లో అత్యున్నత స్థాయిలో వైట్‌తో గెలిచాడు. తరువాత తన ప్రత్యర్థి చేసిన తప్పు ప్రదర్శనను సద్వినియోగం చేసుకుని అతనిపై ఆధిపత్యం సంపాదించాడు. మొదటి గేమ్‌లో నారాయణన్ తన పెంపుడు ఓపెనింగ్‌ను పునరావృతం చేసి సరైన స్పందనను పొందకపోగా, మిడిల్ గేమ్ సంక్లిష్టతలు ఎదుర్కొని దక్షిణాఫ్రికా ఆటగాడిని ఎదుర్కొన్నాడు. మొదటి గేమ్ పెద్దగా దెబ్బ లేకుండా ముగిసింది కానీ రెండవ గేమ్‌లో నారాయణన్ మొదటినుండే దాడితో తన సామర్థ్యాన్ని, ఆధిపత్యాన్ని సాధించాడు.

# రంజీ ట్రోఫీ: చివరి రోజు డ్రా

### ముంబయిపై రాజస్థాన్ ఆధిక్యం

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ 2025-26లో భాగంగా చివరి రోజు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ముంబైపై రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో ఉంది. యశస్వి జైస్వాల్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆపివేసిన చోటు నుంచి పుంజుకుని, రెండవ ఇన్నింగ్స్‌లో 156 (174 బాల్స్, 18 ఫోర్లు, ఒక సిక్స్) పరుగులు చేశాడు. కానీ రాజస్థాన్‌తో జరిగిన గ్రూప్ డి మ్యాచ్ డ్రాగా ముగియడంతో ముంబై ఒక్క పాయింట్‌తో సంతృప్తి చెందాల్సి వచ్చింది. రాజస్థాన్ బౌలర్లు మంగళవారం ఈ జోరును ఎదుర్కొనేందుకు శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ, జైస్వాల్ మరియు ముషీర్ ఖాన్ (63, 115 బాల్స్, 9 ఫోర్లు) ఓపెనింగ్ భాగస్వామ్యానికి 149 పరుగులు జోడించారు. జైస్వాల్ బౌండరీలు బాదగా, ముషీర్ సమయం తీసుకుని చివరికి అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఈ భాగస్వామ్యానికి అడ్డుకట్ట వేసేందుకు సీమర్ అనికేత్ మొదట ముషీర్‌ను కునాల్ సింగ్ రాథోడ్ క్యాచ్‌తో వెనక్కి నెట్టాడు. అయితే, జైస్వాల్ అజింక్య రహానేతో రాజస్థాన్ ఫాస్ట్ బౌలర్లను సులభంగా ఎదుర్కొన్నాడు. కానీ, అతను కూడా అజయ్ సింగ్ వేసిన బంతిని రాథోడ్ స్టంప్ చేయడంతో ఔట్ అయ్యాడు. యశస్వి పై 150 పరుగులు సాధించడంతో డ్రాగా ముగిసే అవకాశం తప్పనిసరి ఏర్పడింది. టీ విరామానికి కొద్దిసేపటి ముందు రోజు ఆటను రద్దు చేయడానికి జట్లు పరస్పరం అంగీకరించాయి. దీంతో ముంబై 3 వికెట్లకు 269 పరుగులు చేసింది.



నాణ్యం

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు



**ముంబయి, నవంబరు 4:** బంగారం ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలపడటం వంటి పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పాటు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడి బంగారం ధరల పతనానికి కారణం అయింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,19,916గా నమోదైంది. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.836 (0.69 శాతం) తగ్గి 10 గ్రాములకు రూ.1,20,573 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగి 99.95 వద్ద స్థిరంగా కొనసాగింది. బలమైన డాలర్, అమెరికా చైనా మధ్య తగ్గుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలు బంగారం ఆకర్షణను దెబ్బతీశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోడీ మాట్లాడుతూ, డాలర్ మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడంతో బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక ఆర్థిక గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, డిసెంబర్ పాలసీ సమావేశం ముందు ఫెడ్ అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని వివరించారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన చైనా, కొన్ని గోల్డ్ రిటైలర్లకు చాలాకాలంగా ఇస్తున్న పన్ను మినహాయింపు విధానాన్ని రద్దు చేసింది.

ఇది అక్కడి బంగారం కొనుగోళ్ల జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. అయితే, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2025 మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోళ్లను త్రైమాసిక ప్రాతిపదికన 28శాతం పెంచాయి. నవంబర్ ఆరంభంలో బలహీనపడిన రూపాయి, కామెక్స్‌లో బంగారం 4,010 డాలర్ల పైన ఉండటం వంటివి పసిడికి మద్దతునిచ్చాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా గణాంకాలు విడుదల కాకపోవడంతో ఇన్వెస్టర్లు ఈ వారం వెలువడనున్న మాన్యుఫ్యాక్చరింగ్, నాన్ మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ గణాంకాల కోసం ఎదురుచూసారని ఎల్‌కెపి సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అమెరికాచైనా, అమెరికా భారత్ వాణిజ్య చర్చల్లో చోటుచేసుకునే పరిణామాలు బంగారం ధరల్లో తీవ్ర ఒడుదొడుకులకు కారణమవుతాయని, ధరలు రూ.1,18,000 నుంచి రూ.1,24,000 మధ్య కదలాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# నికరలాభాల్లో ఎస్‌బిఐ దూకుడు!

### రూ.18,331 కోట్ల లాభం ప్రకటించిన బ్యాంకింగ్ దిగ్గజం



**ముంబయి, నవంబరు 4:** ప్రభుత్వ రంగంలోని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాల్లో భళా అనిపించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూలై సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.20,160 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎస్‌బిఐ మొత్తం రూ.18,331 కోట్ల నికర లాభాన్ని అందుకగా ఈ ఏడాదిలో అది 10శాతం వృద్ధి నమోదుచేసింది. రూ.20 వేల కోట్లు దాటేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి గానూ స్టేట్ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.1,29,141 కోట్ల నుంచి రూ.1,34,979 కోట్లకు పెరిగింది. ఇక వడ్డీ ద్వారా బ్యాంకుకు వచ్చిన ఆదాయం రూ.1,13,871 కోట్ల నుంచి రూ.1,19,654 కోట్లకు చేరింది. ఈ బ్యాంకు ఆస్తుల నాణ్యత సైతం మెరుగుపడినట్లు తెలిపింది. 2025, సెప్టెంబర్ 30 నాటికి ఎస్‌బిఐలో స్థూల నిరర్థక ఆస్తులు (జిపిఎ)లు గతేడాదితో పోలిస్తే 2.13 శాతం నుంచి 1.73 శాతానికి దిగివచ్చాయి. ఇక నికర మొండి బాకీల విలువ 0.53 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఏకీకృత ప్రాతిపదికన ఫలితాలు చూసుకుంటే ఎస్‌బిఐ గ్రూప్ 7శాతం వృద్ధి నమోదు చేసింది. దీంతో రూ.21,137 కోట్ల నికర లాభాన్ని ఎస్‌బీఐ గ్రూప్ నమోదు చేసింది. గతఏడాది ఇదే సమయంలో ఈ గ్రూప్ మొత్తం రూ.19,743 కోట్ల నికర లాభాన్ని అందుకుంది. అలాగే కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ.1.63 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు చేరుకుంది. రాణించిన షేరు త్రైమాసిక ఫలితాల వేళ ఎస్‌బిఐ షేరు రాణించింది. క్రితం రోజు సరికొత్త గరిష్ఠాలను తాకింది. ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఇంట్రాడేలో చూసుకుంటే ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కోలుకుంది. మార్కెట్ అంచనాలను ఎస్‌బీఐ అందుకుంటుందన్న వార్తల నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్లు కొనేందుకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. దీంతో మరోసారి ఆల్ టైమ్ హై స్థాయి రూ. 959.30ని తాకింది. మార్కెట్లు ముగిసే నాటికి 0.52 శాతం లాభంతో రూ.954.60 వద్ద స్థిరపడింది.

# హిందూజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ హిందూజా కన్నుమూత



**లండన్, నవంబరు 4:** హిందూజా గ్రూపు ఛైర్మన్‌గోపిచంద్ పి హుందూజా లండన్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసారు. 85 ఏళ్ల హిందూజా పారిశ్రామిక రంగంలో జిపిగా పేరుపొందారు. గడచిన కొన్ని వారాలుగా ఆయన అస్వస్థతతో ఉన్నారు. హిందూజా కుటుంబంలో రెండోతరం ప్రముఖునిగా పారిశ్రామిక వేత్తగా ఆయన పేరుపొందారు. ఆయన సోదరుడు శ్రీచంద్ హిందూజా కన్నుమూసిన తర్వాత గోపీచంద్ హిందూజా గ్రూపు ఛైర్మన్‌గా బాధ్యతలుచేపట్టారు. 2023నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. కంపెనీ సమాచారం ప్రకారం ముంబయిలోని జైహింద్ కళాశాలనుంచి 1959లో ఆయన పట్టభద్రుడయ్యారు. వెస్ట్‌మినిస్టర్ వర్సిటీనుంచి లాలో డాక్టరేట్‌పొందారు. అలాగే ఆర్థిక శాస్త్రంలో లండన్‌లోని రిచ్‌మండ్ కళాశాలనుంచి డాక్టరేట్ పొందారు. కుటుంబ వ్యాపారంలో గోపిచంద్ హిందూజా1950లోనే చేరారు.భారత్ మధ్యప్రాచ్య ట్రేడింగ్ సంస్థగా నిలిచిన హిందూజా అనతికాలంలోనే గ్లోబల్‌గ్రూపుగా అవతరించింది. ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఆర్థికసేవలు, ఐటిరంగం, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, పవర్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో బహుముఖంగా విస్తరించడంలో కీలకంగా వ్యవహరించింది. అశోక్ లేల్యాండ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెక్ట్స్‌డిజిటల్‌వంటివి ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2లక్షలమంది పనిచేస్తున్నారు. 1979లోనే ఇరాన్‌నుంచి లండన్‌కు కేంద్ర కార్యాలయాన్ని తరలించింది.

# భారత్‌కు అప్పగింతపై చోక్సీ సుప్రీంకోర్టులో అప్పీలు!




**న్యూఢిల్లీ, నవంబరు 4:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణంలో ప్రధాన నిందితుడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ భారత్‌కు తనను అప్పగించే ప్రక్రియను నిలిపివేసేందుకు మరో న్యాయ పోరాటానికి దిగాడు. తనను భారత్‌కు అప్పగించ వచ్చంటూ బెల్జియంలోని ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అక్కడి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు అక్టోబర్ 30న పిటిషన్ దాఖలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. చోక్సీ అప్పీల్ కారణంగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడేంత వరకు అతడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియ నిలిచిపోనుంది. ఈ విషయాన్ని ఆంట్వెర్ప్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కెన్ విట్వాస్ తెలిపారు. రూ. 13,000 కోట్ల పీఎన్‌బీ స్కామ్‌లో చోక్సీపాత్ర రూ. 6,400కోట్లుగా ఉందని సిబిఐ ఆరోపించింది. ఈ కుంభకోణం బయటపడటానికి కొద్ది రోజుల ముందు, 2018 జనవరిలో చోక్సీ దేశం విడిచిపారిపోయి ఆంటిగ్వా అండ్ బార్బుడాలో తలదాచుకున్నాడు. ఇటీవల అనారోగ్య చికిత్స నిమిత్తం బెల్జియంవెళ్లగా భారత ఏజెన్సీలు గుర్తించాయి. ముంబైలోని ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన అరెస్ట్ వారెంట్ల ఆధారంగా, 2024 ఆగస్టు 27న భారత్ చోక్సీని అప్పగించాలని బెల్జియంను కోరింది. ఈ అభ్యర్థనను విచారించిన ఆంట్వెర్ప్ జిల్లాకోర్టు, 2024 నవంబరు 29న చోక్సీని భారత్‌కు అప్పగించవచ్చని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ చోక్సీ ఆంట్వెర్ప్ అప్పీల్ కోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు వెళ్తే తనకు ప్రాణహాని ఉందని, సరైన న్యాయం జరగదని, హింసకు గురిచేసే అవకాశంఉందని వాదించాడు. అయితే, చోక్సీ వాదనలను అప్పీల్ కోర్టు అక్టోబర్ 17న తోసిపుచ్చింది. అతని వాదనలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేసింది. భారత్‌లో చోక్సీ భద్రత, జైలు సౌకర్యాలు, వైద్య అవసరాలు, మానవ హక్కుల పరిరక్షణపై భారత ప్రభుత్వం బెల్జియంకు పలు హామీలు ఇచ్చింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!

### ఐటి, మెటల్ రంగాల్లో పెరిగిన అమ్మకాల ఒత్తిడి



**ముంబయి, నవంబరు 4:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ రెండో అర్ధభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు పతనమయ్యాయి. ఉదయం లాభాలతో సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ఆ జోరును నిలబెట్టుకోలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 519.34 పాయింట్లు నష్టపోయి 83,459.15 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 165.70 పాయింట్లు క్షీణించి 25,597.65 వద్ద ముగిసింది. ఇంట్రాడే సెషన్‌లో సెన్సెక్స్ ఒక దశలో 0.11 శాతం లాభపడినప్పటికీ, చివరికి నష్టాల్లోకి జారుకుంది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.42 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.82 శాతం చొప్పున నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, ఒక్క నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ మాత్రమే 0.39 శాతం లాభంతో గ్రీన్‌లో నిలిచింది. అత్యధికంగా నిఫ్టీ మెటల్ సూచీ 1.44 శాతం పతనమవ్వగా, ఆటో రంగం 0.86 శాతం, ఐటీ రంగం 0.06 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో పవర్ గ్రిడ్, టాటా మోటార్స్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ ప్రధాన నష్టాల్లో నిలిచాయి. మరోవైపు, టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభాలను నమోదు చేశాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, కొన్ని హెవీవెయిట్ స్టాక్స్‌లో లాభాల స్వీకరణ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ రోజులు తక్కువగా ఉండటంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారని వారు తెలిపారు. నిఫ్టీ 25,600 మార్కు దిగువకు చేరడంతో స్వల్పకాలికంగా బలహీనత కొనసాగవచ్చు. తక్షణ మద్దతు 25,570 వద్ద ఉంది. ఒకవేళ నిఫ్టీ నిర్ణయాత్మకంగా 25,800 స్థాయిని దాటితేనే బేరిష్ ధోరణి ముగిసి, మార్కెట్‌లో కొత్త కొనుగోళ్లు రావచ్చని మార్కెట్ నిపుణులు అంచనావేసారు.




## సత్వరసేవలకోసం ఇండియా పోస్ట్

# 'డాక్‌సేవా యాప్'

**న్యూఢిల్లీ, నవంబరు 4:** తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతో ఇండియాపోస్ట్ మార్పులు చేస్తోంది. శరవేగంగా సేవలు అందించేందుకు కొత్తయాప్‌ను ప్రవేశపెట్టింది. తపాలాశాఖ మొత్తం సేవలన్నీకూడా స్మార్ట్‌ఫోన్‌ద్వారానే వినియోగించుకునేలా డాక్‌సేవ పేరిట యాప్‌ను విడుదలచేసింది. ఇక పోస్టాఫీస్ మీజేబులోనే అన్న నినాదంతో పోస్టల్ శాఖ తన ఎక్స్ ఖాతాలోకూడా పోస్టుచేసింది. పార్సిల్‌ట్రాకింగ్, పోస్టేజి కాలిక్యులేషన్, ఫిర్యాదుల నమోదు, బీమా ప్రీమియం చెల్లింపులు వంటి సేవలు పొందవచ్చు స్పీడ్‌పోస్టు, మనీ ఆర్డర్ వివరాలను రియల్‌టైమ్‌లోట్రాక్‌చేసుకోవచ్చు. దేశీయ అంతర్జాతీయ పార్శిల్ సేవలకు ఎంత ఛార్జి అవుతుందో తక్షణమే లెక్కించుకోవచ్చు. స్పీడ్‌పోస్టు, రిజిస్టరుపోస్టు, పార్సిల్‌బుకింగ్‌సేవలను గంటల తరబడి లైన్‌లోఉండాల్సి అవసరంలేకుండా యాప్‌ద్వారానే పూర్తి చేయవచ్చు.కార్పొరేట్‌కస్టమర్లకోసం ప్రత్యేక యాక్సెస్‌ను కూడా ఏర్పాటుచేసారు. ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో డాక్ సేవా యాప్ అని టైప్‌చేసి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చు. మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ అయ్యాక ఈమెయిల్ ఐడి, లేదా మొబైల్ నంబరుతో రిజిస్టరుఅవ్వాలి. ఒటిపితో లాగిన్ అయి సేవలు పొందవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.